

వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**


సంపుటి : 24 సంచిక : 7
మే - 2021
'ప్లవ' వైశాఖ మాసం

**సంపాదకులు**
**సాగి కమలాకర శర్మ**

**Printed and Published by**
B. Anantha Laxmi
*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**
**Printed at : Sri Sai Process**
**Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

**వివరాలకు : మేనేజర్, మూసీ సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013**
**ఫోన్ : 9347971177**
**email : editormusi@gmail.com**

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
**ISSN 2457-0796**




# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక**

**చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక**

## ఈ సంచికలో ...

### వ్యాసాలు


| | |
|---|---|
| మూసీ సాహిత్య ధార | 6 |
| ఛందశ్శిల్పం - ఒక పరిచయం ... ఆచార్య పి.ఆర్. హరినాథ్ | 7 |
| తెలుగు సాహిత్యంలో వేమన పరిశోధకులు ... శ్రీపతి మారుతి | 11 |
| అత్యుత్తమ చారిత్రక నాటకం - పల్నాటి యుద్ధం.. ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు | 15 |
| మూసీ పదవినోదం - 28 ... డా. తాడేపల్లి పతంజలి | 22 |
| పాదముద్రలు (తెలంగాణ కథకుల పరిచయం)... బి.వి.ఎన్.స్వామి | 23 |
| గ్రంథాంతరంగం 3 - నేటి కాలపు కవిత్వము ... శ్రీ ఘట్టమరాజు | 27 |
| భాషా తరగతి గది - నిర్వహణ వ్యూహాలు ... ఆచార్య వై. రెడ్డి శ్యామల | 31 |
| పద్య మనోహరం -20 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు | 34 |
| అక్షరాయుధాన్ని సంధించే కవి 'సిహెచ్. మధు'... పద్మారాణి | 35 |
| తెలంగాణ మాగాణపు కవిరైతు 'తిరునగరి' ... శ్రీరామోజు హరగోపాల్ | 37 |
| తెలుగులో దాసరి బాగోతాలు - సమగ్ర అధ్యయనం ... కర్రెపు నర్సింహులు | 39 |
| నల్లగొండ జిల్లా నవలా సాహిత్యం ... ఐ. చిదానందం | 41 |
| దేశానికి భాతి - పీవీ ఖ్యాతి ... డా. వొజ్జల శరత్ బాబు | 47 |
| కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 13 ... టి. లక్ష్మీనారాయణ | 51 |
| శాసనముల ద్వారా తెలుగు భాషా పరిణామము ... కీ.శే. బి.ఎన్.శాస్త్రి | 54 |


### కవితలు


గుహ్య నారసింహ! నవరూప !! ...అన్నమరాజు ప్రభాకర రావు - 5; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్ - 6; తిరుగుబాటు ... కె. ప్రభాకర్ - 9; గెలుపెవరిదో ... ఎన్. నరేశ్ చారి - 10; మళ్ళీ పంజా విసురుతుంది ... అనితా దావత్ - 10; నగర జీవితం ... అరుణ నాయని - 13; పొద్దు తిరుగుడు పువ్వులు ... ఆచార్య సూర్యాధనంజయ్ - 14; మాండూక్యోపనిషత్తు (అనువాదం) ... జక్కని వెంకటరాజం - 14; రైతు ... అట్టెం దత్తయ్య - 26; నేను ఇప్పుడూ ... డా. సిహెచ్. ఆంజనేయులు - 33; మేడే - కార్మిక దినోత్సవం ... డా. నీలిమా కృష్ణమూర్తి - 34; చావు నడచిన తొవ్వ ... డి. ప్రకాశ్ - 50; పద్మవ్యూహం ... తండ హరీష్ గౌడ్ - 60; ప్రాణ నేస్తాలు ... జినుకుల వెంకటేశ్ - 60; బ్యాచిలర్ రూం ... తగుళ్ళ గోపాల్ - 62;


### సమీక్షలు


| | |
|---|---|
| తెలంగాణ కథ - పరామర్శ ... స్వప్న భువకర్ | 57 |
| చిన్న గల్పికలు - గొప్ప ఆలోచనలు .... యడవల్లి శైలజ (ప్రేమ్) | 59 |
| స్వీకృతి ... | 61 |



**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**



*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

## వాహిక

సంస్కృతంలో 'వహ్' శబ్దానికి అనేక అర్థాలున్నాయి. వాహనం, వాహినీ, వివాహం, ప్రవాహం వంటి వేరు వేరు అర్థాలలో ప్రయోగాలు కూడా ఉన్నాయి. తన నుండి ప్రవహించడానికి అవకాశం కలిగించునదే వాహిక. ద్రవాదులు ప్రవహించాలంటే వాటిని కొన్ని పైప్స్ గుండా పంపిస్తుంటారు. అంటే అటువంటివి కూడా వాహికలే. ఏది ప్రవహించాలన్నా కొన్నింటి గుండా ప్రయాణం చేయక తప్పదు. వాహిక శుభ్రంగా ఎటువంటి అడ్డంకులు లేకుండా ఉంటే ప్రవహించేది వేగంగా ప్రవహించ గలదు. ప్రవహించేది కూడా శుద్ధమైనది అయితే ఇంకా మంచిది. ప్రవహించేదానిలోనే అన్నీ అడ్డు పడేవి ఉంటే ఎక్కడో ఒక దగ్గర ప్రవాహాలు ఆగిపోతుంటాయి.

మన శరీరం కూడా ఒక వాహికనే. ఇది జీవధారా వాహిక. సంస్కృతీ సంప్రదాయాలకు వాహిక. భాష, భావాలకు వాహిక. ఒక తరం నుండి మరోతరానికి అనేక విషయాలను అందించడానికి ఒక రకమైన వాహికగా పనిచేస్తున్నది మన శరీరం. తాము గమనించిన నూతనాంశాలను కూడా తమ ద్వారా తరువాత తరానికి అందిస్తుంటుంది. ఇలా అందించడంలో అందరు తల్లులు, తండ్రులు ఉన్నా అందరికన్నా ఎక్కువగా ఆచార్యులుంటారు. వారి ద్వారా చాలామందికి జ్ఞానధార అందుతూ ఉంటుంది. శుద్ధం చేసుకున్న శరీరం, మనస్సుల ద్వారా ఎక్కువ మందికి జ్ఞానం అందుతుంది. శుద్ధత లేని దేహాదులు తమ భావాన్ని పూర్తిగా అందించలేవు. ఒకవేళ అందించినా దానిలోనుండి అసమగ్రత, వ్యతిరేకత, కుసంస్కారాదులు బయటకు వస్తాయి. మంచినీటి పైపు అయినా, డ్రైనేజీ పైపు అయినా వాహిక మాత్రమే. వాహికలో శుభ్రత ఉంటే తమ దగ్గర ఏదీ స్టాక్ అయ్యే అవకాశం ఉండదు. వాహిక సరియైన విధంగా శుద్ధమై లేకుంటే చెడు ఎక్కువగా అడ్డు పడడం వల్ల మంచి కూడా అందకుండా పోతుంది.

మన మనస్సు, శరీరాలు దైవానికి వాహికలు కావాలి. దైవం అంటే ప్రవహించే శక్తి స్వరూపమే. చైతన్యమే. ఆ చైతన్యం అడ్డంకులు లేకుండా ప్రవహిస్తున్నంతసేపు ఈ శరీరాదులు ఆనందంగానే ఉంటాయి. వాటికి అడ్డం ఏర్పడినప్పుడే మనస్సుకు సమస్యలు, శరీరానికి రోగాలు వస్తాయి. శరీరంలోనూ రక్తనాళికల గుండా రక్త ప్రసారం, నరాల నుండి విశ్వ శక్తి ప్రసారం నిరంతరం అతి వేగంగా జరుగుతూనే ఉంటుంది. దానిలోనూ ఇబ్బంది వచ్చిందంటే అక్కడా బ్లాక్స్ ఏర్పడుతుంటాయి. భారతీయ జీవన ధర్మ వ్యవస్థ దీనికి 'పాపం' అని పేరు పెట్టింది. ఈ బ్లాక్స్ ఏమీ లేకుండా ఈ ప్రవాహం అతి నిర్మలంగా, వేగంగా ఉంటే దానికి 'పుణ్యం' పేరునిచ్చింది. పుణ్యం పెరగడానికి, పాపం తరగడానికి ఎన్నో మార్గాలను కూడా భారతీయ సమాజం నిర్దేశించింది. మూఢత్వం లేని వైజ్ఞానిక ధోరణిలో తనను తాను నిరంతరం శుద్ధి చేసుకుంటూ పుణ్యపురుషులుగా మారేందుకు అనేక రకాల కట్టుబాట్లనూ సూచించింది. అర్థం చేసుకోవడం, పాటించడమే మన ధర్మం.

ఏది ఏమైనా మన శరీరం, మనసులు దైవం వినియోగించుకునే వాహికలు. ఈ వాహికలను దైవం వినియోగించుకుని తన శక్తితో ప్రవహిస్తే ఈ శరీరం, మనసులు అమృతమయాలు అవుతాయి. శరీరం తప్పనిసరై మరణించినా జీవి పేరు మిగిలిపోతుంది. మనం నిరంతరం మనకు తెలిసిన పరిమితుల్లో ఏదో పోగొట్టుకుంటామేమో అనే భయంతో ఉంటే ఈ వాహిక పూర్తిగా పాడైపోతుంది. ప్రస్తుత ఆపత్కాలాల్లో మనం నిరంతరం వాహికను శుద్ధం చేసుకుని ప్రేమామృతాలు దీని నుండి వెళ్ళేట్లు చూద్దాం. భయాందోళనలకు వాహికలమైనపుడు దేహం వెంటనే సహజశక్తిని కోల్పోయి నాశనం అవుతుంది. ఆనందాలకు, ధైర్యానికి, శక్తికి, చైతన్యానికి వాహిక అయితే తనకే కాదు, ఈ లోకానికి కూడా ఈ దేహం, మనస్సులు సద్వినియోగం అవుతాయి. వాహికను నిరంతరం దైవ భావంతో శుద్ధి చేద్దాం. సేవాభావంతో తరింపజేద్దాం. ప్రేమామృతంతో ఆనందింపజేద్దాం.

# గుహ్య నారసింహా! నవరూప!!




వేదాద్రి వేంచేసి వెల్గులీనెడి యోగ
నరసింహ దేవుడై వరములిడగ ,
సింహాద్రి వేంచేసి శ్రీక్రోధ నరసింహు
ధ్యేయస్వరూపమై హాయిగొల్ప,
యాదాద్రి వేంచేసి యద్భుత జ్వాలా నృ
సింహ రూపంబున చింతదీర్ప,
మాల్యాద్రి వేంచేసి మల్యాల నరసింహ
దివ్యాకృతి నమిత తేజమిడగ,
మంగళాద్రి వెలసి మహనీయ పావన
నరసింహ మహిమల నతులనంద,
ఖాద్రీన వేంచేసి ఘన కరంజనృసింహ
మూర్తి పూజలనంది ముదమునొంద,
పెనుశిల కోనలో వేంచేసి ఛత్రవ
తీ నృసింహాకృతి తేజమలర,
అంతరవేదిలో నానంద నరసింహ
ధిషణ మెల్లెడల దీధితు లెసగగ,
ధర్మపురి క్షేత్రమర్మాన వేంచేసి
భార్గవ నరసింహ భావమలర



పావన యహోబిలంబున భక్తజనుల
కోర్కెలీడేర్ప వెలసిన గుహ్యనార
సింహ నవరూప ! లోకవశీకర ! విను
తోత్తమగుణసార ! నిలింప చిత్త చోర !!

ధాతువు నీవె, దశేంద్రియ
జేత్తవు నీవే, పృథివిని శ్రీదాతవున్నీ
వే, తారకుడవు నీవే,
నేతవు నీవె జగములకు - నిజముగ నృహరీ !!

---

**అన్నమరాజు ప్రభాకర రావు**
హైదరాబాదు
ఫోన్ : 94402 58292

# మూసీ సాహిత్య ధార - 31


## 'ఛందః శిల్పం - ఒక పరిచయం

మూసీ సాహిత్య ధార నిరంతర పరిశోధన స్రవంతి 31వ సమావేశం.

ఈ సమావేశానికి ప్రధాన వక్తగా ఆచార్య పి.ఆర్.హరినాథ్ గారిని ఆహ్వానించడం జరిగింది. వారు 'ఛందఃశిల్పం - ఒక పరిచయం' అనే అంశంపై ప్రసంగించారు. ఇప్పుడు కొంతవరకు విస్మృతికి గురైన అంశాన్ని తీసుకుని ఛందస్సు మాధుర్యాన్ని, విశేషాన్ని, ప్రయోజనాన్ని ఎంతో గొప్పగా ప్రసంగించారు. ఛందస్సులో బేధాలు, ఛందస్సును ప్రముఖ కవులు వాడిన సందర్భాలను ఉదాహరిస్తూ విశ్లేషించిన తీరు ప్రశంసనీయం.

ఈ వేదికలో భాగంగా ఎప్పటిలాగే ఒక పరిశోధక విద్యార్థి వారి స్వీయ పరిశోధన అంశం గురించి ప్రసంగిస్తారు. మరో విద్యార్థి పుస్తక సమీక్ష చేస్తారు. ఆ బాధ్యతలను ఈ మాసం కె. నర్సింలు, కుర్మకోరె రవిలు స్వీకరించారు. కవితాగానంలో భాగంగా డి.ప్రకాశ్, అరుణ నాయని పాల్గొన్నారు. ఈ సమావేశాన్నంతటిని అట్టెం దత్తయ్య సమన్వయం చేయగా డా. సాగి కమలాకరశర్మ, డా. ఎస్. రఘుగార్లు పర్యవేక్షించి, సమీక్షించారు. ఈ సమావేశంలో వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పరిశోధక విద్యార్థులు, పి.జి.విద్యార్థులు, మూసీ పరివారం పాల్గొని విజయవంతం చేసారు.




## తుకారాం అభంగం

భక్తి భావముతో పండరీ
పోదాం పదరే సాధువులతో
కూడుదాము భీమా తీరంలో
పోరుదాము ఆ దేవునితో

దోచేద్దాము పండరీపురాన్ని
పట్టేద్దాము రుక్మిణీ వరుణ్ణి
అతడే అది మధ్యాంతరహిత
ఆత్మ రూప నివాసుడు

తుకా పలికే పదండి పోదాం
గురి తప్పకుండా సాధన చేద్దాం
అతడే చూపునురా మార్గం
అందులోనే ఉన్నది మోక్షం




అనువాదం : మంత్రి శ్రీనివాస్
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉ.వి.,
ఫోన్ : 83283 33720

మూసీ సాహిత్యధార
ప్రధాన ప్రసంగం

# ఛందశ్శిల్పం - ఒక పరిచయం

**ఆచార్య పి. ఆర్. హరినాథ్,** తెలుగు ఆచార్యులు, రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్, మానస గంగోత్రి, మైసూరు. ఫోన్ : 915 423 8058

ఒకసారి మహాకవి పుట్టపర్తి నారాయణాచార్యుల వారిని కలవడానికి వారింటికి వెళ్ళాను. ఆయన ఆ సమయానికి బయట అరుగు మీద కూచుని ఉన్నారు. నేనూ, శశిశ్రీ ఇద్దరం తరచుగా వెళ్ళే వాళ్ళం. అలా వెళ్ళగానే ఆయన కొళాయి దగ్గర ఉన్న ట్యూబుని చూపుతూ – 'చూడరా, లయ, గతి అన్నవి అంతటా ఉన్నాయి. ఛందస్సు లేదని అంటారు కొంతమంది' – అన్నారు. అక్కడ కొళాయి ట్యూబు కనెక్షన్ చెదరి నీళ్ళు చిమ్ముతున్నాయి. అవి ఆగి ఆగి ఒక పద్ధతి ప్రకారం వెలువడుతున్నాయి. దాని గతి ఒక ఛందస్సులాగా ఉంది. అది మహాకవి దర్శనం. వారికి సాష్టాంగ ప్రణామాలు.

ఛందస్సు అనేది శాస్త్రీయంగా మనం గుర్తు పెట్టుకోడానికి తయారు చేసుకున్న పరిభాష. గాలిలో ఆక్సీజన్ ఉన్నట్లు, మానవ వ్యవహారంలో ఛందస్సు పెనవేసుకుపోయింది. ఛందోవర్జితమైన శబ్దమే లేదని పండితులన్నారు. (ఛందశ్శాస్త్రం వహిత్రం తద్వివిక్షో కావ్య సాగరం / ఛందోభాగ్ వాఙ్మయం సర్వం న కించిచ్ఛందసా వినా) – (జయకీర్తి – ఛందోనుశాసనం)

'ఛాదనాత్ ఇతి ఛందః' – కప్పి ఉంచేది ఛందస్సు, 'ఛది ఆవరణే' – ఇలాటి నిర్వచనాలను పరిశీలించినపుడు – ఛందస్సు అంటే ఒక పరివేషమనీ, ఆహ్లాదమూ, ఆనందమూ కలిగించే గతి అనీ మనకు స్పష్టమవుతుంది. ('ఛది ఆహ్లాదనే' – ఆహ్లాదాన్ని కలిగించేది ఛందస్సు. 'ఛది రూర్జనే' – బలం కలిగించేది ఛందస్సు; 'ఛది అపవారణే' – ఏది నివారిస్తుందో అది ఛందస్సు. 'ఛందాంసి ఛాదనాత్' – కప్పి ఉంచేది ఛందస్సు... ఇత్యాది నిర్వచనాలలో ఛందస్సును వైదిక దృష్టితో చెప్పారు. వేదజ్ఞులను ఆహ్లాదపరిచేది ఛందస్సు; అలాగే వేదాధ్యయన పరులను బలిష్టంగా రూపొందించేది; ఏది పాపాలను, దోషాలను నివారిస్తుందో అది ఛందస్సు అని ఈ మాటల ఆశయం.)

ప్రపంచ భాషలన్నింటిలోనూ వాటికి తగిన ఛందోగతి ఉంటుంది. లయ, గతి మారినపుడు అర్థస్ఫురణ మారుతుంది. ఒకేమాటను భిన్న సందర్భాలలో – భిన్న వాచిక సంవిధానంతో– పలికినపుడు – వేర్వేరు అర్థాలనిస్తుంది.

తరగతి ఆరంభమైనాక ఒక విద్యార్థి ఆలస్యంగా గదిలోకి ప్రవేశం కోరినపుడు, అధ్యాపకులు 'సమయానికి రావడం అనేది వీడిని చూసి నేర్చుకోండి' అన్నాడనుకోండి. ఆ పలుకుల వెనుక వినిపించే కాకువు వ్యతిరేకార్థాన్నిస్తుంది. దీనిని 'మాడ్యులేషన్' అంటున్నాం. పదానికి ఒకే అర్థం ఉండగా, దానిని భిన్నగతిలో పలికినపుడు అర్థభేదం సిద్ధించడం మనకందరికీ అనుభవంలో ఉన్న విషయమే. దీన్ని బట్టి




లయ, గతి అనేవి మానవ జీవితంలో వాగ్వ్యాపారాన్ని ఉద్దీపింప చేసేవిగా భావించవచ్చు.

గ్రీకు, లాటిన్ భాషల ప్రభావమున్న ఐరోపీయ భాషల్లో కూడా దీన్ని గమనించవచ్చు. Accent అని వారు చెప్పే మాటను 'ఆఘాతం' అని గుర్తించవచ్చు. స్వరభారం, ఊనిక వంటిదిది. ఆఘాతం ఉన్నది గురువు (U) లేనిది లఘువు (I). ఉదాహరణకు : (మరిన్ని వివరాలకు చూ. తెలుగు ఛందో వికాసము; డా. కోవెల సంపత్కుమార, పు. 17–18)

Dactyl – ఒక సాఘాతం + 2 నిరాఘాతలు – U+II = భగణం

Trochee – ఒక సాఘాతం + ఒక నిరాఘాతం – UI = గలం

lambus – ఒక నిరాఘాతం + ఒక సాఘాతం – IU - లగం

వీటి ఆధారంగా మళ్ళీ మూడు భేదాలు :

Spondee – రెండు సాఘాతాలు – UU – గగం

Tribrach – మూడు నిరాఘాతాలు – III - నగణం

Anapaest – రెండు నిరాఘాతాలు + 1 సాఘాతం – IIU = సగణం

అందుచేత ఛందోగతి విశ్వమంతటా కనిపిస్తుంది. అందుకే పాణినీయ శిక్ష స్పష్టంగా తెలిపింది.

**ఛందః పాదౌతు వేదస్య హస్త కల్పోఽథ పఠ్యతే**
**జ్యోతిషామయనం చక్షుః నిరుక్తం శ్రోత్రముచ్యతే**
**శిక్షాఘ్రాణంతు వేదస్య ముఖం వ్యాకరణం స్మృతం**

ఛందస్సు అనేది వేదానికి పాదం లాంటిది. గతికీ, గమనానికీ పాదాలే మూలం గదా! అదే విషయాన్ని ఇక్కడ ప్రతీకాత్మకంగా చెప్పారు.

ఛందస్సుకున్న ప్రయోజనాలలో ఛాదనం ఒకటి. కొన్నిసార్లు భావం వెనుకబడినపుడు, అంటే పద్యంలో శబ్దం ప్రాధాన్యం వహించినపుడు ఛందస్సు ఒక భ్రమాకల్పనం చేస్తుంది. దీనివల్ల పఠిత లేదా శ్రోత మనస్సులో ఒక రసావేశం కలుగుతుంది. శబ్దమూ, అది నడిచే లయాత్మక గతీ రెండూ కలిసి పాఠకుని మనసును పరవళ్ళు తొక్కిస్తాయి.

ఈ సందర్భంలో పెద్దన మనుచరిత్ర నుంచి రెండు పద్యాలను గమనిద్దాం.

**శ్రేణులు గట్టి నభోంతరాళమున పారెన్ పక్షులుష్ణాంశు పా**
**షాణ వ్రాతము కోష్ణమయ్యె మృగతృష్ణా వార్ధులింకెన్ జపా**
**శోణంబయ్యె బతంగ బింబము దిశా స్తోమంబు లాశాదరి**
**ద్రాణంబయ్యె సరోజ షండములు నిద్రాణంబులయ్యేన్ గడున్**
(3-12)

**జలజాగార పరంపరల్ మఘవదాశాభిత్తి తీంద్రించుచున్**
**దళమై వెన్నెల చిచ్చులంటిన మిళద్వ్యాహ్యచ్ఛద శ్యామకా**
**ఛలనంబంది ముదుంగుచో సిమసిమచ్ఛంబ్దంబునన్ బుట్టు న**
**గ్గలపుం గ్రొంబొగలో యనంగ వెడలెన్ గర్భస్పనద్భృంగముల్**

ఈ రెండు పద్యాలను పోల్చి చూసినపుడు (నిజానికి కవిత్వాన్ని పోల్చడం రసికత కాదు. అది మరో సంగతి)

రెండో పద్యంలో ఎక్కువ భావుకత ఉంది. మొదటి పద్యంలో శబ్ద సౌందర్యం, ఒక తూగు ఉన్నాయి. ఆ గతి సౌందర్యం చేత రెండవ పద్యం కంటె ఎక్కువగా అది ప్రసిద్ధమైంది.

చిత్రలేఖనంలో కూడా కొన్ని సందర్భాలలో రంగులే వస్తువులు కావడాన్ని గమనించవచ్చు. వర్ణ సంగీతం - అంటున్నాం. అలాగే కవిత్వంలో కూడా శబ్దమే కవిత్వం కావడం కూడా అసంబద్ధమేమీ కాదు.

శబ్దమొక్కటే కాదు, దాని లయాత్మక గమనం కూడా ప్రభావాన్ని చూపుతుంది. కవిత్వ విద్యలో అంచులు తాకిన ఆంధ్ర కవితా పితామహుడు పేరులో మాత్రమే కాదు - రచనలోనూ అందరికీ పెద్దన్న. శబ్దగతినీ, కవిత్వాన్నీ పెనవేయగల ప్రజ్ఞ ఆయనది.

ప్రవరాఖ్యుడు వరూధినిని చూసిన సందర్భంలోని పద్యాన్ని దీనికి తార్కాణంగా చూడవచ్చు.

సిద్ధుడి పాదలేప ప్రభావంతో ప్రవరుడు హిమాలయాలకు వచ్చాడు. ఆ చోటును దర్శించాలనేది అతడి జీవితాశయాలలో ఒకటి. ఇంక మరే చోటుకు వెళ్ళినా బాగుండేది. గయ, ప్రయాగ.. ఇలాంటివెన్నో ఉండగా మంచుకొండకు వచ్చాడు. ఆ మంచుకు పాదలేపం కరిగిపోయింది. తిరిగి వెళ్ళాల్సిన వేళ సమీపించింది. కరిగిన లేపనం కదలనివ్వలేదు. దారి తెలీదు. చెప్పే దిక్కులేదు. మనిషి కోసం వెతికాడు. మగువ కనపబడింది. కర్పూర తాంబూలాన్ని చర్వణం చేసిన కన్యకామణి ఆ తాంబూల పరిమళం గాలిలో అల్లుకుంది. ఆ పరిమళాన్ని బట్టి ఇక్కడెవరో ఉన్నారని తలచాడు.

**అతడా వాత పరంపరా పరిమళ వ్యాపారలీలన్ జనా**
**న్విత మిచ్చోటని చేరబోయి గనియెన్ విద్యుల్లతా విగ్రహన్**
**శతపత్రేక్షణ చంచరీక చికురన్ చంద్రాస్య చక్రస్తనిన్**
**నతనాభిన్ నవలా నొకానొక మరున్నారీ శిరోరత్నమున్** (2-25)

'కనియెన్' అనే క్రియాపదం దగ్గర పద్యం ఆగిపోయింది. తక్కిన దృశ్యమంతా విశేషణాలే. విభ్రమం కలిగించే, విస్మయ పరిచే సౌందర్యమే.

ఒక వృత్తాన్ని ప్రయోగిస్తున్నపుడు దానికి ఒక ప్రయోజనం ఉందని ఛందోవేత్తలు తెలిపారు. 'శౌర్యస్తవే నృపాదీనం శార్దూల క్రీడితం మతం' వంటివి పింగళాదులు చెప్పడంలో సూచన ఏమంటే ఆ గతి వాటికి అనుకూలంగా ఉందని మాత్రమే తప్ప - అదే వృత్త ప్రయోగం చేయాలనే ఆజ్ఞ కాదు. ప్రతిభావంతుడైన కవి ఛందో నియమాలను దాటి పోగలడు. ఒకే ఛందస్సులో భిన్న రసాలను పలికించిన క్రింది పద్యాలను గమనించండి :

**నలదమయంతులిద్దరు మనః ప్రభవానల బాధ్యమానలై**
**సలిపిరి దీర్ఘవాసర నిశల్ విలసన్నవ నందనంబులన్**
**నళిన దళంబులన్ మృదు మృణాళములన్ ఘనసార పాం**
**శులన్ తలిరుల శయ్యలన్ సలిల ధారల చందన చారుచర్చలన్**

(అరణ్యపర్వం)

మొదటి పద్యంలో నలదమయంతుల విరహ వర్ణన ఉంది. కోమలమైన శృంగార భావం. ఈ పద్యం చంపకమాల వృత్తంలో ఉంది. ఛందో లక్షణాల ప్రకారం నజభజజజర - అని పాదానికి నాలుగు జగణాలుంటాయి. నాలుగు పాదాలకు మొత్తం 16 జగణాలు. పద్యమంతా ఎగసి పడుతూండాలి. కానీ పద్యం చదివినపుడు ఎక్కడో తప్ప జగణం వినబడదు. అందువల్ల ఒక ఎగుడుదిగుడులు లేని సమతలంపై నడిచినట్లు ఉంటుంది.

రెండోపద్యం కూడా చంపకమాల వృత్తంలోనే ఉంది. విరాటపర్వం లోనిది. విరటుని కొలువుకూటంలో సైరంధ్రి వెంట కీచకుడు పడ్డాడు. ఆమె రక్షణ కోరుతూ రాజు దగ్గరకి వచ్చింది. అక్కడ భీముడు వంటలు చేసుకునే వాడిలాగా వలలుడు అనే పేరుతో మారువేషంలో ఉన్నాడు. అతని కళ్ళ ఎదుట జరుగుతూంది. ఈ అవమానకర దృశ్యం భీషణమైన ఆవేశంలో పట్టరాని కోపంతో పక్కనున్న చెట్టును పెళ్ళగించాడు. అప్పటి వర్ణన ఈ పద్యం.

ఈ పద్యం చంపకమాలే అయినప్పటికీ శబ్ద సంపత్తి చేత, సమాస వైదగ్ధ్యం చేత ఒక మత్తేభమో, శార్దూలమో అన్నట్లుంది. శృంగారానికి ప్రయోగించాల్సిన చంపకమాలను క్రోధానికి, వీరానికి ప్రయోగించి

తిక్కన నియమాన్ని ధిక్కరించాడు. కవిదే పై చేయి అని చాటాడు. ఛందస్సు గుర్రమైతే కవి రౌతు.

**'పొలాలనన్నీ**
**హలాల దున్నీ**
**ఇలాతలంలో హేమం పిండగ –'** అన్నప్పుడూ ...

**'మరో ప్రపంచం మరో ప్రపంచం**
**మరో ప్రపంచం పిలిచింది'** (మహా ప్రస్థానం) .. అన్నప్పుడూ ఆ కదను తొక్కించడం కనిపిస్తుంది.

**'జగణంలో జగడం కో**
**రగా దగదు – '** (సిప్రాలి) అని తెలిసిన ఛందో రహస్యవేత్త శ్రీశ్రీ.

కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి రామాయణ కల్పవృక్షంలో విశేష వృత్తాల ప్రయోగం విశేషంగా సాగింది.

విశేష వృత్తాల ప్రయోగంలో రెండు రకాల పోకడను గమనించ వచ్చు. ఒకటి, ఆ వృత్త నామాన్ని అనుసరించి – ఆ సందర్భానికి తగినట్లు ప్రయోగించడం – అవతార పురుషుడైన శ్రీరాముడు జన్మించబోతున్న ఉదయం – చాలా విశిష్టమైనది. అది అన్ని ఉదయాల లాటిది కాదు. అందుకని ఆ ఉదయం గురించి **'ప్రభాతం'** అన్న వృత్తంలో వర్ణించడం ఈ కోవకు చెందినది.

మరో పద్ధతిలో వృత్తానికి ఉన్న గతిని అనుసరించి సందర్భానుసారం ప్రయోగించడం. **'విచికిలితం'** అనే వృత్తంలో పరశు రాముని వీరత్వాన్ని వర్ణించాడు. ఈ వృత్తగతి **'ఉత్సాహ'** వృత్తానికి దగ్గరగా ఉంటుంది.

**'పొదివి పొదివి నృపుల తలలు పుణికి పుణికి నరకి–'** (ధను. 471) ఇలా సాగుతుంది. ఈ ఛందస్సును గతి ననుసరించి ప్రయోగించారు.

జటాయువు చూపిన సాహసంలో కూడా ఛందో నిపుణత గమనించవచ్చు. రావణాసురుడు బలశాలి. అష్టద్వారపురమైన లంకకు అధిపతి. అలాటి మహావిక్రముడు సీతను తస్కరించి రథంలో ఉంచుకొని ఆకాశమార్గాన వెళ్తున్నాడు. ఆమె ఆక్రందిస్తూంది. అది విని జటాయువు రక్షించడానికి వచ్చాడు. అతడికి రెక్కలే ఆయుధాలు. ఇటు ఎదిరించవలసినది రావణాసురుడిని. అతడి ఖడ్గం చంద్రహాసం. అంతటి ఆయుధ ధారిని తన రెక్కలతో కొట్టి ఆపబోతున్నాడు జటాయువు.

**'ఏరా పక్షి, అదేమొ వాగికొని, నీవేపోదువన్నన్ గరు**
**ద్ధారా పాతము తాచినావు – '** అని కోపంతో ఖడ్గ ప్రహారం చేశాడు రావణుడు పక్షికి పక్షం తెగి నేలకూలింది. ఇక్కడ 'పక్షీ' అనడం ఒక తిట్టులానే ఉన్నా అక్కడ ఉన్నదీ పక్షే. ఇందులో ప్రాసస్థానం 'రా' సరిగ్గా 'గరుత్ – ధారా' అని రెండు పాదాలుగా విరిగింది. గరుత్ – రెక్కలు, అవి ఒక్కసారిగా మీదపడ్డాయి. రావణాసురుని రథం ఊగింది. ఆ పద్యం ఎలా ఉందో ఈ పద్యపు నడక చెపుతూంది. మొదటి పాదపు బరువంతా వచ్చి రెండవపాదంపై పడుతూ ఉన్నట్లు – గరుత్ – అనే మాట – ధారా' అనే మాటపై నొక్కి పడుతూంది.

కనుకనే ఛందస్సు ఒక శిల్పం. మహాకవి ఒక శిల్పి.

**ఉపయుక్త ముఖ్య గ్రంథావళి :**


1. తెలుగు ఛందో వికాసము; డా. కోవెల సంపత్కుమారాచార్య; తెలుగు అకాడమీ, హైదరాబాదు. 1990.

2. తెలుగులో దేశిచ్ఛందస్సు; ప్రారంభ వికాస దశలు; డా. సంగనభట్ల నరసయ్య, ఆనందవర్ధన ప్రచురణలు. ధర్మపురి, ఏప్రిల్ 2009.

3. శ్రీమద్రామాయణ కల్పవృక్ష – బాలకాండ ఛందోవస్తుశిల్పము; డా. పవని ఆర్. హరినాథ్; పవని ప్రచురణలు, అనంతపురం 1992.

4. కన్నడ ఛందః స్వరూప (కన్నడం), డా. టి.వి. వెంకటాచల శాస్త్రి; డి.వి.కె. మూర్తి ప్రకాశన; మైసూరు 2005.

5. ఆంధ్ర మహాభారతం; కవిత్రయం.

6. మనుచరిత్ర ; అల్లసాని పెద్దన.


---

## తిరుగుబాటు

ఆరాధిస్తావో
ఎదురు తిరుగుతావో
అలిగిపోతావో
నలిగిపోతావో
విజయానికి ఎన్ని మెట్లో
అపజయానికి అన్ని గట్లు
కన్నీళ్ళు తుడుస్తావో
కన్నీళ్ళు పెడతావో
పొత్తుల కత్తుల సంసారాలతో విడిపోతావో
విచ్చు కత్తుల పహారా ఉమ్మడి కుటుంబం
నిచ్చెనలను దిగివచ్చి
పచ్చి నెత్తురు తాగుతావో
కచ్చితంగా చెప్పలేక
లోలోపల కుమిలి కుమిలి
అంతరంగంలో రగిలి రగిలి
జీవచ్ఛవంగా మిగిలిపోతావో
అంతా నీ ఇష్టం

**కె. ప్రభాకర్**

# గెలుపెవరిదో..!

కత్తులు లేవు
బాంబులు లేవు
రక్తపాతమసలే లేదు
కానీ
ప్రపంచ యుద్ధం మాత్రం
ముమ్మరంగా జరుగుతోంది
శవాల కుప్పలు
ఎవరెస్టు శిఖరాలవుతున్నాయ్
ఆర్తనాదాలు
అరణ్యరోదనలవుతున్నాయ్
కనీవినీ యెరుగని వింత యుద్ధమిది
చరిత్రలో
ఏ రాజూ చేయలేదు
భవిష్యత్తులో
ఏ పాలకుడూ చేయడు

ప్రపంచం అంతా ఒకవైపు
కరోనా ఒకవైపు
శత్రువు ఒక్కరే
కంటికి కనిపించదు
కానీ
కళ్ళముందే తిరుగుతుంది
ప్రతి వ్యక్తిని
అణుబాంబుగా మార్చేయగలదు
కరోనా కనికట్టు నేర్చిందేమో!

యుద్ధం ముగియాలంటే
ఒకప్పుడు
శాంతి ఒప్పందం జరిగేది
కానీ ఈ యుద్ధమే
శాంతియుతంగా జరుగుతోంది
కాలం మారింది
ఈ శాంతియుత యుద్ధాన్ని
కలసికట్టుగా కాదు
విడివిడిగా పోరాడితేనే
గెలవగలమని రూఢి అయ్యింది

తరచిచూస్తే
ఈ యుద్ధానికి కారణాలు
రెండని తేలింది
ఒకటి అస్తిత్వం కొరకు
రెండు ఆధిపత్యం కొరకు
అస్తిత్వం కోసం మనిషి
ఆధిపత్యం కోసం కరోనా
అలుపెరుగని యుద్ధవీరుడికిమల్లే
అహర్నిశలూ పోరాడుతున్నారిద్దరూ
తుదకు
ఈ శాంతియుత యుద్ధంలో
గెలుపెవరిని వరిస్తుందో మరి !

**ఎన్. నరేశ్ చారి**
**తెలుగు భాషోపాధ్యాయులు, రంగంపేట, మెదక్ జిల్లా.**
**ఫోన్ : 9701 334 516**

# మళ్ళీ పంజా విసురుతుంది

మరణ మృదంగం ఆగనే లేదు
మనసుకు తగిలిన గాయాలు మానసే లేదు
వలస కూలీల గొంతులో తడి ఆరనే లేదు
కార్మికుల కష్టాలు తీరనేలేదు
ప్రజల జీవన శైలిలో మార్పు రానే లేదు

మళ్ళీ మొదలైనది మారణ హోమం
విశ్వ మానవాళిని భయంతో గజగజలాడేట్లు చేస్తుంది
పేరు వింటే చాలు శరీరంలో వణుకు పుడుతుంది
జనాలకు ఆసుపత్రిలో బెడ్డులు లేక
శ్వాస అందక ఆక్సిజన్ దొరకక
ప్రాణాలతో చెలగాటం ఆడుతుంది.
ఒకరిని ఒకరు చూసుకోకుండా పలకరించుకోకుండా
సమస్త భూమండలాన్ని కకావికలం చేస్తోంది

కానీ సహనంతో ఉంటే కరోనాను
ఎదురుకోవడం కష్టమేమీ కాదని తెలుసుకోరందరు

మాస్కులు ధరించి కరోనాను తిప్పి కొడదాం
సానిటైజర్ ను వాడుదాం
కరోనాను అరికడదాం
షేక్ హ్యాండ్ లు మానేద్దాం
నమస్కారమే సంస్కారం అని తెలుపుదాం
స్వీయ నియంత్రణ పాటిద్దాం
కరోనాను రూపుమాపుదాం
ఫాస్ట్ ఫుడ్ లను హోటల్ భోజనాన్ని మాని
యింటి భోజనమే మంచిదని తెలుసుకుందాం..


**అనిత దావత్**
**హైదరాబాద్, ఫోన్ : 9394 221 927**

# తెలుగు సాహిత్యంలో వేమన పరిశోధకులు

**శ్రీపతి మారుతి,** తెలుగు పరిశోధక విద్యార్థి, హైదరాబాదు విశ్వవిద్యాలయం, ఫోన్ : 915 423 8058


**"ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ మన తెలుగు కవులలో మహానుభావులు. రచనా బాహుళ్యం వల్ల వీరిలో ఏ ఒక్కరికో మహాకవి స్థానం సిద్ధించలేదు. తెలుగుతనానికి ప్రాతినిధ్యం వహించి, తెలుగు భాషకు గల ప్రత్యేకతను ప్రదర్శించడం వల్లనే వీరు జగద్వంద్యులయ్యారు"** అని శ్రీశ్రీ, గురజాడ ముత్యాలసరాల పరిచయంలో చెప్పిన మాటలకున్న అంతర్యంలో తెలుగులో సాహిత్యంలో వేమనకున్న గొప్పతనం అవగతమవుతుంది. తన చుట్టూ ఉన్న సమకాలీన సమాజాన్ని స్వప్రతిభతో పద్యాల రూపంలో చిత్రించిన గొప్పకవి వేమన. వేమన మన తెలుగు సారస్వతంలో మధ్యయుగాల నాటి కవి. క్రీ.శ 17వ శతాబ్దంలో జీవించి తెలుగు ప్రాంతంలోని ప్రజల జీవితాన్ని తన పద్యాల రూపంలో మూటగట్టిన ప్రజా రచయిత వేమన. వేమన జీవిత విషయాలు, అయన చెప్పిన పద్యాల్లో తాత్వికత, భావజాలం మొదలైన విషయాలలో సాహిత్యలోకంలో భిన్నాభిప్రాయాలున్నట్లు గమనించవచ్చు. వేమన మీద అనేక భావజాలాలు కలిగిన అనేకమంది విమర్శకులు, పరిశోధకులు, రచయితలు వారి వారి దృక్పథాలననుసరించి వ్యాసాలు రాసారు. పరిశోధనలు చేశారు. తెలుగు సాహిత్యంలో ఒకే కవి మీద ఇన్ని భిన్నరకాల రచనలు రావడం అనే ఖ్యాతి ఒక వేమనకే చెందినట్లుంది. వేమన తన సాహిత్యంలో ఎన్నో సాంఘిక సమస్యలను చిత్రించడంతో పాటు వాటికి తగిన పరిష్కారమార్గాలను కూడా చూపాడు. అటువంటి వేమన గురించి సామాన్య పాఠకులకు చేరడంలో ఎంతోమంది పరిశోధకుల కృషి ఉంది. వారిలో కొందరినైన మరొకసారి గుర్తు చేసుకోవడం అవసరం.

సంప్రదాయవాదులు, ఆధునికులు, పరిశోధకులు వేమనను విడిగాను, కొన్నిసార్లు ఇతర సాహిత్యాలలోని కవులతో పోలుస్తూ తులనాత్మకంగా, రకరకాలుగా అధ్యయనం చేశారు. వేమన అనగానే మొదట అందరికి గుర్తుకు వచ్చేవారు సి. పి. బ్రౌన్. బ్రిటిష్ ఇండియా ఉద్యోగిగా పరిపాలన రీత్యా తెలుగు నేర్చుకున్న, తెలుగులో సాహిత్యం మీద కలిగిన ఇష్టంతో తెలుగు సాహిత్యానికి మరిచిపోలేని సేవ చేసిన గొప్ప వ్యక్తి చార్లెస్. ఫిలిప్ బ్రౌన్. బ్రౌన్ కడప జిల్లాకు కలెక్టర్ గా నియమింపబడిన రోజుల్లో వేమన రాసిన పద్యాల గురించి తెలుసుకొని ఆకర్షితుడై వేమన తాళపత్ర గ్రంథాలను సేకరించాడు. వాటితో 1829 లో "The versus of vemana" పేరుతో ఒక గ్రంథాన్ని అచ్చువేయించాడు. బ్రౌన్ ఈ గ్రంథంలో వేమన కాలం, స్థలం వంటి ఇతర విషయాలను కూడా చర్చించినట్లు తెలుస్తుంది. 1792 నుండి 1823 వరకు భారతదేశంలోని మద్రాస్ ప్రాంతంలో




క్రైస్తవ మిషనరీలో ఫ్రెంచ్ మతగురువుగా పనిచేసిన జె. అబేదుబాయ్ అనే వ్యక్తి "Hindu manners, customs and ceremonies" అనే గ్రంథంలో మొదటిసారిగా వేమన గురించి పేర్కొన్నట్లు ఆధారాలున్నాయి. దుబాయ్ కాలానికే తెలుగు ప్రాంతంలో వేమన పలుకుబడి బాగా ఉన్నట్లు ఆయన తన గ్రంథంలో ఉదహరించిన పద్యాలను బట్టి తెలుస్తుంది. దుబాయ్ వేమన తన కాలానికి ఇంచుమించు 150 సంవత్సరాల పూర్వంవాడని అయన రచనలో పేర్కొన్నారు.


అలాగే వేమన కవిత్వతత్త్వాన్ని అందులోని సామాజిక కోణాన్ని, అయన లోతైన విశ్లేషణ దృక్పథాన్ని అందించిన మరొక విమర్శకులు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. అయన తన 'వేమన'(1928) గ్రంథాన్ని ఒక హేతుబద్ధమైన వివేచనకు నిదర్శనంగా తీర్చిదిద్దాడు. రాళ్ళపల్లి వారు తన వేమన గ్రంథంలో వేమన వ్యక్తిత్వం, మత ప్రచారం, సమకాలీన సామాజిక స్థితిగతులు, దేశకాలాలు మొదలైన విషయాలను చర్చించారు. వేమన పద్యాల్లో ఉండే మౌలికత, సంగ్రహ శక్తి, సంఘ సంస్కరణ దృష్టి మిగతా తెలుగు సాహిత్యంలో కొంత తక్కువగానే ఉన్నట్లు అయన ఈ గ్రంథంలో పేర్కొన్నారు. వేమన గొప్పతనాన్ని చెబుతూ **"వేమన కవిత్వము గాలి వంటిది. అది దూరని చోటు లేదు. దొరకని తావు లేదని"** (పుట147)అంటారాయన. వేమనలో ఒక కొత్తదారిని వెతుకుతూ **'నాథయోగి మన వేమన'** (1987) లో వేమన నాథ సంప్రదాయానికి చెందినవాడిగా చెబుతూ



కొర్లపాటి శ్రీరామమూర్తి వేమనను విశ్లేషిస్తూ ఒక పరిశోధన గ్రంథాన్ని రచించారు. తొమ్మిది అధ్యాయాలుగా ఉన్న ఈ గ్రంథంలో అరవ అధ్యాయంలో **"వేమన నాథ సంప్రదాయం"** నవనాథులు, నాథ సంప్రదాయం గురించి చర్చించారు. కానీ వీరికన్నా ముందే ఆదివారం ఆంధ్రప్రభ (26–2–1984) అనుబంధ పత్రికలో **'సిద్ధనాథ సంప్రదాయాలకు నిలయాలు ఒకనాటి రాయలసీమ తెలంగాణాలు'** అనే వ్యాసంలో మౌలికంగా మొదటిసారిగా వేమన నాథ సంప్రదాయా నికి చెందినవాడిగా ముదిగంటి సుజాతారెడ్డిగారు పేర్కొని తర్వాత 1993లో **'వేమన నాథ సంప్రదాయం'** పేరుతో ఆమె పూర్తి గ్రంథాన్ని వెలువరించారు. ఒక సునిశిత వివేచన దృష్టికి, సహేతుకమైన విమర్శకు నిదర్శనంగా చెప్పదగిన వేమన గురించి చేసిన మరో రచన ఆరుద్రగారి **"మన వేమన"** గ్రంథం. దీనిని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు 1985లో ప్రచురించారు. ఆరుద్రగారు వేమన కాల నిర్ణయం చేయడానికి ప్రయత్నిస్తూ **"18వ శతాబ్దంలోని ఉత్తరార్ధం లోని ఎనిమిది మంది కవులపై వేమన ప్రభావం ఉంది. కాబట్టి వేమన క్రీ.శ 1650 నుండి 1700 దాకా దేశంలో సంచరించారని"** సమగ్రాంధ్ర సాహిత్యంలో(పుట43) అన్నారు. ఈయన తర్వాతి కాలంలో **"వేమన వేదం"** అనే పేరుతో మరో గ్రంథం కూడా వెలువరించారు.



తన 'కవిత్వతత్త్వ విచారం'(1914)తో తెలుగు విమర్శ ప్రక్రియను ఒక మలుపు తిప్పిన కట్టమంచి రామలింగారెడ్డిగారు వేమన గురించి పరిచయం చేస్తూ ఆయన గ్రంథంలో **"వేమన యన్ననో కారణ విమర్శనశక్తికి బట్టాభిషేకముజేసిన మహాత్ముడు. ఇతని పద్యము లన్నియు లోకోక్తులు. అనగా బలికినవాడు అతడయ్యు బలుకబడిన మాటలు లోకమువారి హృదయములలో బూర్వమే యుండినట్టివిమో, లేక అతనిచే నచలముగ నాటబడినట్టివిమో యైనవనుట"** అని వేమనలోని కవితాతత్త్వాన్ని అప్పటి సామాజిక పరిస్థితుల అనుగుణంగా వివేచించారు. వేమన గురించి రాసిన కోస్తాంధ్ర రచయిత చెందిన మరుపూరి కోదండరామిరెడ్డి. **'ప్రజాకవి వేమన యోగి'** అనే పేరుతో రాసిన గ్రంథంలో ఈయన వేమనను లోకకవిగా గుర్తిస్తూ, వేమనలో భిన్నపద సామ్యము ఏకమై ఒక కొత్త అనుభూతిని కలిగి ఉంటున్నట్లు మరుపూరి అభివర్ణించారు. వేమన పద్యాలు లాటిన్, ఇంగ్లీష్, రష్యన్, భాషలోనికి చేరినవి. ఇక మన దేశంలో, సంస్కృతం లోనేగాక, అనేక ప్రాంతీయ భాషలలోనికి అనువదింప బడినవి. ఉర్దూ, అరబిక్ భాషకెక్కి కొందరు ముస్లిం పండితులకు ప్రీతికర సూక్తులైనవని కొనియాడారు రామిరెడ్డిగారు.




ఇక నేటి కాలంలో వేమనపై పరిశోధన అనగానే గుర్తుకువచ్చే ఒక ప్రామాణిక పరిశోధన ఎన్. గోపి గారి **"ప్రజాకవి వేమన"** అనే అయన పిహెచ్.డి. పరిశోధన గ్రంథం. దీన్ని 1979లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పొందారు. అనేక తాళపత్ర ప్రతులను సేకరించి చేసిన ఈ పరిశోధనను ఆరు అధ్యాయాలుగా విభజించారు. దీనిలో వేమన పద్య నిర్ణయం, వేమన కాలం, ప్రాంతం, వేమన్న వేదాంతం, కవిత్వం, ఇతర కవులతో పోలుస్తూ గోపిగారు దీన్ని ఒక సమగ్ర గ్రంథంగా రూపొందించారు. మహాకవి శ్రీశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకొని అనంతపురంలో 'వేమన సాహితీ సమాలోచన' (2017) అనే సదస్సు సందర్భంగా, వేమన జీవిత విషయాలు, అయన తాత్త్వికత, భావజాలం వంటి విషయాలలో వచ్చిన వ్యాసాలను సేకరించి రాచపాళెం చంద్రశేఖరరెడ్డిగారి సంపాదకత్వంలో వేమన కవిత్వం– ఇతర తత్త్వవేత్తలు, మానవత, విశ్వమానవత, సామాజికత, స్త్రీ, ప్రాదేశికత, తాత్వికత, ఇతర భారతీయ కవులతో పోలుస్తూ ఇలా వేమన కవిత్వాన్ని వివిధ కోణాల్లో గ్రంథాల రూపంలో ప్రచురించారు.



బండారు తమ్మయ్య 1970లో 'వేమన చరిత్ర' పేరుతో రాసిన గ్రంథంలో కొన్ని చారిత్రక అంశాలతో పాటు, వేమన కవితా విశిష్టతను, దాని ప్రయోజనాన్ని విశ్లేషించారు. దీనిలోని మొదటి ఏడు ప్రకరణాలు 'రెడ్డిరాణి' (1932–34) పత్రికలో ప్రకటించారు. త్రిపురనేని వెంకటేశ్వరరావు **"విశ్వదాభిరామ వినురవేమ"** పేరుతో 1981లో వేమన ప్రసంగ వ్యాసాల్ని ఒక సంకలనంగా తీసుకువచ్చారు. వేమన వికాస కేంద్రం విజయవాడవారు వేమన సాంస్కృతిక ఉత్సవాల సందర్భంగా వచ్చిన 22 వ్యాసాలతో **"వేమన వివిధ దృక్కోణాలు"** పేరుతో 1982లో మరో గ్రంథాన్ని ప్రచురిం చారు. పోచన రామిరెడ్డి, గుర్రం వెంకటరెడ్డి కలిసి రచించిన **'విప్లవయోగి– విశ్వకవి వేమన వేదశాస్త్రం'** (1988) వేమనలోని సాహిత్య, సాంఘిక

తాత్త్విక దృక్పథాన్ని తెలియజేసే గ్రంథం. **'వేమన జీవితం, సాహిత్యము : సమగ్ర పరిశీలనము'** (1988) పేరుతో డా. ఎస్.ఎం. సుబాని వేమన జీవిత విశేషాలు, పద్యాల నిర్ణయం, కవిత్వ అంశాలను తన రచనలో పరిశీలించారు. డా. గంధం అప్పారావుగారు **'వేమన-సర్వజ్ఞులు'** (1979) పేరుతో అయన ఆంగ్లంలో రాసిన సిద్ధాంత వ్యాసాన్ని తెలుగులో అనువాదం చేశారు. **"వేమన-శంకర"** (1987) డి. కృష్ణారెడ్డిగారు వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి సిద్ధాంత గ్రంథం రాయగా, వేమన- సర్వజ్ఞ తిరువళ్ళూరు (1980) మధ్య ఎస్. రామారాణిగారు తులనాత్మక పరిశోధన చేశారు. **"వేమన-తత్త్వజ్ఞత"** (1976) అనే అంశంపై చెన్నుస్వామి గారు ఒక ఎంఫిల్ వ్యాసాన్ని సమర్పించారు. సి.పి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం అధ్వర్యంలో **"వేమన"** (వేమనపై విమర్శ వ్యాసాలు) పేరుతో ఒక ప్రత్యేక వ్యాస సంకలనాన్ని 2013లో యోగి వేమన విశ్వవిద్యాలయం వారు వేలువరించారు.



ఇలా వేమన జీవితం గురించి, కాలం గురించి, స్థలం గురించి, వేమన పద్యాలలోని తాత్త్విక నేపథ్యం గురించి, వేమన కాలం నాటి సామాజిక స్థితిగతులను తెలుపుతూ అనేక ఆలోచనలతో అనేక రకాల పరిశోధనలు జరిగాయి. జరుగుతూనే ఉన్నాయి. వేమన తన కవిత్వ రూపంలో చెప్పిన ఆర్థిక అసమానతలు, సమాజ కట్టుబాట్లు, అనవసర ఆడంబరాలు, అవినీతి, స్వార్థపూరిత నిర్ణయాలు, మత రాజకీయాలు, మానవీయ విలువల పతనం, కుల ఘర్షణలు వంటివి మన సమాజానికి ఎంత చేటు చేస్తాయో ఆ రోజుల్లోనే చాటి చెప్పిన విశిష్టకవి వేమన. అలాంటి వేమన చెప్పిన విషయాలు మన నేటి సమాజంలో ఎక్కువవుతున్న ఈ తరుణంలో వేమన గురించి తెలుసుకోవడంలో అయన రచనలు మన తరానికి అందడం ఇంకా అవసరం.



**ఉపయుక్త గ్రంథ సూచిక :**


1. అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి. వేమన. వాల్తేరు: ఆంధ్ర విశ్వకళా పరిషత్,1945.

2. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం(సంపా). వేమన కవిత్వం ఇతర భారతీయకవులు. విజయవాడ : ప్రజాశక్తి హౌస్, 2017.

3. వేమన (వేమనపై విమర్శ వ్యాసాలు). సి.పి.బ్రౌన్ పరిశోధన కేంద్రం. యోగి వేమన విశ్వవిద్యాలయం:కడప 2013.

4. సుజాతారెడ్డి ముదిగంటి. వేమన నాథ సంప్రదాయం. హైదరాబాద్: శ్రీశాంతా ఆర్ట్ ప్రింటర్స్, 1993.




## నగర జీవితం

ఇన్నాళ్లు కొండలెక్కిన కోతిపిల్ల
ఇప్పుడు ఈత నేర్చుకుంటుంది..
ఈత నేర్చిన చేపపిల్ల
పాకడం నేర్చుకుంటుంది..
పాకడం నేర్చిన పాముపిల్ల
నడక నేర్చుకుంటుంది..
నడక నేర్చిన నత్త పిల్ల
ఎగరడం నేర్చుకుంటుంది...
సముద్రానికి ఆవలగా నన్ను విసిరేయండి....
శ్రీశ్రీ చలం గురజాడ యద్దనపూడి లను
చదువుతూ బ్రతికేస్తాను...
ఈ నగర జీవితం...
ఈ ఆక్స్ ఫర్డ్, కేంబ్రిడ్జ్ లు
నా వల్ల కావట్లేదు...
ఈ జిరాక్స్ కాపీల వెచ్చదనం కంటే...
ఆ సాహిత్యపు పాత అత్తరు వాసనలే
నాకు ప్రీతి...
నన్ను పంపించేయండి....
ఏ సముద్రపు ఒడ్డుకో...
సముద్రపు ఒడ్డున
ఆల్చిప్పలు ముత్యాలు
దొరకలేదు అని నిరాశ పడను...
పిచ్చుక గూళ్ళతో
విశాల సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటాను...




**అరుణ నాయని**

ఫోన్ : 8790 268 463

# పొద్దు తిరుగుడు పువ్వులు



ఎందుకో నా మనస్సు
ఎప్పుడూ వాళ్ళ గురించే
ఆలోచిస్తది

మట్టిబిడ్డలు పొలాలు నాటుతుంటే
మాణిక్యాల్లా మెరుస్తారు
అమాయకత్వాన్నే
ఆభరణంగా పొదిగిన
వారి రూపం ముగ్ధ మనోహరం

మంచెపై నిలబడి
పాటందుకుంటే
వసంతంలో కూసే కోయిలకన్నా
మధురం

ఒంటికి పచ్చని బొట్లతో
చేతులకు తెల్లని గోట్లతో
కాలికి అందమైన అందెలతో
ఎంత అందంగా ఉంటారో
సముద్రపు ఒడ్డున
ముత్యాలను పొదిగిన ఆల్చిప్పల్లా



అంత చక్కని నా తండాలో
ఇంటింటికి కంచెలుంటాయి కాని
మనిషి మనిషికి మమతానురాగాలు
గొలుసుల్లా అల్లుకుంటాయి

నేను దారివెంట పోతుంటే
పచ్చగా మోము విచ్చుకొని
నావైపు చూసి నవ్వుతుంటారు
పొద్దు తిరుగుడు పువ్వుల్లా

**ఆచార్య సూర్యా ధనంజయ్**
అధ్యక్షులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9849 104 187

# మాండుక్యోపనిషత్తు

'ఓమ్' పద వాచ్యంబు బ్రహ్మము
'ఓమ్' పదమే తెలియదగినది
అట్టి పద వాచ్యంబునకు వ్యా
ఖ్యానమే బ్రహ్మాండమంతయు 1

ప్రణవమగు 'ఓం'కారమే పర
బ్రహ్మతత్త్వము తెలియజేయును
ప్రణవమే బ్రహ్మాండమంతయు
పరమ పురుషుని యందె ఉన్నది 2

అక్షరంబగు బ్రహ్మమోంకా
రమ్ముగానే చెప్పబడినది
సర్వమునకాధారమై 'ఓం'
సర్వ లోకము లేలుచున్నది 3

అన్ని శబ్దము లంతటను 'ఓం'
కారమందునె ఉద్భవించెను
ప్రణవమందే మూడు కాలము
లణగి మణిగియు మెలుగుచున్నవి 4

భూతకాలము వర్తమానము
భావి కాలమ్ములను మించియు
ప్రణవమే కద పరమ పురుషుని
దేహమై యొప్పారుచున్నది 5

'ఓమ్' పద వాచ్యంబునగు పర
తత్త్వమంతయు బ్రహ్మమేయగు;
అట్టి బ్రహ్మమె నాల్గు పాదము
లంచితంబుగ గలిగియున్నది 6

స్థూలమగు బ్రహ్మాండమును ని
ర్మింప గలిగిన బ్రహ్మమునకును
మొదటి పాదము జాగరితమై
బాహ్య ప్రజ్ఞగ నొప్పుచుండును 7

సృష్టి జరిగెడి వేళ వైశ్వా
నరుడు జాగ్రదవస్థ లోపల
నుండునని వర్ణింపబడుటయె
నతనికగు ప్రప్రథమ పాదము 8

**జక్కని వెంకటరాజం**
సిరిసిల్ల, ఫోన్ : 9440021734

# అత్యుత్తమ చారిత్రక నాటకం – పల్నాటి యుద్ధం

**ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు,** బెంగళూరు, ఫోన్ : 99454 22742

భారతీయులకు ప్రపంచ ప్రసిద్ధికెక్కిన రెండు గొప్ప ఇతిహాసాలున్నాయి: (1) వాల్మీకి రామాయణం, 2) వ్యాస మహాభారతం. తెలుగువారికి ఈ రెండింటికీ అదనంగా దేశీయ సంస్కృతికి చెంది మరో రెండు ఇతిహాసాలున్నాయి : (1) పలనాటి వీరచరిత్ర (2) కాటమరాజు చరిత్ర. ఇవి తెలుగు సంస్కృతికి జీవగఱ్ఱలు. నా పరిశోధన ప్రకారం పలనాటి వీరచరిత్రలో 25 వీరగాథలు, కాటమరాజుచరిత్రలో 32 వీరగాథలు ఉన్నాయి. వీటిని "వీరగాథా చక్రములు" (Ballad-cycles) లేక "జానపద ఇతిహాసాలు" (Folk Epics) అని అంటారు. ఇవి ప్రపంచంలోనే సుదీర్ఘమూ, ప్రాచీనమూ అయిన జానపదేతిహాసాలు. పలనాటి వీరచరిత్రలో "బ్రహ్మనాయడు", కాటమరాజుచరిత్రలో ''కాటమరాజు" ప్రధానవీరులు. తక్కిన వీరగాథలన్నీ వీరి చుట్టూ అల్లబడ్డాయి.

పలనాటి వీరచరిత్ర (లేక పల్నాటి వీరచరిత్ర)కు "చెన్నుడు కథ" అని, "వీరభాగవతము" అని మరి రెండు పేర్లు ఉన్నాయి. ఈ కథ తెలుగువారికందరికీ పరిచయమైనదే. అయినా స్థూలంగా పరిచయం చేస్తాను.

క్రీ.శ. 12వ శతాబ్దిలో హైహయరాజులు పలనాటిసీమను పాలించారు. నలగాముడు – మలిదేవుడు ఈ వంశానికి చెందినవారే. వీరి తండ్రి అనుగురాజు క్రీ.పూ. 1134 నుండి 1147 వరకు గురిజాల రాజధానిగా పల్నాటిసీమను పాలించాడు. ఈయనకు ముగ్గురు భార్యలు. మైలమదేవి, వీరవిద్యలదేవి, భూరమాదేవి. వీరిలో మైలమదేవికి ఒకే ఒక్క కొడుకు నలగామరాజు (అందరికన్న పెద్దవాడు). భూరమాదేవికి నలుగురు కొడుకులు: కామరాజు, నరసింగరాజు, ఝట్టిరాజు (గట్టురాజు), పెరిమాళ్ళరాజు. వీరవిద్యల దేవికి ముగ్గురు కొడుకులు : పెదమలిదేవుడు, పినమలిదేవుడు, బాలమలిదేవుడు. అనుగురాజు మంత్రి దొడ్డనాయడు. సేనాని తెప్పలినీడు. మంత్రి దొడ్డనాయనికి ఐదుగురు కొడుకులు: పెద్దన్న బాదరాజు, బ్రహ్మనాయడు, పేర్నీడు, సూర్నీడు, మలినీడు. సేనాని తెప్పలినీడి కొడుకు కన్నమనీడు లేక కన్నమదాసు. అనుగురాజు తరువాత పెద్దకొడుకు నలగాముడు సింహాసన మెక్కి క్రీ.శ. 1147 నుండి 1163 వరకు పరిపాలించాడు. ఇతనికి బ్రహ్మనాయడు మంత్రి; కన్నమదాసు సేనాని.

పల్నాటిసీమలోని "జిట్టగామాలపాడు" అనే గ్రామానికి చెందిన "నాగమ్మ" అనే వీరవనిత తన ప్రజ్ఞా పాటవాలతో అనుగురాజును మెప్పించి, ఏడు గడియల కాలము మంత్రిత్వము నెరపుటకు దానపత్రాన్ని పొందింది తరువాత నలగాముని కొలువులో ప్రవేశించి మంత్రిణి అయింది. "నాయకురాలు" అనే బిరుదాన్ని వహించి,



క్రమంగా నలగాముని తన గుప్పిట్లో పెట్టుకుంది. మలిదేవరాజులను చెరసాలలో పెట్టించి, వారిని చంపడానికి ప్రయత్నించింది. మంత్రి బ్రహ్మనాయడు, సేనాని కన్నమదాసు తిరుగుబాటు చేసి, మలిదేవరాజులను చెరనుండి విడిపించి, వారికి మాచెర్ల రాజ్యాన్ని పంచి యిప్పించారు. బ్రహ్మనాయడు మంత్రిగా, కన్నమదాసు సేనానిగా పెదమలిదేవుడు మాచెర్లను పాలిస్తున్నాడు.

గురిజాలలోని నాయకురాలు నాగమ్మకు – మాచెర్లలోని బ్రహ్మనాయనికి పగలు పంతాలు పెరిగిపోయాయి. మాచెర్ల రాజ్యాన్ని ఎలాగైనా సరే కబళించాలని నాగమ్మ పన్నాగాలు పన్నసాగింది. ఆమె నలగాముని ద్వారా మలిదేవుని బ్రహ్మనాయని కోడిపందానికి పిలిపించింది. మహాభారతంలో శకుని లాగే మాయోపాయంతో కోడిపందెంలో గెలిచి, మాచెర్ల రాజ్యాన్ని లాక్కుంటుంది. పందెంలోని ఒప్పందం ప్రకారం, బ్రహ్మనాయడు మలిదేవాదులతో కలిసి ఏడేళ్ళ అరణ్యవాసం చేస్తాడు. తరువాత తమ రాజ్యభాగాన్ని తమకు ఇమ్మని ఇరువురికి దగ్గరి బంధువైన అలరాజును రాయబారిగా పంపుతాడు. (అలరాజు నలగాముని అల్లుడు; అలరాజు మేనత్త సిరాదేవి పెదమలిదేవుని భార్య.) నాగమ్మ, నరసింగరాజు కలిసి, విషప్రయోగం చేసి, అలరాజును చంపుతారు. ఫలితంగా ఇరుపక్షాల వారికి కారెంపూడి రణరంగంలో యుద్ధం జరుగుతుంది. ఆయుద్ధంలో బ్రహ్మనాయని కుమారుడు బాలచంద్రుడు అసమాన శౌర్యపరాక్రమాలను ప్రదర్శించి, ఎందరో వైరివీరులను చంపి, నరసింగరాజు తలనరికి పగతీర్చుకుంటాడు. పలనాటి వీరులందరూ చనిపోతారు. ఒకవైపు నలగాముడు, నాయకురాలు నాగమ్మ; మరొకవైపు బ్రహ్మనాయడు, కన్నమదాసు మిగులుతారు. నలగాముడు బ్రహ్మనాయని శరణు కోరుతాడు. బ్రహ్మనాయడు అతనిని క్షమించి, తిరిగి అతనినే రాజును చేసి, నాగమ్మను మంత్రిణిగా, కన్నమదాసును



సేనానిగా నియమించి, తాను తపస్సు చేసుకోడానికి గుత్తికొండ బిలంలో ప్రవేశిస్తాడు. ఇది శ్రీనాథుడు, మల్లయ్య, కొండయ్యలు రచించిన పలనాటి వీరగాథలలోని కథ. ఇందులో 25 వీరగాథలు ఉండాలి. కాని ఈనాడు 11 కథలు మాత్రమే లభిస్తున్నాయి. వీటిని మా గురువర్యులు పింగళి లక్ష్మీకాంతంగారి సంపాదకత్వంలో విశాలాంధ్ర ప్రచురణాలయంవారు 1961లో ముద్రించారు. ద్విపదలోను, మంజరీ ద్విపదలోను ఉన్న పల్నాటి వీరచరిత్రను "వీర విద్యావంతులు" అనబడే వృత్తిగాయకులు (మాలలు) నెలల తరబడి పాడుతారు.

పలనాటి వీరచరిత్ర అనే సుప్రసిద్ధ ఆంధ్రజనపదేతిహాసాన్ని ఎందరో కవులు, రచయితలు కావ్యాలుగా, నాటకాలుగా, నవలలుగా వ్రాశారు. క్రీ.శ. 1862 ప్రాంతంలో పల్నాటి సీమలో, సత్తెనపల్లి తాలూకా నందిగామ వాస్తవ్యుడైన ముదిగొండ వీరభద్రకవి పల్నాటి వీరచరిత్రను "వీరభాగవతము" అనే పేరుతో చంపూమహాకావ్యంగా రచించాడు. దీనిలో ఆరు ఆశ్వాసాలు, 2,284 గద్యపద్యాలు ఉన్నాయి. ఇది 1912లో (పరీధావి సంవత్సరంలో) ముద్రింపబడింది. (తిరిగి యింతవరకూ పునర్ముద్రణ పొందలేదు. నేను దీనిని త్వరలో ముద్రించబోతున్నాను.) దీనిలో పల్నాటి వీరచరిత్రలోని కథంతా సమగ్రంగా వర్ణింపబడింది. 20వ శతాబ్ది పూర్వార్ధంలో ఏటుకూరి వేంకట నరసయ్యగారు అనే పల్నాటికవి మొత్తం కథను కొన్ని భాగాలుగా చేసి, లఘుకావ్యాలుగా ("అనుగురాజు" – "అలరాజు" – "నాయకురాలు" – "బ్రహ్మనాయుడు" ఇత్యాదిగా) రచించారు. "మాలపల్లి" అనే ప్రసిద్ధ నవలా రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణగారు "నాయకురాలు" అనే నాటకాన్ని రచించారు. త్రిపురనేని రామస్వామి చౌదరిగారు కూడా పద్యకావ్యంగా వ్రాశారు. పల్నాటి సోదరకవులు పద్యనాటకంగా వ్రాశారు. ఇప్పుడు నా చిరకాల మిత్రులు, కవులు, అష్టావధానులు అయిన కీ.శే. గాడేపల్లి కుక్కుటేశ్వరరావుగారు **"పల్నాటి యుద్ధము"** అనే పేరుతో చక్కటి పద్యనాటకాన్ని సృష్టించారు. దీని వ్రాతప్రతిని జిరాక్స్ చేయించి, నీట్‌గా బైండ్ చేయించి నాకు చాలాకాలం క్రిందట పంపించారు వారు. ఇది నా దగ్గర నిన్నమొన్నటి వరకూ ఉండేది. గాడేపల్లివారు మరణించిన తరువాత దీనిని ముద్రించవలసిందిగా మిత్రులు శ్రీ గాడేపల్లి దివాకరదత్తుగారికి (కుక్కుటేశ్వరరావుగారి అన్న కొడుక్కి) సూచించాను. వారు తమ పినతండ్రిగారి పుత్రులు శ్రీ చక్రిగారితో సంప్రదించి ఇప్పుడు ప్రచురిస్తూ ఉండటం నాకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది.

పల్నాటి వీరచరిత్ర సుదీర్ఘమైన జానపదేతిహాసం. ఇది మహాభారతంవంటి కథ. ఈ రెండింటికి చాలా పోలికలున్నాయని గురువర్యులు ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తమ పీఠికలో తెలియజేశారు. తిరుపతి వేంకటకవులు మహాభారతకథను ఆరు నాటకాలుగా వ్రాశారు. అలాగే దీనిని కూడా అయిదారు నాటకాలుగా విభజించి వ్రాయాల్సి ఉంది. మళ్ళీ తిరుపతివేంకటకవులవంటి మహానుభావులు అవతరించాలి. అయినా ఈ కథ మహాభారతంలాగా పూర్తిగా లభించడంలేదు. ఇదొక చిక్కు.

కుక్కుటేశ్వరరావుగారు మొత్తం పల్నాటి వీరచరిత్రలోని ప్రధానమైన అంశాలను ఆరు భాగాలుగా విడదీసికొని, ఆరు అంకాల మంచి నాటకంగా తీర్చిదిద్దారు. ప్రథమాంకము = అందరు కలిసియుండుట; ద్వితీయాంకము = నాగమ్మ ప్రవేశము – రాజ్యము రెండుగా చీలుట; తృతీయాంకము = కోడిపందెములు; చతుర్థాంకము = అరణ్యవాసము; పంచమాంకము = అలరాజు రాయబారము; షష్ఠాంకము = యుద్ధము – మలిదేవవిజయము. తాను కథను పూర్తిగా చెప్పే ప్రయత్నం చేశానని, చారిత్రక సత్యనిరూపణకు విశేషించి శ్రమపడలేదని, శ్రీనాథుని కావ్యకథకు నాటకావశ్యకమగు మార్పులను కల్పించానని, ప్రదర్శనాను కూలతను పాటించానని గాడేపల్లివారు తన రచనా ప్రణాళికను ముందుగానే స్పష్టం చేశారు. వీరు చేసిన ప్రధానమైన మార్పులు:–

1. పల్నాటి వీరచరిత్రలో నాయకుడు "అనుగురాజు" పెద్దకొడుకైన "నలగామరాజు". కాని గాడేపల్లి కుక్కుటేశ్వరరావుగారు (ఇక మీదట "గాకురా") ధర్మపక్షం వైపు మొగ్గుచూపి, మలిదేవుని నాయకునిగా చేశారు.

2. మాచెర్లవారి (అంటే బ్రహ్మనాయని) కోడిపుంజు పేరు: "అర్ధనాల చిట్టిమల్లుడు"; గురిజాలవారి (అంటే నాయకురాలు నాగమ్మ యొక్క) కోడిపుంజుపేరు "నల్లమల్లడు". ఈ రెండింటిని 'గాకురా' వరుసగా–"చిట్టిమల్లుడు" – "నెమలిడేగ"గా పేర్కొని, వీటిని నాటక పాత్రలతో సూచించారు.

3. పల్నాటి యుద్ధానంతరం నలుగురు తప్ప మిగిలిన వీరులందరూ చనిపోతారు. ముఖ్యంగా ధర్మపక్షపు రాజైన పెదమలిదేవుడు మరణిస్తాడు. గురిజాలవైపు నలగాముడు, నాయకురాలు;


మాచెర్లవైపు బ్రహ్మనాయడు, కన్నమదాసు మాత్రమే మిగులు తారు. 'గాకురా' మలిదేవుని నాయకునిగా చేశారు కాబట్టి అతడు యుద్ధానంతరం విజయం సాధించినట్టుగా మార్చారు. (చారిత్రకంగా చూస్తే నలగాముడే జయించాడు.) వీరగాథ లన్నింటిలోను నాయకుడైన వీరుడు ధర్మస్థాపనకోసం యుద్ధం చేసి, ప్రాణత్యాగం చేస్తాడు. ఉదా॥ పల్నాటి వీరచరిత్రలో 66 మంది "పల్నాటివీరుల"లో బ్రహ్మనాయడు, కన్నమదాసు తప్ప తక్కిన 64 మందీ చనిపోయారు. వీరందరూ మలిదేవుని పక్షంవారు. కాటమరాజు చరిత్రలో కాటమరాజాది యాదవ వీరులందరూ మరణిస్తారు. బొబ్బిలియుద్ధంలో నాయకుడైన రావు రంగారావు వీరస్వర్గ మలంకరిస్తాడు. కాని కావ్య నాటకాదులలో నాయకుడు మరణిస్తే అమంగళం. అందువల్ల 'గాకురా' మార్చివేశారు.

4. ఈ నాటక పాత్రలలో 12 పురుషపాత్రలు, ఒకే ఒక్క స్త్రీ పాత్ర 'నాగమ్మ' ఉన్నారు. బ్రహ్మనాయని తల్లి: "శీలమ్మ", భార్య: "ఐతమ్మ", బాలచంద్రుని భార్య: "మాంచాల", అలరాజు భార్య: "రత్నాల పేరమ్మ" పాత్రలు లేవు. వీరు వీరచరిత్రలో కొన్ని ఘట్టాలలో కీలకపాత్రలు పోషించారు. నాటకంలో స్త్రీ పాత్రలు ఎక్కువ అయితే ప్రదర్శన యోగ్యత తగ్గిపోతుంది. అందువల్ల 'గాకురా' స్త్రీపాత్రలు పూర్తిగా తగ్గించివేసి, ప్రధానమైన నాయకురాలి పాత్రను మాత్రం ఉంచారు. పురుషులలో ప్రధాన పాత్రలు: మలిదేవుడు (నాయకుడు), నలగాముడు, నరసింగరాజు, బ్రహ్మనాయడు, కొమ్మరాజు, అలరాజు, కన్నమదాసు, బాలచంద్రుడు, చింతపల్లిరెడ్డి; కేశవదాసు, బుచ్చిరెడ్డి, వీరభద్రుడు. (చివరి ముగ్గురు భటులు, చిన్నపాత్రలు).

5. నాగమ్మ, గురిజాల సమీపంలో ఉన్న "కట్టుబోతుల గంగవరం" నుండి మంత్రగాళ్ళను పిలిపించి, మాచెర్ల కోడిపుంజు "అర్థనాల చిట్టిమల్లడు" మీద మంత్రాక్షతలు చల్లించిందని, అందువల్ల అది చనిపోయిందని పల్నాటి వీరచరిత్రలో ఉంది. కోడిపందెం జరుగుతూ ఉండగా, అందరూ చూస్తూ ఉండగా మంత్రాక్షతలు చల్లడం అసంభవం. అందువల్ల 'గాకురా' మంత్రాక్షతలను "మంత్రవిభూతి"గా మార్చి, మాచెర్ల పుంజును పరీక్షించే నెపంతో బుచ్చిరెడ్డి దాని ఒంటినిండా ఆ విభూతి పూసినట్టుగా తెలియజేశారు. ఈ మార్పు మిక్కిలి సమంజసంగా ఉంది.

6. నాగమ్మ "తంబళ్ళపెద్దు" అనే శివార్చకునిచేత అలరాజుకు విషపుష్పాలను పంపిస్తుంది. అలరాజే ఆ తంబళ్ళపెద్దునుండి పుష్పాలను బలవంతంగా లాక్కున్నట్లుగా చిన్నమార్పు చేశారు గాడేపల్లి వారు.

మిత్రులు గాడేపల్లి కుక్కుటేశ్వరరావుగారు లాక్షణికులు చెప్పిన నాటక లక్షణాలకు అనుగుణంగా ఈ నాటకాన్ని వ్రాశారు. నాందీప్రస్తావనలతో ప్రారంభించారు. ద్వితీయాంకం మొదట, తృతీయాంకం మొదట రెండు విష్కంభాలు వ్రాసి కథాసూచన చేశారు. నాందీ పద్యంలో కథానాయకుడైన మలిదేవుని పేరు (మల్లికార్జునుడైన శివునిపేరు) నాటకంలోని ప్రధాన పాత్రల పేర్లు వచ్చేలా చేశారు. "వేణీసంహారం" వంటి గొప్ప సంస్కృత నాటకాలలో ఉండే "గండం" అనే లక్షణాన్ని ప్రథమాంకంలోను, ద్వితీయాంకంలోను కథ మలుపుతిరిగే రసవత్తర సన్నివేశాలలో ఎంతో చాకచక్యంగా ప్రవేశపెట్టారు. ప్రథమాంకంలో అనుగురాజు పుత్రులందరూ తండ్రివంటి బ్రహ్మనాయనిపై ఎంతో అభిమానాన్ని ప్రదర్శిస్తూన్న సన్నివేశంలో సృష్టించిన "గండం":-




**బ్రహ్మనాయడు** : "బిడ్డలారా! మీకు నాపైనున్న అభిమానము తెలియ వచ్చినది.'' (బుచ్చిరెడ్డియను భటుడు సంభ్రమముతో వచ్చును)

**బుచ్చిరెడ్డి** : "ఉపద్రవము! ఉపద్రవము!"

**నలగాముడు** : "ఏమిరా అది?"

**బుచ్చిరెడ్డి** : "గూఢచారి రహస్య మందిర ద్వారము వద్ద ప్రభుదర్శనమునకై వేచియున్నాడు. మొగముపై నువద్రవరేఖలు తాండవిచ్చుచున్నవి."

ఇక్కడ గూఢచారి, నాగమ్మ రహస్య చర్యల సమాచారం తెచ్చాడు. ఆమె సుఖంగా ఉన్న ఈ అన్నదమ్ముల మధ్య ప్రవేశించి, చిచ్చు పెట్టబోతోంది - అనే సూచన ఈ గండంవల్ల తెలుస్తోంది.

ఇలాంటిదే మరొక మిక్కిలి నాటకీయమైన "గండం" ద్వితీయాంకంలో నాగమ్మ సభాప్రవేశ సమయంలో కల్పించారు 'గాకురా'. నరసింగరాజు వర్ణసంకరం చేస్తున్న బ్రహ్మనాయని ''చాపకూటి'' సిద్ధాంతాన్ని వ్యంగ్యంగా విమర్శిస్తున్నాడు. దానికి బ్రహ్మన కోపించిన సందర్భం :-

**బ్రహ్మ :** "నాయందు దోషమేయున్న స్పష్టముగాఁ జెప్పుము. దోషినే యైనచో మంత్రిత్వమును త్యజించి యావలకుఁ బోయెదను."

**బుచ్చి :** (ప్రవేశించి) "జయము! జయము! మహాప్రభూ! ఆరవిల్లి నాగమ్మగారు ఏలిన వారి దర్శనార్థమై వేచియున్నారు."

**నల :** "ప్రవేశపెట్టుము".

నాగమ్మ ప్రవేశించి, రాజుకు నమస్కరించి – (పరిహాసముగా బ్రహ్మన వంకఁజూచి) "ఎవరో మంత్రిపదవిని త్యజించుచున్నారట. నాకేమైన దక్కునేమోయని...."

**కన్నమదాసు :** (వ్యంగ్యముగా) "ఇంక రాజ్యాంగమునందు స్త్రీలే ప్రవేశింపవలె."

**నాగమ్మ :** "కాదు, కన్నమదాసులే ప్రవేశింపవలె"

ఇది ఈ నాటకంలో ఒక అత్యద్భుత సన్నివేశం. భారత రాజకీయాలలో ఇందిరాగాంధీ ప్రవేశము, జగజీవనరాంవంటి దళిత నాయకుల ప్రవేశము ఇక్కడ ఎంతో ధ్వనిగర్భితముగా సూచింపబడినవి.

అనుగురాజు తనకిచ్చిన వాగ్దానపత్రాన్ని చూపించి నాగమ్మ మంత్రిపదవి చేజిక్కుంచుకొని, మాయోపాయంతో రాజ్యాన్ని రెండు ముక్కలు చేసి, అన్నదమ్ములకు పంపకాలు పెడుతుంది. ఈ సన్నివేశం అచ్చంగా తిరుపతి వేంకటకవుల "పాండవోద్యోగం" నాటకంలో కృష్ణుడు తనను తన యాదవ సైన్యాన్ని పంపకాలు పెట్టినట్టుగానే ఉంది. అసలు మహాభారతకథను మిక్కిలి సన్నిహితంగా అనుకరిస్తూనే 'గాకురా' ఈ నాటకాన్ని రచించారు. మలిదేవుని ధర్మరాజుతోను, నలగాముని దుర్యోధనునితోను, నాగమ్మను శకునితోను స్పష్టంగా పోల్చి చెప్పారు. ఒక బ్రహ్మనాయుడు శ్రీకృష్ణుని వంటి అవతార పురుషుడనే సూచన చాలా సందర్భాలలో వచ్చింది. అందరూ కలిసి ఉండటం ప్రథమాంకంలోను, నాగమ్మ ప్రవేశంతో రాజ్యం రెండుగా చీలడం ద్వితీయాంకంలోను జరిగినవి. ఈ ద్వితీయాంకంలోనే పంపకాల సందర్భంలో సింహాసనానికి వారసుడు నలగాముడా? మలిదేవుడా? అనే చర్చను ప్రవేశపెట్టారు గాడేపల్లివారు. ఇది రాజ్యం పాండవులదా? కౌరవులదా? అనే భారతచర్చకు ప్రతిబింబం.

తృతీయాంకంలో కోడిపందెములు వర్ణింపబడ్డాయి. కోడిపందెం కూడా యుద్ధంవంటిదే. స్నానం, భోజనం, నిద్ర, యుద్ధం మొదలైన వాటిని రంగస్థలంమీద ప్రదర్శించకూడదు – అని నాటక లక్షణకారులు స్పష్టంగా నిషేధించారు. దీనిని తు.చ. తప్పకుండా పాటించారు కుక్కుటేశ్వరరావుగారు. కోళ్ళపోట్లాటను నరసింగరాజు, మలిదేవుడు, నలగాముడు, కొమ్మరాజు, బ్రహ్మనాయుడు వర్ణించి చెపుతారు. ఈ వర్ణనలను బట్టి ప్రేక్షకులు ''చిట్టిమల్లుడు'' – ''నెమలిడేగ'' ఎంత తీవ్రంగా పోరాడినవో గ్రహించి తమ మనోనేత్రములతో దర్శించి ఆనందించగలరు. ఈ వర్ణన పద్యం లోను, గద్యంలోను కూడా ఎంతో రమణీయంగా కొనసాగింది:–

**నలగాముడు చేసిన వర్ణన (పద్యం) :–**

**చ. "మెడమెడ రాయుచున్ పయికి మెట్టుచు మిట్టుచు ఆరె తాపులం**
**బడుచు నురమ్ములన్ రుధిరవాహిను లోడికలై పెనంగులా**
**డెడు కృకవాకులన్ నెమలి డేగ మరెక్కడొ! చిట్టిమల్లుడె**
**క్కడొ! వివరింపఁగాఁ దరముగాక ధరోద్ధత ధూళిపైకొనెన్."**

**కొమ్మరాజు చేసిన వర్ణన (గద్యం) :–** ''నిజచరణ ఖరఖరాయమాణ నఖర ప్రఘాణ సంఘాతంబులు పరస్పర స్పర్ధావివర్ధంబులై విడంబింబ, అన్యోన్య విజిగీషామిషంబున రోషకషాయితంబులై విషమించు రూక్షవీక్షణ స్ఫులింగంబులు తరంగంబులై చెంగలింప, టపటపాయమాన పక్షాక్షేప లక్షణోత్క్షిప్త ధరాపరాగంబు నరాంబకావరోధంబు కల్పింప, ఎట్లు కొట్లాడు చున్నవో వీక్షింపుడు!"

ఈ సందర్భంగా కోడిపుంటులు ప్రాణాలొడ్డి పోట్లాడితే, మానవులు తాము గెలిచినట్లుగా కీర్తిపొంది సంబరపడిపోతారు. దీనిని గర్హిస్తూ బ్రహ్మనాయుడు ఒక చక్కని మాట అంటాడు:–

గీ. **"చచ్చిచెడి పోరి గెల్పించు శ్రమమునీది**
**గెల్పుతి మటన్న కీర్తి దక్కెడిది మాకు–**
**కటకటా! ఎట్టి విపరీత కర్మమునకు**
**దింపె విధి మమ్ము మాటపట్టింపుకొఱకు!"**

బ్రహ్మనాయుడు చిట్టిమల్లుని సంబోధించి దీవించడం, కుక్కుటేశ్వరరావుగారి "మహత్వకవిత్వ పటుత్వ సంపద"కు మంచి తార్కాణం :–

**"ఓయి నిర్విరామ నానాసంగ్రామ జర్జరీభూత మహాహర్యక్ష సదృక్ష నిర్నమ తామ్రచూడుడా!"** అని కోడిపుంజును సంబోధించి –

**ఉ. "రుద్రుఁడు త్వన్నఖంబుల, మరుత్తు గరుత్తుల, నగ్ని శీర్ష, ము**
**ద్యద్రవి సర్వదేహమును తప్పక రక్షయొనర్ప, నీకు నే**
**తద్రణసీమఁ దొల్దొలుత తారసిలున్ విజయమ్మ పొమ్ము! ని**
**ర్దిద్ర పరాక్రమక్రమఖనీ! ఖగవంశక సచ్ఛిరోమణీ!"** – అని దీవిస్తాడు.

ఈ నాటకానికి మూలమైన పల్నాటి వీరచరిత్రలో కూడ "కోడిపోరు" అను వీరగాథలో కోళ్ళపోట్లాట మహాద్భుతంగా, నభూతో నభవిష్యతిగా వర్ణింపబడింది.

చతుర్థాంకంలో మలదేవాదుల అరణ్యావాసం ప్రదర్శింపబడింది. మలిదేవాదుల కష్టాలకు తానే కారణమని బ్రహ్మనాయుడు ఎంతగానో క్షోభిస్తాడు. ఈ అంకంమీద బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి సత్యహరిశ్చంద్రీయ నాటక ప్రభావం ఎక్కువగా కనబడుతుంది. **(చూ."ఏ నాడునడచినా రీయరణ్యములందు, మంజులోద్యాన సీమలనెకాని..."** అనే సీసపద్యం). **"సకలక్ష్మాతలి గాధిసూతికి...."** అనే పద్యంలో 'గాకురా' గారే ప్రత్యక్షంగా హరిశ్చంద్రనాటక ప్రసక్తి

తీసికొని వస్తారు. కొమ్మరాజు చెప్పిన ఈ క్రింది పద్యం పూర్తిగా బలిజేపల్లి వారికి అనుకరణం :

గీ. **"కాలమెప్పుడొకరీతి గడవఁబోదు**
**బండి చక్రంపు టాకుల పగిది భాగ్య**
**పంక్తులనిశమ్ము తిరుగుడు వడుటఁగాదె**
**బంటు రాజౌట రాజులు బంటులౌట!"**

హరిశ్చంద్ర నాటకంలో **"రాజేకింకరుఁడగు, కింకరుఁడే రాజగు కాలానుకూలంబుగన్"**

బాలచంద్రుడు నరసింగరాజును చంపి అలరాజు పగ తీరుస్తానని కొమ్మరాజుకు ప్రతిజ్ఞచేసి చెపుతాడు. వనవాసం ఏడేండ్లు పూర్తికాగానే, అలరాజును రాయబారిగా పంపడానికి బ్రహ్మన నిశ్చయిస్తాడు. మలిదేవుడు అలరాజుతో రాయబారసందేశం చెప్పే సందర్భంలో గాడేపల్లివారు, తిక్కన భారతంలోని శ్రీకృష్ణుని రాయబారాన్ని, తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగ నాటకాన్ని దృష్టిలో పెట్టుకొని కొన్ని పద్యాలు వ్రాశారు. మలిదేవుడు అచ్చం ధర్మరాజులాగే మాట్లాడుతాడు:

క. **"మేమెట్టి వారమో, నల**
**గామప్రభువెట్టివారొ, గడచిన కథయే**
**దో, మాటలాడవలసిన**
**దేమో నీ కొకఁడు చెప్పనేటికిఁ బొమ్మీ!"**

తిక్కనగారి ధర్మరాజు :

క. **"మమ్మెఱుఁగు, దెదిరి నెఱుఁగుదు,**
**నెమ్మియెఱుఁగు, దర్థసిద్ధి నెఱి యెఱుఁగుదు, వా**
**క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు,**
**పొమ్మెవ్వఁడ నీకు నేను బుద్ధులు సెప్పన్"**

(ఉద్యోగ : 3 - 34)

తిరుపతి వేంకటకవుల ధర్మరాజు: **"తినజాలను నెత్తురుకూడు మాధవా!"** అంటే, గాడేపల్లివారి మలిదేవుడు కూడా **"తినఁజాలను నెత్తురుకూడు బ్రహ్మనా!"** అంటాడు! ధర్మరాజు కృష్ణునితో చెప్పినట్లుగానే, శాంతికాముకుడైన బ్రహ్మనాయడు అలరాజుతో **"అలరాజా! సాధ్యమైనంతవఱకు సంగ్రామ ప్రసంగము రాకుండానే చూడుము! ఇరువురు నొక్క తండ్రి కుమారులు"** అంటాడు.

పంచమాంకం అంతా అలరాజు రాజబారం. దీని మీద తిక్కన, తిరుపతి వేంకటకవుల శ్రీకృష్ణుని రాయబారాల ప్రభావం ఉందని ముందుగానే తెలియజేశాను. తిక్కన భారతం, తిరుపతి వేంకట కవుల భారతనాటకాలు ఆంధ్రులలో ఆబాలగోపాలం ప్రసిద్ధమైనవి. వీటి ప్రభావంనుండి తప్పించుకోవడం ఎవరి తరమూ కాదు. ఆ మహాకవుల అడుగుజాలలో నడవడం తప్పుకాదు; ఇది వారి యెడల గాడేపల్లివారు చూపుతున్న గౌరవంగా మనం భావించాలి. రాయబారం ప్రారంభంలోని ఈ క్రింది పద్యం చూడండి:–



**మ. "మలిదేవుండు మహానుభావుడు, జగన్మాన్యుండు, మీ వంటి పె**
**ద్దలకున్ నమ్రుఁడు, ధర్మవర్తనుఁ, డజాతద్వేషి, సంగ్రామకౌ**
**శల, చేసాచెఁ దదర్ధరాజ్యమునకై క్ష్మానాథ! అర్పించి ని**
**స్తుల కీర్తింగనుమయ్య! సూర్యుఁడును చంద్రుండుండు పర్యంతమున్."**


ఇది తిక్కనగారి **"వారలు శాంతశూరులు, భవచ్చరణంబులు గొల్వబూనియున్నారు..."** అనే పద్యానికి, తిరుపతివేంకటకవుల **"పతితులు కారు, నీయెడల భక్తులు..."** అనే పద్యానికి ప్రతిధ్వనులు.

నాగమ్మ అలరాజును తమ పక్షంవైపు త్రిప్పుకోవాలనే ప్రయత్నం, అచ్చంగా, రాయబారం తరువాత కృష్ణుడు కర్ణుని పాండవులవైపు రప్పించాలనే ప్రయత్నం లాంటిదే! తిరుపతివేంకటకవుల నాటకంలో కర్ణ సందేశంలో వ్రాసిన

**"వ్యంజనంబున్ ధరియించు ధర్మజుఁడు, దివ్యచ్ఛత్రమున్ బట్టువా**
**యుజుఁ, డశ్వంబులఁదోలు పార్థుఁ, డభిమన్యుండంకముందుండు,భూ**
**ప్రజలెల్లన్ జయవెట్ట నీకు జరుగున్ బట్టాభిషేకంబు భా**
**నుజ!, మాద్రేయులు, ద్రౌపదేయులును నేనున్ యాదవుల్ వెంటరాన్!"**

అనే పద్యానికి సరిగ్గా ప్రతిబింబంలాంటిది అదే మత్తేభఛందస్సులో నడిచింది. ఈ క్రింది 'గాకురా' గారి పద్యం:–

**మ. "నలగాముల్ నరసింగభూపతులు నిన్ సౌవర్ణ సింహాసన**
**స్థలి నా సీను నొనర్ప, పేరమ భవత్పార్శ్వమ్మునంజేర, మం**
**త్రులు సామంతులు జేజయల్ వలుక, నేనున్ వెంటనిల్వన్, సము**




**జ్వాల భోగమ్మున తెపె నీకు జరుగున్ పట్టాభిషేకం బిటన్!"**

"కావ్యేషు నాటకం రమ్యం – నాటకేషు శకుంతలా।

తత్రాపి చతుర్థో౽ంకః – తత్రశ్లోక చతుష్టయమ్ ॥" – అన్నట్లుగా, తిరుపతి వేంకట కవుల కృతులలో భారతనాటకాలు – వాటిలో పాండవోద్యోగవిజయనాటకాలు – వాటిలో "సెంటర్ సీన్" అని పిలువబడే శ్రీకృష్ణుని రాయబారం, అందులో "చెల్లియొ చెల్లకో..."; "అలుగుటయే యెఱుంగని..."; "జెండాపై కపిరాజు...."; "సంతోషంబున సంధి సేయుదురె..." అనే అనర్ఘరత్నాలవంటి నాలుగు పద్యాలు శ్రేష్ఠమైనవి. ఈ పల్నాటి యుద్ధం నాటకం పంచమాంకంలో, అలరాజు రాయబారం ఘట్టంలో, ఆ నాలుగు ఉత్తమోత్తమ, అత్యంత ప్రసిద్ధమైన పద్యాలను దృష్టిలో పెట్టుకొని 'గాకురా' వరుసగా మూడు కంద పద్యాలు, ఒక మత్తేభవృత్త పద్యం రచించారు :–

**క. "మలిదేవుఁడె కోపించిన**
**జలనిధి సప్తకము పొంగి జగముల ముంచున్**
**కులగిరులేడును కూలును**
**నలగామా! తెలిసి సంధి నడుపుము ప్రీతిన్."**

ఇది స్పష్టంగా తిరుపతి వేంకట కవుల **"అలుగుటయే యెఱుంగని మహామహితాత్ముఁడజాతశత్రుఁడే యలిగిననాఁడు"** అనే పద్యానికి ఛాయ. అలాగే **"జెండాపై కపిరాజు ముందు సితవాజిశ్రేణియుం గూర్చి..."** అనే పద్యాన్ని అనుసరిస్తూ ఈ క్రింది పద్యం వ్రాశారు:–

**మ."సమరక్షోణిని బాలచంద్రుఁడలుకన్ 'సామంతరాగోల' హ**
**స్తమునందాల్చి భవచ్చమూపతుల శీర్షవ్రాతముద్దండ చం**
**డిమఁ జెండాడువేళ, నాగమయెకానీ, ఈ నృసింహుండె కా**
**ని, మిముం దేల్చెదరంచు నమ్మికొనియుందే! వెల్టిభూపాలకా!"**

**షష్ఠాంకము :–** ఇది యీ నాటకములో ప్రధానమైనది, సుదీర్ఘమైనది (20 పుటలు). ప్రథమాంకము మిక్కిలి చిన్నది (6 పుటలు మాత్రమే). ఈ నాటకం శీర్షిక **"పల్నాటియుద్ధము"** – అంటే యిది యుద్ధ ప్రధానమైన నాటకం. కాని యుద్ధాన్ని రంగస్థలంమీద ప్రదర్శించడాన్ని లాక్షణికులు నిషేధించారు. ఇటువంటి క్లిష్టమైన యితివృత్తాన్ని ఎంతో సమర్థవంతంగా కత్తిమీద సాములా నిర్వహించారు కీ.శే.గాడేపల్లి కుక్కుటేశ్వరరావుగారు. తిరుపతివేంకట కవులుకూడా మహాభారతయుద్ధం ఇతివృత్తంగా వ్రాసిన "పాండవ విజయం" అనే నాటకంలో కర్ణార్జున ద్వంద్వయుద్ధాన్ని కాని, భీమదుర్యోధనుల గదాయుద్ధాన్ని కాని ఎక్కడా రంగస్థలంమీద ప్రదర్శించలేదు; ఇతర పాత్రల చేత సూచింపజేశారు – అంతే! మహావీరుడైన అభిమన్యుని యుద్ధకౌశలాన్ని 'కరండకుడు' అనే భటునిచేత ధర్మరాజుకు వర్ణించి చెప్పిస్తారు. దీనినిబట్టి ప్రేక్షకులు అభిమన్యుని నిర్వక్రపరాక్రమాన్ని తమ మనోనేత్రంతో దర్శిస్తారు.

తమ **"పల్నాటియుద్ధము"** నాటక రచనలో, తిరుపతివేంకటకవుల అడుగు జాడలలో నడిచిన 'గాకురా' గారు ఈ యుద్ధఘట్టాలను కూడా వారి పద్ధతిలోనే రచించారు. ఇది ఉత్తమోత్తమమైన పద్ధతి. దీనికి వ్యతిరేకంగా లాక్షణికులను లెక్కచేయకుండా యుద్ధఘట్టాలను రంగస్థలంమీద ప్రదర్శించేలాగ రచిస్తే ఏ మవుతుందో సోదాహరణంగా వివరిస్తాను. (ముఖ్యంగా నటులకు గాయాలవుతాయి!)

సంస్కృతాంధ్రాలతో ఉద్దండ పండితులు, రామాయణ భారత భాగవతాలను ఒంటి చేతితో రచించిన మహాకవులు, మహామహోపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి అయిన శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారు "బొబ్బిలి యుద్ధము" పద్యనాటకాన్ని రచించారు. యుద్ధ ఘట్టాలన్నీ రంగస్థలంమీద ప్రదర్శించేలాగ వ్రాశారు. అంతటితో ఆగితే ఫరవాలేదు; తాండ్రపాపారాయుడు విజయరామరాజును చంపి, పొట్టచీల్చి, ప్రేవులు మెడలో వేసికొని నట్లుగా వర్ణించి ఒక రంగాన్ని సృష్టించారు. దీనిని నటులు నటించారు. ఈ బీభత్స దృశ్యాన్ని చూచి ఎందరో బాలబాలికలు, స్త్రీలు కెవ్వున కేక వేసి, మూర్ఛిల్లి, వారంరోజులపాటు జ్వరంతో బాధపడ్డారు. (దీనికి మా ఆవిడ ఒక ప్రత్యక్ష బాధితురాలు!) ఈ దృశ్యాన్ని విజయనగరంలో ప్రదర్శిస్తే ప్రేక్షకులు తిరుగుబాటు చేశారు. అందువల్ల ఈ నాటకాన్ని విజయనగరంలో ప్రదర్శించేటప్పుడు ఈ సీను తీసివేస్తూ వచ్చారు నటులు. నేను 1955లో భీమవరం కళాశాలలో తెలుగు బి.ఏ. చదువుతున్నాను. పనికట్టుకొని రాజమహేంద్రవరం వెళ్ళి శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారిని కలిసి,

"ఇదేమిటి? ఇలా వ్రాశారు బొబ్బిలియుద్ధం నాటకాన్ని?" అని ప్రశ్నించాను. **"ఏదో రంగస్థలంమీద రక్తికడుతుందని వ్రాశాను. నాటక లక్షణాల ప్రకారం తప్పే!"** అని ఒప్పుకున్నారు.

పల్నాటియుద్ధం బొబ్బిలియుద్ధం కన్నా చాలా పెద్దయుద్ధం; బీభత్స దృశ్యాలు చాలా ఉన్నాయి. అయినా వాటిని రంగస్థలం మీద ప్రదర్శించకుండా ఎంతో జాగ్రత్త పడ్డారు కుక్కుటేశ్వరరావుగారు. మహాభారతంలో అభిమన్యునివంటి శూరశిఖామణి బాలచంద్రుడు. అతడు భయంకరమైన యుద్ధాన్ని చేశాడు; కాల్బలాన్ని, అశ్వబలాన్ని, గజబలాన్ని చీల్చి చెండాడినాడు. నరసింగరాజు తలనరికి తెచ్చి, కొమ్మరాజుకు బహూకరించి, అలరాజుపగ తీర్చాడు. నరసింగరాజు విసిరిన శూలం బాలచంద్రుని డొక్కలో దిగి ప్రేగులు బయటకు వచ్చాయి. దుమ్ము పట్టిన వాటిని గంగధారమడుగులో కడిగి, తిరిగి పొట్టలో పెట్టుకొని ఉత్తరీయంతో పొట్టగట్టిగా కట్టుకొని మరల యుద్ధభూమిలో ప్రవేశించి, ఎందరో వీరుల్ని హతమార్చిన మహావీరుడు బాలచంద్రుడు. ఇతర పాత్రలు చేసిన వర్ణనల ద్వారా, ఈ దృశ్యాలన్నీ ప్రేక్షకుల మనోనేత్రానికి ప్రత్యక్షమవుతాయి. అలాగే కొమ్మరాజు చేసిన గొప్ప ధనుర్యుద్ధం కూడా ప్రేక్షకులకు పరోక్షంగానే పరిచయమవుతుంది. కొమ్మరాజుయుద్ధాన్ని భీష్మునియుద్ధంతో పోల్చి చెప్పారు గాడేపల్లివారు. ఈ షష్ఠాంకంలో బాలచంద్రుని యుద్ధాన్ని కేశవదాసు అను బ్రహ్మనాయని సన్నిహితభటుడు రణ భూమిని ప్రత్యక్షంగా చూచివచ్చి, బ్రహ్మనాయనికి వర్ణించి చెపుతాడు – (పాండవ విజయం నాటకంలో కరండకుడు ధర్మరాజుకు వర్ణించి చెప్పినట్లుగా). **"(సంతోషముతో) అమాత్య శేఖరా! సంగ్రామము నయన పర్వముగా సాగుచున్నది. బాలచంద్రుండొకవంక ధనుస్సు సారించుచు, ఖడ్గాఘాతసంఘాతంబుల శాత్రవశిరఃకందుకముల నందందు దొర్లించుచు, అంగలు సాచి ముందున కురుకుచున్నాడు. అతని అఖండదోశ్చండిమకు కాల్బంట్లు గంట్లుపడి చచ్చుచున్నారు. ఘోటకములు బూటకములై పోవుచున్నది. ఏనుంగులు పీనుంగులై కూలుచున్నవి."**

ఈ బాలచంద్రునికి బలమైన గాయమయిన విషయం కూడ రంగస్థలం మీద ప్రదర్శించకుండా, మలిదేవుని చేత బ్రహ్మనతో **"అమాత్యా! బాలచంద్రుని డొక్క చిట్లి ప్రేవులు ఈవలకు వచ్చినవట"** అని పరోక్షంగా సూచిస్తారు.

ఈ అంకంలో కేశవదాసే కాకుండా, కన్నమదాసు, మలిదేవుడు, బ్రహ్మనాయడు కూడా యుద్ధాన్ని వర్ణించి చెపుతారు. కేశవదాసు భారతయుద్ధంలో సంజయునివలె రణభూమిని ప్రత్యక్షముగా దర్శించి వచ్చి, పల్నాటి వీరుల ఘోరయుద్ధాన్ని బ్రహ్మనాయనికి వివరించి చెపుతాడు. భారతయుద్ధంలో పెక్కురుకూడి అభిమన్యుని చంపినట్టుగా, నాగమ్మ ఉసిగొల్పిన నానాదేశాధిపతులు కొమ్మరాజును చుట్టుముట్టి దొమ్మియుద్ధంలో చంపుతారు.

నాటకం చివర్లో నాగమ్మ పశ్చాత్తాపం చెందినట్లుగా వ్రాయడం గాడేపల్లివారు చేసిన గొప్ప కల్పన. మూలకథలో నలగామునిపశ్చాత్తాపం ఉంది కాని, నాగమ్మ పశ్చాత్తాపం లేదు. చివరికి మలిదేవుడు జయించినా, తిరిగి పల్నాటి రాజ్యాన్ని అన్న నలగామునకు ఇచ్చివేస్తాడు. ఇది కూడా ఉదాత్త కల్పన. (ఇక్కడ మనకు రామాయణంలోని భరతుడు జ్ఞప్తికి వస్తాడు.)

చివర్లో కథానాయకుడు మలిదేవుడు చెప్పిన భరతవాక్యం పల్నాటికథకే కాదు, నేటి భారతదేశానికి కూడా సంపూర్ణంగా అన్వయించేలా అమోఘంగా ఉంది:–

**మ."మతవైషమ్యము, ప్రాంతవైరము, కులోన్మాదంబొ, భూమండలై**
**కతకున్ గొడ్డలిపెట్టు కాఁదగదు; రాగద్వేషముల్ మాని పా**
**లితులున్ పాలకులేక దృష్టిఁ బరిపాలింపన్‌వలెన్; సస్యసం**
**తతి వర్ధిల్లుత! నాల్గు పాదములతో ధర్మమ్ము వర్తిల్లుతన్!"**

శ్రీనాథుడు రచించిన పల్నాటి వీరచరిత్రలో "బాలచంద్రుని యుద్ధము", "కొమ్మరాజు యుద్ధము" అనే వీరగాథలలోని సమస్త విషయాలూ, ఒక్కటి కూడా పొల్లు పోకుండా ఈ షష్ఠాంకములో పొందుపరిచారు గాడేపల్లివారు. ఇది వారి నాటకరచనాకౌశలానికి ఎత్తిన విజయపతాకం!

"పల్నాటి యుద్ధము" అనే యీ పద్యనాటకం చిన్న నాటకం; ఆరు అంకాలలో, 80 పుటలలో ముగిసిపోయింది. "పల్నాటి వీరచరిత్ర" అనే జానపదేతిహాసంలోని కథ అంతా సమగ్రంగా, ఏ విధమైన చారిత్రక దోషాలూ లేకుండా, వచ్చేసింది. ఇలా వ్రాయడానికి ఎంతో నేర్పుకావాలి. అటువంటి నేర్పు కీ.శే. గాడేపల్లి కుక్కుటేశ్వరరావుగారికి పుష్కలంగా ఉందని నేను భావిస్తున్నాను. ఇంతమంచి నాటకాన్ని ఆయన వ్రాసిన ఎన్నో ఏండ్ల తరువాత అయినా భక్తిశ్రద్ధలతో ప్రచురిస్తున్న కుక్కుటేశ్వరరావుగారి కుమారులు శ్రీ గాడేపల్లి చక్రిగారిని, వీరి అన్నగారైన శ్రీ గాడేపల్లి దివాకరదత్తు గారిని మనసారా అభినందిస్తున్నాను. ఈ నాటకం కుక్కుటేశ్వరరావుగారి దివ్యస్మృతికి భక్తితో ఎత్తిపట్టిన కర్పూర నివాళి!



# మూసీ పదవినోదం - 29

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 త | 5 | 11 కు | | 14 ల | 15 | 17 గా |
| 3 ల | | య | | X | 16 య | | ము |
| 4 | దా | | రు | 12 | X | 18 గె | X |
| ల | X | డు | X | ము | 19 | కా | |
| 7 | 8 న | X | 13 | X | మే | | రు |
| 6 లి | | 10 చ | ము | X | | X | |
| 9 | ల | | ల | | లు | 20 | X |
| X | 10 ము | | గి | X | X | 21 శ | |

**ఆధారాలు (అడ్డం)**

1. అల్లరిగా, తారుమారుగా (8)
3. హిందుస్థానీ పదమయినా మన తెలుగులో మొదలు అను అర్థంలో కలిసిపోయింది (3)
4. కళాకారుడులా కురూపం ఉన్నవాడిని సంస్కృతంలో ఇలా అంటారు(5)
6. నిమ్మకాయ (4)
7. చివర (2)
9. కిల కిల ధ్వని చేయుట (7)
10. తెల్లగిసె
16. .... లేదు భయము లేదు. ఈ జంట పదాలలో మొదటి పదం అస్తవ్యస్తమయింది (3)
18. పండ్ల గుత్తి (2)
21. పంది ముల్లు (2)

**ఆధారాలు (నిలువు)**

1. చిలకల కొలికి పద్ధతిలో అలకల స్త్రీ (7)
2. తగవు (3)
5. మోసగాడు (4)
8. ముంగిస (4)
10. భయం
11. కూతురు మొదట్లో భయంతో ముడుచుకుపోయింది (3)
12. స్వాములకి అనటానికి చివరి అక్షరాన్ని పరుషం చేశాడు (4)
14. శ్రుతిలయలలో రెండవది (2)
15. తెలంగాణా మాండలికంలో ములక్కాయ (5)
17. చీకటి పడిందని తెలుగులో ఇంకోరకంగా చెప్పండి (6)
19. సగము మేనులు (4)
20. దర్భ. లవకుశ చిత్రం పేరులో రెండవ పదం (2)

**(సమాధానాలు ఈ సంచికలోనే మరో పేజీలో....)**


నిర్వహణ

**డా. తాడేపల్లి పతంజలి**

**ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట.**

**ఫోన్ : 98666 91587**

## సత్సంగం



### జ్ఞాని పాపాలు చేయగలడా? చేస్తాడా?

తనకి ఆత్మజ్ఞానం లేకపోవడం వల్లా, తాను శరీరమే అనుకోవటం వల్లా అజ్ఞాని, జ్ఞానిని చూచి ఒక దేహంగా భావిస్తాడు. ఆ అపోహతోనే జ్ఞాని యొక్క స్థితిని కూడా చూస్తాడు. జ్ఞానిని భౌతిక ఆకారంగానే చూస్తాడు. అంతేకాదు, తాను కర్త కాకపోయినా, తన దేహం చేసే పనులు తనవేనని కూడా అజ్ఞాని అనుకుంటాడు. అట్లాగే పనులు చేస్తున్న జ్ఞాని కూడా అంతే అనుకుంటాడు. కాని, సత్యమేమిటో జ్ఞానికి తెలుసు. అతని కే సందేహమూ లేదు. జ్ఞాని యొక్క స్థితిని అజ్ఞాని ఊహించలేడు. అజ్ఞానిని బాధించే ప్రశ్నలు జ్ఞానికి ఉదయించవు. ఏ కర్త అయినా తన కార్యాల యొక్క నైజాన్ని నిర్ణయించుకోవాలి. ఆత్మ ఎప్పుడూ కర్త కానేరదు. కర్త ఎవరో తెలుసుకో. ఆత్మదర్శనమిస్తుంది.

జ్ఞాని ఎవ్వరినీ అజ్ఞానిగా భావించడు. అతని దృష్టిలో అందరూ జ్ఞానులే. అజ్ఞానంతో, తన అజ్ఞానాన్నే జ్ఞానిపై కూడా మోపి, జ్ఞానిని కర్తగా చూస్తాడు, అజ్ఞాని. జ్ఞాని దేనినీ ఆత్మకి భిన్నంగా గమనించడు. ఆత్మ ప్రకాశమానం, శుద్ధ జ్ఞానం. అతని దృష్టిలో అజ్ఞానమంటూ ఏమీ లేదు. ఒక ఉదాహరణ ఇస్తాను, ఈ మాయను వివరించడానికి :

ఇద్దరు స్నేహితులు ప్రక్కప్రక్కనే పడుకొని నిద్ర పోయారట. అందులో ఒకడు, వాళ్ళిద్దరూ ఎంతోదూరం ప్రయాణించినట్టూ, ఎన్నో అనుభవాలు పొందినట్టూ కలగన్నాడు. నిద్ర మేల్కొనగానే తన స్నేహితునితో తన ప్రయాణం గురించి చెప్పి, అంతే కదా అని అడిగాడు. రెండవవాడు అదంతా అతని కలేనని, తనకీ దానికీ ఏ సంబంధమూ లేదని చెప్పాడు. అట్లాగే అజ్ఞాని కూడా తన భ్రమలని ఇతరులకి ఆపాదిస్తాడు.

# పాదముద్రలు (తెలంగాణ కథకుల పరిచయం)

డా॥ బి.వి.ఎన్.స్వామి, ఫోన్ : 924 781 7732

తెలంగాణ తొలితరం కథకులలో **ఒద్దిరాజు సోదరులు** ప్రసిద్ధులు. వీరి కథల్ని పరిశీలిస్తే ఆనాటి కథా ధోరణి, నాడు సంఘంలో జరిగిన విశేషాలు తెలుస్తాయి. ఓరుగల్లు మండలం, మానుకోట తాలూకా, ఇనుగుర్తి గ్రామ దేశముఖులు ఒద్దిరాజు వెంకటరామారావు, రంగనాయకమ్మ గార్లకు తేది 02-04-1887సం॥లో సీతారామచంద్రారావు జన్మించారు. ఆ తరువాత ఏడు సంవత్సరాలకు 04-04-1894 సం॥లో రాఘవరంగారావు జన్మించారు. తరువాత వీరు ఒద్దిరాజు సోదరులుగా ప్రఖ్యాతి గాంచారు. తెలుగు, సంస్కృతము, ఉర్దూ, ఆంగ్లములను నేర్చుకున్నారు. ఆయుర్వేదము, అల్లోపతి, హోమియోపతిలలో సాధన చేసారు. కొత్త కొత్త మూలికలు కనిపెట్టి ప్రజలకు వైద్యము చేసారు. విజ్ఞాన దాయకములు, దేశభక్తి ప్రేరకములైన గ్రంథములు రాసి ప్రచురించుటకు **"విజ్ఞాన ప్రచారిణీ గ్రంథమాల"ను** స్థాపించారు. మొత్తం 20 గ్రంథములు ప్రచురించారు. ఒకటి అర తప్ప మిగతావన్నీ వీరి రచనలే.

ఒద్దిరాజు సోదరుల కథలు తెలంగాణ కథకు ఒక చేర్పు. రాసిలో తక్కువే అయినా అవి వాసిలో ఎక్కువే. **రక్తమూల్యము, అదృశ్యవ్యక్తి, నీవేనా, లండను విద్యార్థి, పనిలేని న్యాయవాది** లభ్య కథలు. **నటి, పితృబంధనము, సమయసమరము, ఇరువురు మగలు** అలభ్య కథలు. రక్తమూల్యము కథ స్నేహధర్మాన్ని, నైతికతను చిత్రించింది. ఇద్దరు మిత్రుల కథ ఇది. పేద, గొప్ప తారతమ్యాలకు అతీతంగా సాగిన స్నేహం ఇందులో కనపడుతుంది.


గురురావు తన కుమారుణ్ణి విద్యకోసం లండన్ పంపడమే "లండన్ విద్యార్థి" కథలో విశేషము. ఇందులో వ్యంగ్యం పాలు కాస్త ఎక్కువగా ఉంది .

"పళ్లూడగొట్టుకొనుటకు పర్వతానికి పోయినారట రాయి కొరకు".

"ఎలుకలను బట్టుటకు గుట్ట త్రవ్వినారట"


"ఊరుపాయె హుసేనుసాయబు అంటే పోతే పాయె బడే సాయబు" లాంటి సామెతలు,

తల ప్రాణం తోకకు వచ్చింది, కండ్లు కాయలు కాచినవి, మీట నొక్కిన సిడివలె, కడుపుతీపి, తల్లిపాలు చేదా వంటి జాతీయాలు, పలుకుబళ్ళు కథకు అందాన్నిచ్చినవి. రకం, సిస్తు, నౌకరు, జవాను, మాఫి, దర్జా, వకాలత్, ముక్తారునామా, షోకులు వంటి ఉర్దూ పదాలు ప్రాంతీయ శోభను కూర్చినవి. ఆధునిక నాగరికత పేరుతో దేశీయతను చిన్నచూపు చూసేవాళ్ళకు కనువిప్పు కలిగించే కథలు



ఇవి. ఈ కథ ద్వారా దేశీయాత్మను పాఠకులకు అందించారు. తెలంగాణ పలుకుబళ్ళపై వీరికి ఉన్న అవగాహన కథకు జీవం పోసింది. తెలుగు భాష మాధుర్యం, పదప్రయోగ విజ్ఞానం, జాతీయత, సమాజ జీవనంపై పట్టు ఉన్న వీరు వస్తునిష్టతో రాసిన కథ ఇది. "అదృశ్యవ్యక్తి" సైన్స్ ఫిక్షన్ కథ. "నీవేనా" అనేక మలుపులు తిరిగిన కథ. "పనిలేని న్యాయవాది" అను కథ ఉత్తమ పురుషలో సాగింది. ఒక వ్యక్తి అనుభవాలు, ఆలోచనలు ఇందులో కనపడుతవి. వీరు రాసిన కథలు కొన్నే అయినను దేశభక్తి, సంఘుసంస్కార పూరితములు. దేశీయ భావనలు ఈ కథల్లో మనకు స్పష్టంగా కనపడుతాయి.

**పి.వి. నరసింహరావు** తెలంగాణ నుండి భారత ప్రధానిగా ఎదిగిన సాహితీవేత్త. **గొల్లరామవ్వ** అనే కథ వీరి కలం నుండి జాలువారిన మాస్టర్ పీస్. స్వయంగా ఇతడు కాంగ్రెస్ వాలంటీర్. అతని అనుభవంలో నుండి అవగాహనలో నుండి జాలువారిన కథ ఇది. ఆరంభం ముగింపు మధ్య నాటకీయత ఆధారంగా ఈ కథ పండింది. నాటి రజాకర్, నిజాం సైన్యాల దాష్టీకాల్ని కథ దృశ్యమానం చేసింది. వీరి వ్యంగ్య విలసిత నవలిక **"మంగయ్య అదృష్టం"**. ఇది సమకాలీన రాజకీయ వాతావరణ నేపథ్యంలో సాగుతుంది.





తెలంగాణ కథా సాహిత్యంలో **పాకాల యశోదారెడ్డి** గారిది విశిష్ట స్థానం. తెలంగాణ పల్లె భాషకు కథా గౌరవాన్ని కల్పించింది. "చూసినోళ్ళు, విన్నోళ్ళు నీకు తెలంగాణ భాష తప్ప ఇంకోటి రాదా అని అడిగి్రు. ఎందుకు రాదని **"ధర్మశాల"** కథలు శిష్ట వ్యవహారికంలో రాసిన అని ఆమే చెప్పుకున్నది. సామాజిక చలనాలను ఒకవైపు కథల్లో నిక్షిప్తం చేస్తుంటే మరోవైపు తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాల్ని యశోదారెడ్డి కథల్లో చిత్రించింది. ఇది ఈమె కథకు కల్పించిన యోగదానం. "తెలంగాణ ఆచార వ్యవహారాలు, వ్యవసాయపు పనులు, పొలం, వరికల్లం, దంచుడు, విసురుడు, ఇంకా విందులు, పెండ్లిళ్ళు, ముచ్చట్లుగా చెబుతామన్న ఆలోచన ఉండే. తర్వాత అవి కథలుగా రాసిన" అని ఆమె తన కథా వస్తువు గురించి చెప్పుకుంది.

తెలంగాణ మాండలిక సొగసును పరిచయం చేయడానికి **"మా ఊరి ముచ్చట్లు"** రాసారు. రెండున్నర జిల్లాల ప్రామాణిక భాషకు ధీటుగా పల్లె భాషను నిలబెట్టింది. తెలంగాణ పలుకుబడులను కథల్లో పొదిగింది. జీవితాన్ని భాషా నుడికారాలను, సంస్కృతీ సాంప్రదాయాలను కథల ద్వారా చాటిచెప్పింది. మాట్లాడుతున్న పల్లెటూరి మహిళ వీరి కథల్లో కనిపిస్తుంది. గ్రామీణ మానవ సంబంధాల నేపథ్యంలో కథను నడిపించింది. కొన్ని కథల్లో మధ్య తరగతి జీవితాలను చోటు కల్పించింది. మధ్యతరగతికి చరిత్రను మలుపు తిప్పే శక్తి ఉంది. ఆ జీవితాల్లోని హింస, సర్దుబాటు, ఆదర్శం మొదలగు వాటిని తన కథల్లో చిత్రించింది. మధ్యతరగతి జీవితాలను కథల్లోకి తీసుకురావడం వల్ల కథకు విస్తృతి పెరిగింది. ధర్మశాల కథ కొంత వరకు ఈ ధోరణిలోనే నడుస్తుంది.

మొత్తంగా చూస్తే వీరి కథల్లో పల్లెల్లోని కింది కులాలు, అగ్రకులాల ఇండ్లల్లో జరిగే పండగపబ్బాలు, సంస్కృతీ సంప్రదాయాల విశిష్టతలు తెలుస్తాయి. హిందూ వివాహ వ్యవస్థ, ఆహార విహార పద్ధతులు, అగ్ర వర్ణ మడీ – మైల, అంటరానివారి పట్ల ప్రదర్శించే వైఖరి కనపడతాయి. తెలంగాణ సాంఘిక వ్యవస్థను కథల ద్వారా ఆవిష్కరించారు. పండగలు, జాతరలు, శుభ కార్యాలు, జరిపే పద్ధతులతో పాటు పల్లె – పట్నం భేదం, మనుషుల మనస్తత్వాలు, పల్లెటూరి ప్రేమలు, వారి అమాయకత్వం, నిర్మలత్వం, కథల్లో చొప్పించారు. అత్తల ఆగడాలు, కోడళ్ళ అమాయకత్వం, అత్తకు, కోడలు అణిగిమణిగి ఉండాలి అనే సాంఘికాచారం కథల్లో ప్రముఖంగా కనబడుతవి. ఇలాంటి విషయాలు అనేకం రాసి పల్లె మహిళా దృక్పథాన్ని ఆమె తన గొంతును కథ ద్వారా పలికించారు.

**"మ్యానరికం"** బతుకమ్మ పండగ విశిష్టతలను తెలిపితే **"జమ్మి"** దసరా పండుగ గురించి తెలుపుతుంది. **"పీర్ల పండుగ"** ముస్లిం పండుగ ఆచారాలను వివరించితే, **"జతగాళ్ళు"** కథ హిందువులు, ముస్లిం దేవుళ్ణి కొలిచే సంగతులను వివరిస్తుంది. **"నిశ్చితార్థం", "ఎదురుకోళ్ళు"** కథలు హిందూ వివాహ వ్యవస్థలోని తంతును ప్రదర్శిస్తాయి. **"సంకుదేముడు"** కథ గిరిజన ప్రజల ఆచార సంప్రదాయాలు, వారి పెళ్ళిళ్ళు – పూజలు, మొక్కలు జరిమానాలు, కట్టుబాట్లు మొదలయిన వాటిని ప్రదర్శిస్తుంది. ఇలా భాషా సాంస్కృతిక నేపథ్యంలో తెలంగాణ కథకు యశోదారెడ్డి పట్టం కట్టింది.

తెలంగాణ కథా సాహిత్యంలో చెప్పుకోదగిన రచయిత్రి **ముదిగంటి సుజాతా రెడ్డి.** సంస్కరాణాభిలాష, మధ్య తరగతి జీవిత చిత్రణ, కులవృత్తి జీవితానుభవాలు, వీరి కథల్లో కనబడుతాయి. ఆయా శ్రేణుల జీవితాలతో పాటు సహజ సిద్ధమైన వారి మాండలిక భాష కథల్లో కదలాడుతుంది. ఇలాంటి శైలీ, రీతి ఒక ప్రజాస్వామిక దృక్పథాన్ని అందించింది. **"విసుర్రాయి", "మింగుతున్న పట్నం", "వ్యాపార మృగం", "నిత్య కల్లోలం"** వీరి కథా సంపుటాలు.



విసుర్రాయి సంపుటంలోని కథలన్ని స్త్రీల జీవితాల్లోని సంక్షోభాన్నే కాక, తెలంగాణ సంకులిత వాతావరణాన్ని చిత్రించాయి. స్త్రీల సమస్యలు, స్త్రీ కోణం, నుండి సహజ సిద్ధంగా ఆవిష్కరింపబడడం ఈ కథల్లోని విశిష్టత. వ్యవసాయ, పారిశ్రామిక, సాంస్కృతిక, సేవా రంగాలపై, ఆ మాటకొస్తే జీవన మూలాలన్నిటిపై వ్యాపార సంస్కృతి ఎంతటి ప్రభావాన్ని చూపించిందో మింగుతున్న పల్నం కథలు తెలుపుతాయి. ఛిద్రమైన బతుకుల సారాంశం ఆవిష్కృతమైంది. ప్రపంచీకరణ వల్ల పేదరికం పోయిందని ఆశించారు. అది భ్రమ అని తేలింది. పరాయీకరణ జీవితాల్లోకి చొచ్చుక వచ్చింది. మానవ సంబంధాల కంటే ఆర్థిక సంబంధాలకు ఎక్కువ ప్రాధాన్యత వచ్చింది. వస్తు వ్యామోహంలో విచిత్రమైన జీవన నమూనాలు ఏర్పరచుకుని, వాటికి మనిషి బందీ అవుతున్నాడు. ఈ విషయాలన్నీ కథల్లో కనబడతాయి. ప్రపంచీకరణ ఫలితాలను స్త్రీ పురుష సంబంధాలను, నక్సలైట్ల సమస్యలను, ముస్లిం స్త్రీల స్థితిగతులను, బ్రతుకులోని వైరుధ్యాలను కథల్లో ప్రవేశపెట్టింది. **"నిత్య కల్లోలం"** సంపుటి సార్థక నామధేయం. నేటి అభివృద్ధి నమూనా, సాంకేతిక ప్రగతి, కళ్ళు జిగేలు మనిపిస్తున్నాయి. అదే సమయంలో కంట నీరు పెట్టిస్తున్నాయి. ఆర్థిక అసమానతల వైరుధ్యం ఒకవైపు, చేతికందిన ఫలాలు, ప్రశాంతతను చెదరగొట్టడం మరోవైపు కనిపిస్తుంది. ఈ సంక్లిష్టతకు అద్దం పట్టేవి ఈ కథలు.

ఆకర్షణీయమైన కథనం, పాత్రోచిత భాష, సంభాషణలు, మలుపులు కథలను ఆకర్షణీయంగా చేసాయి. వస్తు వైవిధ్యానికి పెద్దపీట వేసినట్లుగానే కథా సంవిధానానికి హారతి పడుతరు. ఇంకా వీరు నవల, విమర్శ, సాహితీ చరిత్రలను పాఠక లోకానికి అందించారు.

1970 తరువాత తెలంగాణ కథ, తెలుగు కథకు మార్గదర్శనం చేసింది. పలు స్థాయిల్లో విప్లవోద్యమం విస్తరించింది. బాధితులు తమ అనుభవాల్ని కథలుగా చెప్పుకున్నారు. అలా కథకు మౌఖిక లక్షణం అబ్బింది. జైత్రయాత్రలు నడిపిన ప్రజలకు **"కల్లోలిత ప్రాంతం"** కానుకగా అందించింది. ఈ మొత్తం క్రమంలోని సమస్త కోణాల్ని రచయితలు కథలుగా మలిచారు. ప్రజల విజయాన్ని, పోరాటాల్ని, సంఘం ప్రయత్నాల్ని, పోరాటాన్ని అణచివేసే క్రమంలో దొరలు సాగించిన దాష్టీకాన్ని, పోలీసు జులుంను మొత్తం ప్రజా పోరాటాలను రచయితలు కథల ద్వారా చిత్రించారు. అలాంటి కథకుల్లో **అల్లం రాజయ్య** ఒకరు.

భూస్వామిక వ్యవస్థ నుండి నేటి ఉదారవాద విధానాల దాకా సాగిన పరిస్థితులను రాజయ్య గమనించాడు. ఈ క్రమంలో రైతాంగ జీవనంతోనూ, ఆదివాసి కడగండ్లతోనూ, దళిత ఘర్షణలతోనూ, మసిబారిన బొగ్గు గనుల బతుకులతోనూ, గ్రామీణ మహిళల అంతరంగాలతోనూ ఈయన ఆత్మ పెనవేసుకుంది. ఆచరణ



పునాదిగా కలిగిన ఇతని కలం అనేక కథల్ని పండించింది. గ్రామాల్లో అల్ప సంఖ్యాక కులాలు వనకులపై పట్టు బిగించి బలంగా తయారయ్యాయి. మిగతా అన్ని కులాల ప్రజలు సంఖ్యలో అధికమైనా, ఎక్కువ శ్రమించినా ఆకలితో కునారిల్లారు. ఈ అంతరమే విప్లవాలకు కుదరు అయింది. జమీందారీ, జాగిర్దారీ, కౌల్దారీ చట్టాలు, చదువుకుని తెలివి మీరిన వారికి చుట్టాలయ్యాయి. చదువులేని నిరుపేద యువకులకు ఉద్యమాలు దిక్కయ్యాయి. ఉత్పాదక శ్రమకు వెట్టి ఫలితంగా మిగిలింది. గట్టు మీది మనుషులకు దినుసు కడుపు నింపింది. కడుపు కాలిన వారి భూమి కబ్జా అయ్యేది. శిస్తు కట్టలేని వారి భూమి పరాయి వారి పేరు మీదకు మారేది. దీన్నంతా ప్రశ్నించిన వారి మీదికి అధికారం లాఠీతో దండెత్తేది. దానికి బదులుగా నాగండ్లు ఆయుధాలయ్యాయి. సంఘం, సిద్ధాంతం, నిర్మాణం ప్రజలకు వెన్నెముకలయ్యాయి. ఫలితంగా జైత్రయాత్రలు, కల్లోల ప్రాంతాలు తెర మీదకు వచ్చాయి. ఈ సమస్తం రాజయ్యకు కథా వస్తువైంది. కాళ్ళు పట్టుకున్నవారే గొంతు పట్టుకునే వరకు ఎదిగిన విధానాన్ని సవివరంగా కథల ద్వారా, నవలల ద్వారా దృశ్యమానం చేశారు. తరతరాలుగా అణచివేయబడిన రైతాంగం తిరుగుబాటు చేసింది. అమల్లో ఉన్న సమస్త విధానాలను, పద్ధతులను ప్రజానీకం ప్రశ్నించింది. పీడిత రైతాంగం, కూలీలు, కేవలం వారి విముక్తి కొరకే కాదు, మొత్తం సమాజ విముక్తి కోసం పోరాడుతున్నారనే శాస్త్రీయ అవగాహన రాజయ్య కథల్లో కనబడుతుంది. జరిగిన విషయాల్ని చెప్పుకుంటూ పోవడం వల్ల ఈ కథలకు మౌఖిక లక్షణం అబ్బింది. ఇక్కడి ప్రజల బాధల్ని వర్ణించి ఏకరవు పెట్టిన తీరు కథకు శైలిని అందించింది. రైతులు, కూలీలు, మొత్తంగా సబ్బండ వర్ణాలు తమ విముక్తి కోసం చేసిన ప్రయత్న పరంపర శిల్పంగా మారి కథల్లో పరచుకుంది.

**"ఎదురుతిరిగితే"** కథ నుండి మొదలైన రాజయ్య ప్రస్థానం చివరి వరకు ప్రజా పక్షమే వహించింది. ఇతడు రాసిన **"భూమి"** మరికొన్ని కథలు రైతాంగ పోరాటాలకు ప్రాతినిథ్యం వహిస్తే **"అతడు"** మరికొన్ని కథలు కార్మికోద్యమానికి అద్దం పట్టాయి. ఈ కథా సాహిత్యం సమస్తం,

## రైతు

భూమికి తడి అద్ది
దులిపినప్పుడల్లాజి
జీవకణాలు రాల్చగలుగుతాడు
మట్టి మార్మికతను
తను ఎంత గట్టిగా పట్టుకున్నాడో



మట్టిబెడ్డను ఎన్నిసార్లు మర్లేస్తాడో
తన బతుకును
మెతుకును వెతకడానికి
మట్టికి కోపం రాదు
మర్లేసిన రెక్కకు అలసట లేదు
వారిద్దరి మధ్య అనుబంధం
ఎంత మధురమో!

తన పాదం పడకుంటే
భూమి పసక మ(ర)దు
మట్టిని గో(ర)ల్లో ఇముడ్చుకోకుంటే
రైతు నోట్లోకి మెతుకు దూరదు
మట్టి కడుపును రైతు పండిస్తే
రైతు కడుపు
మట్టి నింపుతుంది కదా
మీ ఇద్దరి అన్యోన్యమైన ఆదర్శ జంట
మిమ్మల్ని మించిన మిత్రత్వం
ఇంకెక్కడ దొరకదు
మీ నమ్మకమే
నాలుగు మెతుకులుగా మిగిలి
ప్రపంచాన్ని నడిపిస్తుంది



**అట్టెం దత్తయ్య**
**పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఉ.వి.**
**ఫోన్ : 94947 15445**

బాధల్ని కథలుగా రాసుకోవడంతో మొదలైంది. గ్రామాల్లోని రైతు కూలీలు, రైతులు ఊర్లలో ఉండలేని దశకు కల్లోల ప్రాంతాల ప్రకటన తీసుకువచ్చింది. అక్కడినుండి వారు జీవికోసం, సింగరేణి బొగ్గు బాయిలకు వచ్చారు. ఇక్కడి అస్తవ్యస్త పరిస్థితులపై గళమెత్తారు. కనీస వసతులైన ఇల్లు, నీరు లేకపోవడం, పనిముట్లు లేకపోవడం, మేనేజ్‌మెంట్‌కు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల ప్రాణాలపై లేకపోవడం అన్నీ కలిసి కార్మికోద్యమాన్ని రాజేసాయి. పల్లెల్లో పోరు చేసిన రైతులే ఇక్కడ కార్మికులుగా పోరాటంలో ముందున్నారు. కనుకనే అందరి ఆలోచనల ప్రతిరూపంగా **"కార్మిక"** అనే రచయిత రూపుదిద్దుకున్నాడు. ఈ పరిస్థితిని చెబుతూ "ఈ కథా సాహిత్యం రూపంలో, వస్తువులో, భాషలో బూర్జువా సాహిత్యానికి భిన్నంగా ఉంది." అని రాజయ్యే తెలిపాడు.

నాగరీకులమనే మైదాన ప్రాంతాల వాళ్ళు ఆదివాసీ సమూహాల్లో అడుగు పెట్టారు. అటవీ ఉత్పత్తులను వారి వద్ద చౌకగా కొని, పొగాకు, బెల్లంలాంటి వ్యాపార వస్తువులను అడ్డగోలు ధరకు అమ్మారు. అడ్డగోలుగా వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దోపిడీ చేశారు. దీనికి తోడు ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం గిరిజనులపై సాగేది. ఈ సమయంలో మైదానాల మీదుగా ఉద్యమం అడవిలోకి వచ్చింది. గిరిజనులు ఉద్యమంతో మమేకమయ్యారు. ఈ పరిణామాన్ని కూడా కథలుగా మలిచాడు. ఇతడు రాసిన గిరిజన కథల్లో **'బురద'** కథకు విశిష్ట స్థానముంది. సాహుతో రాజయ్య కలిసి రాసిన **"కొమురం భీం"** నవల గిరిజన సమస్యను చిత్రించింది.

మధ్యవర్తులు, మనిషి లోపలి విధ్వంసం, మహాదేవుని కల లాంటి కథలు వ్యక్తికి ప్రపంచానికి మధ్యన, వ్యక్తి అంతరంగంలోనూ జరిగే ఘర్షనను చిత్రించాయి. మానవ సవబంధాలు ఏ ప్రాతిపదికన ఏర్పడుతున్నాయి. ఎలా ఏర్పడాలి అనే విషయాల్ని చర్చించాయి. శ్రామిక, యాజమాన్య మానవ సంబంధాలను వాస్తవికతా దృక్పథంతో చిత్రించారు. ఇతని కథల్లో పల్లె ప్రజల భాష జాలువారింది. పల్లెల్లో పుట్టి పెరిగిన వాడు కనుక, పల్లెల ఆయువు పట్టు తెలిసిన వాడు కనుక అలంకారాల్లో పల్లె వాతావరణం కనిపిస్తది. అతడు వేసే ఉపమలు పల్లె పట్టుల అందాన్ని పూయిస్తాయి. తెలంగాణ కథా సాహిత్యంలో అల్లం రాజయ్య కథ బలమైన ముద్ర వేసింది. వారు వాడిన మాండలికం చర్చకు దారి తీసింది. కోస్తా రచయితలు మాండలికం అర్థం కావడం లేదని, కథంతా అల్లం వాసన వేస్తుందని చమత్కారాలు పోయారు. రావిశాస్త్రి మాండలికాన్ని అర్థం చేసుకున్న వారు రాజయ్య భాషను అర్థం చేసుకోలేకపోవడం ఒక విరోధాభాస.

(మిగతా వచ్చే సంచికలో ....)

గ్రంథాంతరంగం 03


# నేటి కాలపు కవిత్వము

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

20వ శతాబ్దం ప్రారంభపు రెండు, మూడు దశకాల్లో రాయప్రోలు, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, వేంకట పార్వతీశ్వర కవులు, నండూరి, నాయని, వేదుల, బాపిరాజు మొదలైన కవి కుమారులు పైలాపచ్చీసు వయస్సులో భావ పదము, భావ గీతము, ప్రేమ గీతముల పేరిట ప్రణయ కవితలు వెలువరించారు. వీళ్లే కాకుండా అధికార్ల సూర్యనారాయణ, గరికిపాటి రామమూర్తి, తేకుమళ్ల రాజగోపాలరావు, కవికొండల వేంకటరావు, పువ్వాడ శేషగిరి రావు లాంటి అల్పజ్ఞాత కవులు కూడా భావ కవితల్ని అల్లినారు. రాయప్రోలు సుబ్బారావు గారి 'తృణ కంకణము' (1912) 'ప్రకాశకుల విజ్ఞప్తి'లో 'భావకవిత్వ' పదం మొట్టమొదటిసారిగా ప్రయోగించబడిందనీ, ఈ పదాన్ని వాడిన మనీషి గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారని ఖుద్దుగా రాయప్రోలు వారే డా॥ సి.నారాయణ రెడ్డి గారితో అన్నారట. (ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు : ప్రయోగములు. పేజి : 302, 1977) అంటే 'భావకవిత్వం' పద సృష్టికర్త గాడిచర్ల వారే అన్నమాట. ఆధునిక తెలుగు కవిత్వ చరిత్రలో ఇంకనూ బలంగా నమోదు కావాల్సిన సంగతి ఇది.

తెలుగు భావ కవితోద్యమం గారడీవాడు గాల్లో సృష్టించిన మామిడి పళ్లతో నిండిన చెట్టులా 1909లో వెలువడ్డ రాయప్రోలు వారి అనూదిత ఖండకావ్యం 'అనుమతి', 1912లో వెలువడ్డ 'తృణ కంకణం', 'ఖండకావ్యం', 1919లో ముద్రితమైన కృష్ణశాస్త్రి గారి 'కృష్ణపక్షం', 1922లో ప్రచురితమైన వేంకట పార్వతీశ్వర కవుల 'ఏకాంత సేవ' మొదలైన కావ్యాలతో యువత దృష్టిని, మనస్సును సూదంటు రాయిలా తనవైపు లాక్కొంది. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారే మూల విగ్రహమై ఉత్సవ విగ్రహ రూపంలో కూడా ఇరవై ఏళ్ళలోనే భావకవితోద్యమానికి అపారమైన ప్రచారం, ప్రఖ్యాతీ సంపాదించి పెట్టారు.

అపారమైన సంస్కృతాంధ్ర కావ్యనాటక పాండిత్యం, అసాధారణ మైన తర్కవ్యాకరణ వైదుష్యం, అద్వితీయమైన ఆంగ్లసాహిత్య ప్రావీణ్యం మూర్తీభవించిన విద్యాశేఖర అక్కిరాజు ఉమాకాంతం గారు 1926 ఆగష్టులో చెన్నపురి ఆంధ్రమహాసభలో నేటికాలపు కవిత్వం మీద తమ పాండితీ వైభవం, తర్కకౌశలం ప్రదర్శిస్తూ ఉపన్యసించి విరుచుకు పడ్డారు. ఈ ఉపన్యాసాలే కొద్దికాలంలోనే ఆంధ్రపత్రిక ఆదివారం సారస్వతానుబంధంలో అచ్చయ్యాయి. భావకవులు, భావకవితా ప్రియులు దిగ్భ్రాంతులై, నిశ్చేష్టులై వుండిపోయ్యారు. భావకవితారథసారథి కృష్ణశాస్త్రి, ఆయన అభిమాని శ్రీరంగం శ్రీనివాసరావు ఉమాకాంతంగారి విమర్శలకు వినయంగా తలలూపి


ప్రథమ ముద్రణ ముఖపత్రం లోపలి పుట నమూనా

పండిత శ్రీ ఉమాకాన్తవిద్యాశేఖరుల

కృతులు

వాఙ్మయపరిశిష్టభాష్యం

నేటి కాలపు కవిత్వం.

ప్రకాశకులు:

వావిళ్ల, రామస్వామిశాస్త్రులు అండ్‌సన్సు.

చెన్నపురి.

శ్రీ రామ ముద్రాక్షరశాలయందు

ముద్రితము.

1928

All Rights Reserved.] [ వెల రూ. 2-8-0.

మిన్నకుండి పొయ్యారే కాని బదులిచ్చే సాహసం చెయ్యలేకపోయారు. వర్డ్స్‌వర్త్, షెల్లీ, కీట్సు మొదలైన ఆంగ్ల కవుల కవితల్ని, వాటి ప్రభావంతో రూపుదిద్దుకొన్న భావకవిత్వ స్వరూప స్వభావాల్నీ, ఔచిత్యాన్నీ విద్యాశేఖరులు విమర్శిస్తే, కట్టమంచి రామలింగారెడ్డి విమర్శనా వైఖరిని నిలదీస్తే, ఆయన కూడా పెదవి విప్పలేక పొయ్యారు. 1928లో అక్కిరాజు వారి 'నేటి కాలపు కవిత్వం' 287 పుటలతో వావిళ్ళ రామస్వామిశాస్త్రి అండ్ సన్స్ ద్వారా ప్రచురితమై, భావకవిత్వంపై ఉరుములు వురిమింది; పిడుగులు కురిసింది. అక్కిరాజు ఉమాకాంతం పంతులు గారి అద్భుతమైన పాండిత్యానికీ, అమోఘమైన వాదనావైశారద్యానికీ పండిత ప్రపంచం నివ్వెర పోయింది. ఆ వజ్రాఘాతంతో భావకవిత్వం ఉద్యమం సన్నగిల్లిందే కాని, కాలక్రమంలో ఆధునికాంధ్ర కవిత్వ చరిత్రలో స్థిరమైంది. భావకవులు వెలిగిపొయ్యారే కాని విద్యాశేఖరుల విమర్శ తెరమరుగు కావడం విషావకరమునూ, చిత్రవిచిత్రం కూడానూ.

విద్యాశేఖర, విమర్శకులు అక్కిరాజు ఉమాకాంతంగారికి తెలుగు సాహిత్య చరిత్రలో దక్కాల్సిన గౌరవం దక్కకపోవడం గమనిస్తే

కథకులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రులు ఏనాడో అన్న ఈ మాటలు పదేపదే జ్ఞాపకం వస్తాయి.– **"తెలుగువారి ప్రతిభాప్రాగల్భ్యాలు తెలుగువారు అర్థం చేసుకోగలరు కాని అంగీకరించలేరు... మనలోనూ సమర్థులున్నారని అనుకోగలమే గాని ఆమాట పైకి చెప్పలేము."**

అక్కిరాజు ఉమాకాంతం పంతులు స్పష్టతకు, నిజాయితీకి మరోపేరు. 1928లో వెలువడ్డ వీరి విమర్శగ్రంథం **'నేటి కాలపు కవిత్వం'** భావకవిత్వాన్ని తుత్తునియలు చేసిపడేసింది. ఉమాకాంతం గారు భావకవిత్వానికి ప్రాతినిధ్యం వహించిన కృష్ణపక్షం, ఏకాంతసేవ, కావ్యకుసుమావళి, వనకుమారి పింగళికాటూరి కవుల తొలకరి, బాపిరాజుగారి తొలకరి, యెంకి పాటలు, నారాయణమ్మ నాయుడు బావ పాట, యెంకయ్య చంద్రయ్య పాట వివిధ సాహిత్య పత్రికల్లో అచ్చయిన కవికుమారుల ప్రణయ కవితలపై దృష్టి కేంద్రీకరించి తమ విమర్శ సాగించారు. పంతులుగారు భావకవిత్వం విశిష్టతను కొనియాడిన కవిపండితుల అభిప్రాయాల్ని తీవ్రాతి తీవ్రంగా విమర్శించారు. **"ఆయందము, ఆనూతనవికాసము స్వర్ణయుగపు వాఙ్మయచిహ్నలు."** అన్న దశిక సూర్యప్రకాశరావు (భారతి) మాటల్ని కటువుగా ఖండించారు. **"ఈ కృతులనేకములు భావగీతములని యిప్పుడు ప్రచారమునకు వచ్చిన కొత్త కవితా ప్రపంచమునకు చేరినవి. సంస్కృతము యొక్క దాస్యం నుండి విముక్తి నొందుచున్నామని మా నమ్మకం."** (నేటి కాలపు కవిత్వం, పు.7. 1928). పింగళి, కాటూరి కవుల 'తొలకరి' కవితాసంకలనానికి రాసిన పీఠికలో కట్టమంచి వారన్న మాటల్ని ఖరాఖండిగా ఖండించారు. ప్రాచీన సంప్రదాయాల్ని తిరస్కరించడం వల్ల నూతనత్వం వస్తుందనటం సమంజసం కాదంటారు అక్కిరాజు వారు. ప్రణయం, లతకూన, చిగురు, లలితం, కోమలం, దివ్యం ఇలాంటివి కొత్త శబ్దాలు వచ్చి, భావకవిత్వానికి నూతనత్వం తెచ్చి పెట్టాయనడం భావ్యం కాదు, ఇలాంటి అందమైన మాటలెన్నో ప్రాచీన తెలుగు కావ్యాల్లో వున్నాయని, వాళ్లమాటల్ని కొట్టిపారవేశారు. **'హృదయ మోహనమై, ప్రేమమృదులమైన', 'తన గుణలతలు పూచిన శోభలోయన చిరునవ్వు వెన్నెల చెండ్లు విసర'** రాయప్రోలు వారి 'తృణ కంకణము'లోని పై పంక్తుల్లోని మెత్తమెత్తని మాటలు భావ కవిత్వానికి నూతనత్వాన్ని సంతరించి పెట్టాయనడం సముచితం కాదన్నారు పంతులు గారు. ఇలాంటివి మన ప్రాచీన కావ్యాల్లో చిరకాలంనుండి వున్నాయన్నారు. (నేటికాలపు కవిత్వం: పేజీలు 15,16). **"యిప్పటి కావ్యాలు కొన్ని అంతటా మెత్తమెత్తటి మాటలతో నిడివున్నవని,"** అలా వుండటం **"భావసంకోచం, వెగటూ వంటి దోషాలకు హేతువని"** (నేటికాలపు కవిత్వం: పేజీ: 23) అక్కిరాజు వారభిప్రాయపడ్డారు. పూర్వకవులు వృత్తాలు, కందాలు ఆదరిస్తే భావకవులు గీతాల్ని, ద్విపదల్ని స్వీకరించడం నవీనత్వమని రామలింగారెడ్డి గారు పింగళి, కాటూరి కవుల 'తొలకరి' పీఠికలు చెప్పిన మాటల్ని ఉమాకాంతం గారు తిరస్కరించారు. కాగా ఆధునిక కవులు వృత్తాల్లో తమ కావ్యాల్ని రాశారనీ, ద్విపదల్లోని ప్రాచీనకవులైన పాల్కురికి, శ్రీనాథుడు, రంగనాథుడు కావ్యాలు వెలయించారనీ అంటూ కొత్త పద్యాలతో కవిత్వం రాస్తే **"అది పద్యాల కొత్త అవుతుంది. కవిత్వంలో కొత్తగాదు కదా"** (నేటికాలపు కవిత్వం– పేజీ : 30) అని అక్కిరాజు ఉమాకాంతులు అని తర్కించారు.

'నేటికాలపు కవిత్వం' కర్త భావకవుల కావ్యాల్నీ, గీతాల్నే కాక ధర్మవరం రామకృష్ణమాచార్యుల సారంగధర, చిత్రనళీయ నాటకాల్ని కూడా తమ విమర్శవలయంలోకి స్వీకరించారు. భావకవిత్వంలో ఉమాకాంతం గారికి కనిపించిన దోషం విస్తరణ. **"చెప్పవలసిన దానికంటె హెచ్చుగా కవిగాని, పాత్రలు గాని చెప్పటం విస్తరదోషం"** గా భావించారు అక్కిరాజువారు. దేవులపల్లి వారి 'కృష్ణపక్షం'లోని 'ఆశ', సాహితిలోని 'వియోగరాగము, ప్రబోధము' కవితలు (నేటికాలపు కవిత్వం– పేజీ: 42) విస్తరదోషానికి ఉదాహరణలుగా పేర్కొన్నారు.

పంతులుగారు భావకవిత్వంలో చూపెట్టిన మరోదోషం– నిదర్శన పరంపర, కృష్ణశాస్త్రిగారి **"కన్నీటి కెరటాల వెన్నెలేలా?"** అనే కవితలోనూ, బసవరాజు అప్పారావుగారి **"ఆమబ్బు యీ మబ్బు ఆకాశ మధ్యాన"** అనే కవితలోని నిదర్శనాల పరంపరను దోషంగా ప్రకటించారు ఉమాకాంతంగారు. (నేటికాలపు కవిత్వం – పేజీలు: 60, 61). **"ఒక భావం గాని, రసం గాని పరిపోషం చెందినప్పుడే కావ్యత్వ సిద్ధి కలుగుతున్నది. కాదా అవి కొన్ని మాటలే అవుతున్నవి గాని కావ్యం గాదు"** (నేటికాలపు కవిత్వం – పేజీ: 65) అంటూ కృష్ణశాస్త్రి గారి 'కృష్ణపక్షం'లోని విరిచేదె, విశ్రాంతి, శాపం, అబ్బ, 'తొలకరి'లోని మరపు, గద్దెపూలు మొదలైన కవితల్ని చాటువులన్నా, లేదా ఛాందసపు మాటలన్నా తప్పు లేదని కుండ బద్దలు కొట్టినట్లు చెప్పారు అక్కిరాజు వారు. (నేటికాలపు కవిత్వం – పేజీ: 66)

విద్యాశేఖరులు అయోమయత్వాధికరణం, పులుముడు ఘటనాధికరణం, శబ్దవాచ్యతాధికరణం అన్నచోట్ల భావ కవిత్వ దోషాల్ని చించి చెండాడారు. **"చెప్పదలచుకొన్నది చెప్పదానికి బలం లేని భీరుత్వమూ, చెప్పవలసినదేమీ లేనప్పుడు వ్రాయవలెననీ కోరికా అయోమయపు మాటలనే వెదలిస్తవి"** (నేటికాలపు కవిత్వం – పేజీ: 80) అంటారు ఉమాకాంతం పండితులు. వేంకట పార్వతీశ్వకవుల 'ఏకాంత సేవ'లోని ఈ పంక్తుల్లో అయోమయాలు బహుళంగా వున్నాయంటారు విద్యాశేఖరులు:

**"మధుర మోహన మూర్తి మందహాసమున**
**నద్భుతంగ లీనమై నట్టులుండ**
**మధుర హాసంబులో మాధురీ ప్రకృతి**
**యానంద ముద్రితమై నట్టులుండ**

**మధుర చంద్రికలలో మధురామృతంబు**
**మధురామృతంబులో మధుర రసంబు**
**మధుర రసంబులో మధుర భావంబు**
**మధుర భావంబులో మధుర రూపంబు**
**మధుర రూపంబులో మధుర తేజంబు**
**మధుర మోహన కళా మహితమై వుండ**
**మధుర స్వరంబులో మధుర గీతముల**
**మధుర గానంబులో మది మేళగించి"** (నేటికాలపు కవిత్వం – పేజీలు: 80, 81)

పై పంక్తుల్లో పలుమార్లు పునరుక్తమైన 'మధుర' శబ్దం ఎంత వరకు సార్థకమో, సముచితమో చెప్పలేం. భావకవులు ఇలా తమ కవితల్లో పలుచోట్ల ప్రదర్శించిన పునరుక్తుల్ని ఉమాకాంతం గారు తీవ్రంగా నిరసించారు. పంతులు గారు సుకుమార స్వభావులైన భావకవులకు వారి రచనల్లోని దోషాల్ని ఎత్తి చూపుతూ సమ్మెట పోటుల్లాంటి విమర్శలు చేశారు. మచ్చుకొకటి –

**"కవిత్వం వ్రాసేవాండ్లు లేరే అని దుఃఖించి కవిత్వం వ్రాయవద్దు. యేమీ వ్రాయకుండా యేమీ మునిగిపోలేదు. మనకు కాళిదాసాదుల కవిత్వం యుగయుగాల వరకూ ఆనంద పారవశ్యం కలిగించ గలిగినది ఉన్నది. కవిత్వం లేదు గతా అని దుఃఖపడవలసిన పని లేదు. ఇఘు ఆంధ్రులను పవిత్రులను జేసి సర్వభారత వర్షానికీ, సర్వలోకానికీ సందేశమిచ్చే కవిత్వం పద్యరూపాన గాని, గద్య రూపాన గాని వస్తుందా, దాన్ని ఆంధ్రదేశం శిరసావహించగలదు. కాని యిప్పుడు కవిత్వం కొరతగా వున్నదని దుఃఖపడి మాత్రం వ్రాయవద్దంటున్నాను."** (నేటి కాలపు కవిత్వం – పేజీ. 89) విద్యాశేఖరుల వారి ఈ హితవచనాలు సబబే కాని, ఇవి ఇంత కఠోరంగా వుండాలంటారా? సుకుమార భావకవుల పట్ల ఈ మాటలు **"పుష్పరాశౌ వివాగ్నిః"** అనిపించడం లేదూ?

ఉమాకాంతం పంతులు గారికి భావకవిత్వంలో విశేషంగా కనపడే దోషం – పులుముడు. **"... ఒక్క భావానికెన్నో మాటలు గుప్పించి అర్థవిభూత్వాన్ని అంతం జేసి మాటలు దండగ జేయడం పులమడం. దీన్నే వాచ్యమని, అధమమని భారతీయ సాహిత్యవేత్తలు నిరసించారు"** (నేటికాలపు కవిత్వం – పేజీ.97) వేంకట పార్వతీశ్వర కవుల **"ఏకాంత సేవ"** లోని కింది పంక్తుల్ని అక్కిరాజువారు పులుముడికి నిదర్శనంగా చూపారు –

**"ప్రేమాలయంబులో ప్రియుడాడువేళ**
**ప్రేమడోలికలలో ప్రియు డూగు వేళ**
**ప్రేమామృతాబ్ధిలో ప్రియుడీదు వేళ"**

యేమీ తోచకపోతే 'పాడిందే పాటరా' అని కొంతసేపు మాటలు దండగబెట్టే పద్యకర్తల ధోరణి ఇది. (నేటికాలపు కవిత్వం – పేజీ. 101,102) కవిత్వంలో పులుముడును ఇంతగా ద్వేషించే, నిరసించే



అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు

అక్కిరాజు ఉమాకాంతుల వారి ఈ పుస్తకంలోనే పులుముడు మాటలు కొన్ని చోట్ల తారసపడతాయంటే అశ్చర్యం వేస్తుంది. కృష్ణశాస్త్రిగారి **"కన్నీటి కెరటాల వెన్నెలేలా? నిట్టూర్పు గాడ్పులో నెత్తావి యేలా"** మాటలు పునరుక్తం అయ్యాయి. (నేటికాలపు కవిత్వం–పేజీ. 60–61, 100) అలాగే వేంకట పార్వతీశ కవుల 'ఏకాంతసేవ'లోని ఈ పంక్తులు – **"మధురమోహన మూర్తి మందహాసమున నద్భుతంబుగ లీనమై నట్టులుండ"** కూడా మరో రెండుచోట్ల కూడా ఉల్లేఖింపబడ్డాయి. (నేటికాలపు కవిత్వం – పేజీ. 80,99,105) మరి ఈ పులుముడిని ఉమాకాంతం గారి పొరపాటందామా? లేదా గ్రహపాటందామా?

అక్కిరాజు ఉమాకాంతంగారికి నేటికాలపు కవిత్వం అంటే భావ కవిత్వంలో నచ్చని మరో దోషం శబ్దవాచ్యత. మాధుర్యం, సౌకుమార్యం, సౌందర్యం, సహజత్వం మొదలైనవి కవితల్లో కనపబడాలి. కాని కవి నేరుగా వాటిని చాటకూడదంటారు. అంటే ఆ కావ్య వైశిష్ట్యం ధ్వని గర్భితంగా వుండాలి కాని, అభిధార్థకంగా వుండకూడదంటారు అక్కిరాజు గారు. కృష్ణశాస్త్రిగారి ఈ పంక్తులు

**"తరుణ శృంగార మధుర మాధవుడవీవు**

**కలికి పాటల కోయిల కులము మాది"** (నేటికాలపు కవిత్వం – పేజీ. 108) శబ్దవాచ్యతకు నిదర్శనంగా పేర్కొన్నారు.

**"అనుచితమైన శబ్దవాచ్యత రోత"** (నేటికాలపు కవిత్వం – పేజీ. 120) అంటూ శబ్దవాచ్యతాధికరణాన్ని ముగించారు విద్యాశేఖరులు.

ఎంతోమంది భావకవుల కవితల్లో అయోమయం, పులుముడు, శబ్దవాచ్యత దోషాలున్నాయని సోపపత్తికంగా ఉమాకాంతం గారు నిరూపించారు. కాని డా.సి.నారాయణ రెడ్డి గారు మాత్రం అక్కిరాజు ఉమాకాంతం గారి విమర్శను దోషపూరితంగానూ, ఆధునిక కావ్య దృక్పథ రహితంగానూ భావించి ఇలా రాయడం సమంజసంగా తోచదు –

**"భావ కవిత్వమునకు 'పులుముడు', 'శబ్దవాచ్యత' మున్నగు దోషముల నంటగట్టి దీనిని తీవ్రముగా ఖండించిరి. పూర్వ లాక్షణికు లేర్పరచిన కొలతబద్దలతో ఈ కవిత్వమును కొలుచుట వలన వీరి దృష్టికిది విడ్డూరముగా తోచినది. దేశకాల పరిస్థితులను బట్టి, విదేశీయ సాహిత్య ప్రభావమును బట్టి ఈ కవిత్వమును పరిశీలించినచో వారికింతటి నిరసన దృష్టి కలిగెడిది కాదు."** (ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు : ప్రయోగములు. పేజీ. 310, 1977 ద్వి.ము.)

భావకవిత్వంలో పుష్కలంగా కనపడే పులుముడు, శబ్దవాచ్యతల్ని ఉమాకాంతం గారు దానికి అంటగట్టి, తీవ్రంగా ఖండించారనడం దుబారామాటే. కాని భావకవిత్వం పట్ల అక్కిరాజు వారికి **"ఇంతటి నిరసన దృష్టి"** ఉండకూడదన్న రెడ్డిగారి మాట సమ్మతించవలసిందే.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల**

**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**


ఉమాకాంతం పంతులుగారు **'దృష్టివిచారాధికరణము'**లో భావ కవులు తాను, తన ప్రేయసి లేదా భార్య పట్ల ప్రేమ, విరహాల్ని ప్రదర్శించి సంకుచిత దృష్టి ప్రదర్శించారే కాని లోక కల్యాణ పర విశాలదృష్టిని కనపరచలేదని అన్నారు. అందుకు నిదర్శనాలుగా కొంతమంది కవితల్లోని పాదాల్ని ఉదాహరించారు.

**"త్రోవలో దాని (ప్రియురాలి) రసన కంటుకొని పోదు"** (నాయని సుబ్బారావు, భారతి 1–7)

**"ప్రియతమా వేరు చింతల విడిచితదవు**

**సేయకిక నన్ను నక్కున జేర్చుకొనుము"** (జంధ్యాల శివన్న శాస్త్రి)

**"కన్నులరవిప్ప నే నిన్ను గాంచినపుడె**

**ఆర్ద్ర హృదయంబు చలియించి యవశమాయె"** (పాపినేని వేంకటేశ్వర రావు) (నేటికాలపు కవిత్వం – పేజీ.121)

ఉమాకాంతం భావకవుల ప్రేమగీతాల్ని ఇలా ఉదాహరిస్తూ నిర్మొహమాటంగా, నిర్దాక్షిణ్యంగా ఈ విధంగా అంటున్నారు –

**"నా జీవితం, నా ప్రేమ, నా జానకి, మనమిద్దరమైక్యమౌదామె అని వీరి స్త్రీ తప్ప, వీరికి మరి విశాల దృష్టే కనబడదు. లోకం వీరికి అవిదితమై కూపస్థ మండూక సాదృశ్యం పొందినారు."** (నేటికాలపు కవిత్వం – పేజీ. 122)

అక్కిరాజు గారు భావకవులు తమ కవితల్లో రాయదుర్గం చేంతాడు లాంటి సంస్కృత సమాసాల శృంఖలాలు గుప్పించి, అవి **"తెలుగులో యిమడక అసంబద్ధమై హేయమవుతున్నవి. ఇదే భాషాతిక్రమం."** (నేటికాలపు కవిత్వం – పేజీ. 129) పంతులుగారు ప్రసిద్ధ భావ కవులైన కృష్ణశాస్త్రి, వేంకట పార్వతీశ్వర కవులు, దువ్వూరి రామిరెడ్డి ప్రభృతుల కావ్యాల్లోంచి ఉదాహరణల నిచ్చారు.

**"శారద శర్వరీ మధుర చంద్రిక సూర్యసుతా స్రవంతికా**

**చారు వినీల వీచిక ప్రశాంత నిశాపవనోర్మి మాలికా**

**చారిత నీపశాఖి నికృశాంగి"** (కృష్ణపక్షం)

**"మాన ఫలభరిత తరుయుత కాననవల్లీ మతల్లికావాస కిరాతానీకనేతయై"** (కావ్యకుసుమావళి – 1)

**చంచద్గరుద్భిన్న నిర్మల వీచిమృదుడోలికా పరినట ద్రాజీవ పత్రంబుగన్"** (వనకుమారి) (నేటికాలపు కవిత్వం – పేజీ. 130, 131)

పాఠకులకు దుర్బోధమైన సంస్కృత సమాస పరంపరల వల్ల భావకవులు తమ భావాల్ని కళాత్మకంగా వ్యక్తం చేయడంలో విఫలులైనారన్నదే పిండితార్థం. (సశేషం)

తెలుగు బోధన – నైపుణ్యాలు

# 4. లేఖన బోధన

**డా. వై. రెడ్డి శ్యామల,** ఆచార్యులు, నిఘంటు నిర్మాణశాఖ, పొ.తె.వి.విద్యాలయం,
ఫోన్ : 98496 97688



భాష ప్రాథమిక రూపం ధ్వని. ఏ భాషలోనైనా భావవినిమయ సాధనాలుగా ధ్వనులుంటాయి. అయితే కొన్ని భాషలు లేఖన రూపాన్ని కూడ సంతరించుకున్నాయి. ఆయా భాషా సమాజాలు లేఖనాన్ని విభిన్న పద్ధతులలో అభివృద్ధి పరచుకున్నాయి. భాషా శాస్త్రజ్ఞులు ఈ లేఖనం ఆరు రకాలుగా ఉన్నట్లు గుర్తించారు. భిన్న రూపాలలో లిపి అభివృద్ధి జరిగింది. స్థూలంగా చెప్పాలంటే వర్ణమాలలో కనిపించే రూపం (మనం అక్షరం అంటాం కదా) ఒక్కొక్క విధంగా ఉంటుంది. Logo syllabary లో ప్రతి అక్షరం 'పదాంశం'గా ఉంటుంది. పదాంశం అది ప్రతిపాదించే అర్థాన్ని కలిగి ఉంటుంది. కనుకనే దీనిని Morpho Syllabary అని కూడా అంటారు. పూర్తి ఇటువంటి లిపి క్రమం ఉన్న భాషలు ఇప్పుడు లేవు. ఇక రెండవది Syllabary. ఈ లిపిలో ప్రతి రూపం, అక్షరం అయి ఉంటుంది. Syllable అంటే అచ్చును కలిగినది. మూడవది Abjad. ఈ లిపిలో ప్రతి గుర్తు హల్లును కలిగి ఉంటుంది. సెమిటిక్ రకం లిపి ఈ వర్గానికి చెందినది. నాల్గవది Alphabet ప్రతిగుర్తు హల్లును లేదా అచ్చును కలిగి ఉంటుంది. ఇది గ్రీకు రకం లిపి. ఐదవది Abugida. ఈ లిపిలో ప్రతిగుర్తు అచ్చును లేదా హల్లును ప్రతిపాదిస్తాయి. హల్లు ఎప్పుడు అకారంతో ఉంటుంది. మన సంస్కృత వర్ణమాల వంటివి ఈ విభాగాన్ని కలిగినది. ఆరవది Feataral లిపి. కొరియన్ భాషాలిపి ఈ రకానికి చెందినది. ఈ లిపిలో ప్రతి అక్షరం భాషలోని ధ్వనికి సంబంధించిన లక్షణాలను కలిగి ఉంటాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ నాడు అదనపు ధ్వని సంకేతాలుగా ఉపయోగించే గుర్తులు. డియోక్రటిక్ సంకేతాల వంటివి కలిగి ఉంటాయి.

లేఖనం – భాష మధ్యనున్న సంబంధాన్ని కూడ అర్థం చేసుకోవడానికి మానవ భాష తరతరాలనుండి అభివృద్ధి చెందుతూ వస్తున్నది. మానవ సమాజంలో భాష ఒక ప్రధానం అంగం. ఇది సమాజంలో కలిసిపోయి ఉంటుంది. ఒక తరంనుండి మరొక తరం అనివార్యంగా భాషను నేర్చుకుంటుంది. పుట్టిన శిశువు మానవ సమాజంలో కలవడానికి భాష ఒక అనివార్య సాధనం. కనుక పిల్లవాడు తన చుట్టు ఉన్న వాతావరణం నుండి భాషను గ్రహిస్తాడు. లేదా అలవరచుకుంటాడు. కానీ లేఖనం అటువంటిది కాదు. ఆ భాషా సమాజంలో ఉండటం వలన లేఖనం అబ్బదు. దీనికి ప్రత్యేకమైన బోధన, శిక్షణ అవసరం అవుతుంది.

ఆయా భాషలలో ఉండే ధ్వని, వర్ణం, పదాంశం వంటివి మాన మస్తిష్కంలో నిక్షిప్తమవుతాయి. ఆ విధంగా అతడు భాషించేటప్పుడు తిరిగి ఉపయోగించుకుంటాడు. కానీ లేఖనం అలాకాదు. భాషకు ఇచ్చిన కృత్రిమ రూపం లిపి. ఇది నేర్చుకుంటున్నాం అన్న స్పృహతో నేర్చుకోవలసిందే. భాషలో ఉచ్చరితమయ్యే దానికి లిపి కూడా విభిన్నరూపాలలో ఉండవచ్చును (పై ఆరు రకాలుగా). భాషలోని ఎంత భాగాన్ని ఒక లిపి సంకేతం ప్రాతినిధ్యం వహిస్తుంది అనేది ఒక్కొ భాషలో ఒక్కోరకంగా ఉంటుంది. తెలుగులో భాషలోని కనిష్ఠాంశమైన ధ్వని మన అక్షరాలు ప్రతిపాదిస్తాయి. ఉదాహరణకు 'నీతి' లోని ప్రతి ధ్వనికి లిపి సంకేతం ఉంది.

లేఖన విధానంలో మరొక అంశం ఒకే లిపి సంకేతం భిన్నంగా గుర్తింపబడడం. ఉదాహరణకు ఇంగ్లీషులో రెండు విధాలుగా కాపిటల్ మరియు లోవర్ కేస్ అక్షరాలుంటాయి. తెలుగులో ప్రాథమిక గౌణ సంకేతాలుగా క – ్క కావత్తు రెండు రూపాలు ఉంటాయి. భాష ప్రవాహశీలమైనది. మారుతూ ఉంటుంది. లేఖనం అంత వేగంగా మారదు. ఇది సంప్రదాయానుసారంగా ఉంటుంది.

లేఖన సంప్రదాయాన్ని అంటే లిపిని మార్చవచ్చు. అంటే ఒక భాషను ఒక లిపిలో రాసినట్లు మరొక లిపిలో కూడా రాయవచ్చు. ఉదాహరణకు పంజాబీ భాషను గురుముఖి (భారతదేశం) లిపిలోనూ, షాముఖీ (పాకిస్తాన్) లిపిలోనూ వ్రాస్తారు.

లేఖనం ధ్వనిని అనుసరించి ఉంటుంది. మాట్లాడే వ్యక్తి ఉచ్చరించిన దానిని అనుసరించి (ఇంచుమించుగా) లేఖనం శాశ్వతమైన లిపి సంకేతాలలో లిఖించబడుతుంది. అంటే ఉచ్చారణను లిఖిత రూపంలో నిక్షిప్తం చేస్తుంది. అలాగే లిఖితమైన దానిని ఉచ్చరిత రూపంలో కూడ మార్చవచ్చు. దీనిలో కొంత సంప్రదాయం కూడ ఉంటుంది. ఎందుకంటే ఏ భాషాలిపి కూడ ఉచ్చారణము పూర్తిగా ప్రతిపాదించదు.

**లేఖన దిశ –** లేఖనం లోని మరొక అంశం దిశ. ఎటు నుంచి ఎటువైపుకు రాస్తున్నాం అన్నది దిశ. చాలా భాషల లేఖనం ఎడమవైపునుండి కుడి వైపుకు నడుస్తాయి. కొన్ని భాషలు కుడినుండి



ఎడమకు, మరికొన్ని పై నుండి కిందకు కదులుతాయి. ఒక వాక్యం ఎ – కు రెండవ వాక్యం కు – ఎ వైపుకు రాసే పద్ధతిని బోస్ట్రో ఫెడోన్ (boustrophedon) అంటారు. అంటే ఎద్దు మరలినట్లు (భూమిని దున్నినప్పుడు). ప్రాచీన గ్రీకు శిలాశాసనాలలో ఈ విధానం కనిపిస్తుంది.

**వర్ణక్రమం :** భారతీయ భాషల వర్ణక్రమంలో వర్ణాలు రెండు భాగాలుగా ఉంటాయి. అచ్చులు, హల్లులు. హల్లులు ఉచ్చారణ స్థానాన్నిబట్టి వెనుక నుండి ముందుకు అనే క్రమం అనుసరించి వర్గక్రమం పాటించబడింది శ్వాస, నాద అనునాసికం అనేక్రమంతో పాటు అల్పప్రాణం, తరువాత మహాప్రాణం అనే క్రమంకూడ ఉంటుంది. ప్రత్యేకమైన క్రమంలేని వర్ణమాలలు ఉన్నాయి.

**వర్ణాలకు పేర్లు :** అక్షరాలకు కొన్ని భాషలలో పేర్లు ఉన్నాయి. కాగా కొన్ని భాషలలో అది ఉచ్చరింపబడే ధ్వనే పేరుగా ఉన్నది. తెలుగు వర్ణమాలలో ఉచ్చరించబడే ధ్వనే ఆ అక్షరం పేరు 'అ', 'త' అనే ఉచ్చారణ అదే పేరు.

లేఖనం – జ్ఞానం గురించి ఒకమాట చెప్పుకోవాలి. నాగరికతలో లేఖనం ఒక ముఖ్యమైన అంశం. అయితే భాషకు లేఖనానికి (లిపికి) సంబంధం లేదు. ప్రపంచంలో లిపి లేని భాషలే ఎక్కువ ఉన్నాయి. ఆ భాషసమాజాలలో జ్ఞానాభివృద్ధి మౌఖికంగానే జరిగింది. వారి ఆచారవ్యవహారాలు, సాహిత్యం, న్యాయవ్యవస్థ, పరిసరజ్ఞానం అంతా మౌఖికంగా ఒక తరంనుండి మరొక తరానికి అందుతూ ఉంది. మన భారతీయ వ్యవస్థలో కూడ లిపి ఉన్న కూడ మౌఖిక లేఖన సంప్రదాయాల రెండింటి ద్వారా జ్ఞానం పరంపరాగతం అవుతున్నది. కనుక లిపి లేని భాషలకు సముఖాలను తక్కువగా చూడరాదు.

ఒక భాషలో లేఖన సంప్రదాయం ఉన్నప్పుడు ఆ భాషా సమాజంలోని వారు తమ జ్ఞానాన్ని, అనుభవాలను తప్పక లేఖన రూపంలో కూడ నిక్షిప్తం చేస్తారు. ప్రాచీనులు దానికి తాళపత్రాలను, బూర్జ్వ పత్రాలను, శిలాఫలకాలను, లోహ ఫలకాలను మాధ్యమంగా చేసుకొన్నారు. తరువాత కాగితం వచ్చింది. ఇప్పుడు డిజిటల్ మాధ్యమం కూడ అంతేవేగంగా వ్యాప్తి చెందుతున్నది. దీనికి బట్టి లేఖనం ప్రాధాన్యతను గ్రహించాలి. లేఖనం ద్వారా సమకాలీనులకే కాక, కాలాన్ని అధిగమించి జ్ఞానాన్ని సంగ్రహించవచ్చు. దూరాన్ని అధిగమించవచ్చు.

ఒక విద్యార్థికి లిపిని నేర్పిస్తున్నాం అంటే ఒక జ్ఞాన భవనానికి ఉన్న సింహద్వారంలోనికి ప్రవేశపెడుతున్నాం అని అర్థం. ఆ భాషకు సంబంధించిన ప్రాచీన, అర్వాచీన సమకాలీన జ్ఞానార్జనకే కాక, భవిష్యత్‌కు అతని నుండి అందే జ్ఞానానికి కరదీపికగా లేఖనాన్ని పరిచయం చేస్తున్నాం.

ఒక భాషా వారధిగా ఆ వ్యక్తి మారుతున్నాడు అని అర్థం. ఇక విద్యా విధానంలో ఒక భాషను బోధించడం అన్నది అంతటి విశిష్ట విషయంగా గుర్తించాలి. ఏ కారణం చేతయినా ఒక భాష బోధననుండి తొలగిపోతే పై విషయాలన్ని అంతర్ధానమౌతాయి.

తెలుగుభాషలో లిపిబోధన గురించి ఇంతకుముందు కొంత చర్చించాం. బోధించే సమయంలో విద్యార్థికి అక్షర రూపం రాసే విధానం వంటివి. దీనితోపాటు అతి ముఖ్యమైనది ఉచ్చారణ. అంటే భాషకు, లేఖనానికి అనుసంధానం కల్పించడం. భాషలో అ,క,హ వంటి ధ్వనులను వ్యస్థంగా పలకడం. కానీ వ్రాతలో వ్యస్థంగానే ఉంటాయి. పలికేటప్పుడు వాటిని చెవి సక్రమంగా గ్రహించాలి. దానికి లేఖన రూపాన్ని ఇవ్వాలి. ఉదాహరణకు 'సీతొచ్చినాల్గైద్రోజులైంది' అని ఉచ్చారణంలో (సంభాషణలో) ఉంటుంది. కానీ లేఖనంలో ఉండే అందరూ ఆమోదించబడిన కృత్రిమత్వం (ఇది గుణమే) కారణంగా 'సీతవచ్చి నాలుగైదు రోజులు అయ్యింది' అని ఉంటుంది. సహజ భాషణానికి నియమితరూపంలో లేఖనం ఉంటుంది. కొన్నిభాషలలో (తమిళం) భాషణానికి లేఖనానికి చాలా దూరం ఉంటుంది. మనకు పూర్వం గ్రాంథికం ఉన్నప్పుడు ఈ దూరం కొంచం ఉండేది. ఇప్పుడు మాట్లాడే పద్ధతికి దగ్గరగా వ్రాయడం అన్నది వ్యవహారంలో ఉంది.

విన్నది రాయగలగడం, రాసింది చదవ గలగడం రెండూ కలిసి ఉంటుంది. లేఖనంలో కనుక విద్యార్థికి ఆ విధమైన శిక్షణ ఇచ్చేది పాఠశాల. అంతే కాక తాను ఆలోచించిన విషయాలను, పరిశీలించిన అంశాలను లేఖన రూపంలో వ్యక్తీకరించడానికి సంసిద్ధుడిని చేసేది కూడ పాఠశాలయే. ఇతరులు లేఖనం ద్వారా వ్యక్తీకరించిన జ్ఞానాన్ని గ్రహించడానికి తోడ్పడే పరిశ్రమను కూడా ఇక్కడే పొందాలి.

దీనికి తోడ్పడే సాధనాలను చర్చించుకోవాలి. లిపి గురించి చూసినప్పుడు ఒక్కో వ్యక్తి చేతిరాత ఒక్కొ విధంగా ఉంటుంది. ఆ వైవిధ్యాన్ని గుర్తిస్తూనే అసలు రూపాన్ని గ్రహించి చదవగలగాలి. అంటే లేఖనంలోకి వ్యక్తిగత వైవిధ్యాలను విద్యార్థి గ్రహించాలి. అదే విధంగా అసలు రూపంపై స్పష్టత కలిగి ఉండాలి. ప్రింట్‌లో కనిపించే వివిధ ఒత్తులను గుర్తించాలి.

తెలుగుభాషలో అక్షరంకున్న లక్షణం ఎటువంటి పదాన్నైనా రాయగల శక్తి ఉండటం. ఎవరైనా ఏ భాషలో ఉన్న పదాన్నైనా ఉచ్చరిస్తే ఇంచుమించుగా తెలుగులిపిలో రాయవచ్చు. దీని వలన రెండు లక్షణాలు ఏర్పడ్డాయి. ఉచ్చారణ విధేయంగా రాయగలగడం. ఒక విధంగా ఇది గుణం. అయితే తప్పులు రాయడానికి కూడ అవకాశం ఏర్పడుతుంది. ఉదాహరణకు ఇంగ్లీషులో పదానికి లిపి క్రమం తప్పనిసరి. అందుకే అక్కడ లిపిక్రమాన్ని నేర్చుకుంటారు ఊహించి రాయడానికి ఉండదు. కాని తెలుగులో.


విన్నది రాయడానికి కుదురుతుంది కనుక సరైన ఉచ్చారణ లేనివారి నుండి గ్రహించినపుడు లిపిక్రమం తప్పుగా రాయడానికి వీలుకలుగుతుంది. కనుకనే మహాప్రాణాలు, ఊష్మాలు, దీర్ఘం, అజ్లోపం వంటివి లేఖనంలో కనిపిస్తాయి. తెలుగు భాషలోకి చేరిన సంస్కృత పదాలకేకాక తెలుగు పదాల లిపిక్రమంలోనూ, ద్విత్వం సంయుక్తం రాసేటప్పుడు ఉండే లేఖన సంప్రదాయాలు విద్యార్థులకు అవగతం అవ్వాలి. లేఖనం ఆ భాషలోని వ్యకరణాలను, నిఘంటువులు అనుసరిస్తాయి.

మాట్లాడేటప్పుడు కేవలం భాషా ధ్వనులేకాక, మాట్లాడే ఆంగికం, సందర్భం కూడా అర్థావగహనకు తోడ్పడతాయి. కానీ లేఖనం ద్వారా గ్రహింపు చేసుకోవడానికి కేవలం లిపి రూపం మాత్రమే ఉంటుంది. కనుక దీనికి పర్యవేక్షణ నిఘంటువు, వ్యాకరణం మాత్రమే. ఇంకా రాసిన వ్యక్తి ఎదురుగా ఉండదు.

కనుక లేఖనాన్ని ఒక విస్తృత దృక్పథంలో అవగాహన కల్పించాలి. విద్యార్థులు ఒక పెద్ద సంప్రదాయానికి వారసులుగా తీర్చిదిద్ద బడుతారు. చక్కటి దస్తూరి, స్పష్టమైన వ్యక్తీకరణ చేయగలిగేలా లేఖన బోధన ఉండాలి.


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**




ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**

**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**

**వెల : 300/-**

**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**


# నేను ఇప్పుడూ

మంటల స్నానం చేస్తున్నాను
చెమటను గాలితో ఆరబెట్టుకుంటున్నాను
ఎక్కడ చూసినా మంటల ఎండలు
గాలి స్తంభించినట్టుగా ఉంది

ఆకాశం మేఘావృతమై ఉంది
మబ్బుల చాటు సూర్యుడు
బందీ అయినట్లుగా ఉన్నాడు

ఆకాశంలో అక్కడక్కడా మబ్బులు
కొండల్లాగా ఉన్నాయి

దండెంపై వేసిన వస్త్రాలు
గాలిలో పతంగులు ఎగిరినట్లుగా
మనుషులు ఎగిరిపోతున్నారు

సుడిగాలి చుట్టుముట్టి ఆకాశంలోకి
ఆకులు అలాలు... చెత్త ఎగిరిపోతుంది

కాలం వర్షం వచ్చినట్టే వచ్చి ఆగిపోయింది
భూమిలో మొలకెత్తీ మొలకెత్తని
విత్తనాల మొలకల్లాగా

ఇప్పుడు పరిస్థితులన్నీ తారుమారు అవుతున్నాయి
దానికి సమాధానం ఎవరు చెప్పాలి??

రోజు రోజుకూ పెరుగుతున్న కరోనా రోగులు
దుస్థితికి లోనైన జనసమూహాలు
భయంతో ఇండ్ల రేకుల పైనుంచి
ఎగిరిపోతున్న దృశ్యం
రెక్కలు టపటపలాడిస్తూ ఎగిరిపోతున్న పక్షిలాగా ఉంది.

**డా. సిహెచ్. ఆంజనేయులు**
ఖమ్మం, ఫోన్ : 770 253 7453

# పద్యమనోహరం - 20

గన్నమరాజు గిరిజామనోహర్ బాబు,
వరంగల్, ఫోన్ : 994 901 3448

**"ఆతురుడై ప్రయత్నమున నబ్ధి జలంబుల నాను వేళ ఖ
ద్యోత సహాయుడయ్యును పయోదుడు నల్లగనౌను, పిమ్మటన్
ప్రీతిగ వర్షమున్ గురియు వేళల తెల్లగనౌ, గ్రహీతకున్
దాతకు నంతరం బిదియె తాదృశముల్ సుగుణాఢ్య సంపదల్"**

విస్తృతమైన లోక పరిశీలన, లోతైన తాత్త్విక చింతన, అనుభవ పూర్వకమైన ఆత్మపరిశీలనల భూమికపై ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు రచించిన "సుగుణాఢ్య శతకము" లోనిదైన ఈ పద్యం మానవుల గుణాల పట్ల ఉండే అంతరాలను గొప్ప పోలికతో చెప్పిన తీరు హృదయావర్జకమైనది.

సాధారణంగా వేసవికాలంలో సూర్యుని వేడి కారణంగా సముద్రాలలోని నీరు మేఘాలై నిలుస్తాయి. దాన్ని ఇక్కడ కవి తమ గొప్ప భావనా బలాన్ని జోడించి మిక్కిలి ఆతురతతో తీసుకొని నల్లగా మారిపోతాడు. అదే మేఘుడు వర్షాకాలం రాగానే తనలో ఉన్న నీటినంతా వర్షం రూపంలో కురిసి తెల్లగా మారిపోతాడు. దీన్ని కవి గ్రహీత, దాతల మధ్యతద అంతతరంగా భావించి ఉన్నతీకరించాడు.

ప్రకృతి ధర్మంలో ఇదొక భాగం. వేసవికాలంలో సూర్య తాపం కారణంగా సముద్రజలాలన్నీ ఆవిరై మేఘాలుగా రూపాంతరం చెందడం, తిరిగి అవే మేఘాలు వర్షాకాలంలో కురియడం ఒక సహజ ప్రక్రియ. నీళ్లు పూర్తిగా కలిగి ఉన్న దట్టమైన మేఘాలు నల్ల మబ్బులై ఆకాశాన్ని చీకటి రాజ్యం చేస్తాయి. వానాకాలం రాగానే ఆ నల్లని మేఘాలు ధారాపాతంగా వర్షం కురిపించి తెల్లమబ్బులవుతాయి. అత్యంత సహజమైన రీతిలో జరిగే ఈ సృష్టి ధర్మాన్ని ఈ పద్యం రెండు లక్షణాల మధ్య తారతమ్యాన్ని తెలుపుతున్నట్లుగా కవి చేసిన వర్ణన కవిలోని ఊహ వైభవాన్ని స్పష్టపరుస్తున్నవి.

వేసవికాలపు మేఘుడు గ్రహీత, వర్షాకాలపు మేఘుడు దాత. గ్రహీత దాతల మధ్య అంతరం ఎంతగా ఉంటుందో ఈ వర్ణన మనకు చెబుతున్నది. తీసుకోవడమనేది ఒకవిధంగా న్యూనతా భావమే. అందుకే అది నల్లబడిన భావంగా కవి భావించి మేఘం నల్లమబ్బు కావడాన్ని గ్రహీత లక్షణమని చెప్పాడు. దాతలు ఎప్పుడైనా స్వచ్ఛమనస్కులై ఉంటారు. ఆ మానసిక స్వచ్ఛత లేనప్పుడు దాతృత్వం రాదు. దాన్ని కురిసిన మేఘపు స్వచ్ఛతతో పోల్చి మేఘం తెల్లబడడం దాతగా వర్ణించడం ఈ పద్యానికి గొప్ప శోభనిచ్చింది. ఎప్పుడైన గ్రహీత కన్నా దాతయే గొప్పవాడన్న భావనను బలంగా చెప్పిన ఈ పద్యం ఈ సుగుణాఢ్య శతకంలోని ఆణిముత్యాలలో ఒకటి.

"తాదృశముల్ సుగుణాఢ్యవర్తనల్" అనే మకుటంతో ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ గారు రచించిన 'సుగుణాఢ్య శతకం' సామాజిక జీవితంలో తమ సుగుణాఢ్యతతో ప్రభావితం చేసే మానవుల దృక్పథాలను సోదాహరణంగా చెప్పిన చక్కని చిక్కని రచన.

వృత్తిరీత్యా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తలైన ఆచార్య సత్యనారాయణ గారు ప్రవృత్తి రీత్యా అక్షరార్చకులు. నిత్యవాగ్దేవీ ఉ పాసకులు. అజోవిభొ కందాళం ఫౌండేషన్ ద్వారా ఎందరో ప్రతిభా మూర్తులను సత్కరిస్తూ, ఎన్నెన్నో విలువైన గ్రంథాలను ప్రచురిస్తూ తమ సాహిత్య సేవ నిరంతరంగా సరస్వతీ సమారాధన చేసే ఆచార్యుల వారు స్వయంగా కవి గనుక దివాకరవృత్త తారావళి వంటి పలు పద్యరచనలను తెలుగువారికి అందించిన సత్యసాహితీ వ్రతులు. వారి ప్రౌఢ కవిత్వ శక్తి వారి రచనలను శిఖరాయమానంగా నిలిపింది. సదా సారస్వత సేవా ధౌరంధర్యము వారి నైజమున్న దానికి వారి రచనలే ప్రమాణాలు.

# మే డే - కార్మిక దినోత్సవం

చేత గంపబట్టి చీర చెంగును చెక్కి
బంతి సిగను ముడిచి భర్తవెంట
పాత షర్టు వేసి పార పలుగు తోను
కూలి పనికి వెళ్ళె కొత్త జంట

ఇసుక కుప్పవోసె ఏకమై యా జంట
ఇటుకలన్ని పేర్చె ఇష్టముగను
కలిసి మెలిసి చేసె కష్టమన్నది మర్చె
కనుల నిండ వెలుగు కలలు కంటు

పెరుగు, పచ్చడేసి ప్రియమార తినిపించ
ఇంటి భోజనమ్ము ఇంపుగాను
కూర, అన్నమంటు కూర్మి భుజించిరి
అలుపు సొలుపు మరిచి ఆలుమగలు

కూలినాలి చేసి కూడబెట్టిరి సొమ్ము
నేర్పు తోడ నడిపె నింటినెంతొ
తోటివార్కి వారు తోడునీడగ నిల్చి
కూలి పనికి తెచ్చె కోటి విలువ

ఆత్మగౌరవమ్మె అత్యంత ధనమగు
వృత్తి యేది యైన వృద్ధినిచ్చు
కష్టమెప్పుడైన కలిమినే కలిగించు
ఉన్నతింప నీవు ఉద్యమించు

వివిధ సాధనముల విజ్ఞానమును పెంచి
వివిధ వృత్తులలోన విరివిగాను
విశ్వకర్మలౌచు విశ్వ కార్మికులెల్ల
విశ్వమంత నడిపె వృద్ధి నొంద

(సమాజంలో అంతర్భాగమై సమాజాభివృద్ధికి అహర్నిశలు శ్రమించే మా కార్మిక లోకానికి కార్మిక దినోత్సవ శుభాకాంక్షలతో...)

డా. బి. నీలిమా కృష్ణమూర్తి
ఫోన్ : 97000 80030

నివాళి

# అక్షరాయుధాన్ని సంధించే కవి... సిహెచ్. మధు

**పద్మారాణి,** తెలుగు అధ్యాపకులు, ఫోన్ : 990 801 7743

**"రోడ్డు మీద ఏడుస్తూనే వుంది సృష్టి**
**మంచిగా చూడు!**
**శ్రమ కళ్ళద్దాలు పెట్టుకొని**
**వెన్నెల్లో కన్నీళ్ళు**
**వెలుగులో కసినీళ్ళ"** అంటూ శ్రమజీవనాన్ని సమాజాన్ని, కర్షకుల ఆర్తనాదాలను, కార్మికుల అంతర్గతాలను గురించి ప్రశ్నించే అక్షర శ్రామికుడు. అరుణవర్ణ సిరాతో అక్షరాయుధాల్ని సంధించే నిస్వార్థ కవి సిహెచ్. మధు.

నిజామాబాదు జిల్లాలో నిరుపేద పద్మశాలి కుటుంబంలో జన్మించిన సాహితి మేరుపర్వతం మధుగారు. ఆయన ధనంలో పేదవాడు కాని ఆలోచనలో, ఆచరణలో, అభ్యుదయ భావాలలో అత్యంత ధనవంతుడు. సమాజ శ్రేయస్సు కొరకు నిరంతరం కలంతో యుద్ధం చేసే కవి. నిగర్వి, నిస్వార్థానికి నిలువెత్తు నిదర్శనం.

కవిగా, రచయితగా, పాత్రికేయుడుగా సామాజిక కార్యకర్తగా, సమకాలీన వ్యాసకర్తగా ఇలా ఎన్నో కోణాలలో మధుగారిని చూడవచ్చు. చిన్నతనంలో కడు పేదరికాన్ని అనుభవిస్తూ, సమాజంలోని అంతరాల అంతంకొరకు ఆలోచనలు చేసేవాడు. నిజాన్ని నిగ్గుతేల్చి చెప్పి ప్రజలకు కనువిప్పు కలిగించడానికి తన కలాన్ని వాడేవాడు. అందుకే ప్రజాపక్షాన్ని నమ్మిన ప్రజాకవి మధు.

చిన్న ప్రింటింగ్ ప్రెస్ యాజమానిగా ఉంటూ, బట్టలషాపులో పనిచేసేవాడు. ఒకటి తన ఆలోచనలను అక్షరాయుధాలుగా మలచడానికి. రెండోది కుటుంబ ఆకలిని తీర్చడానికి. నిరంతరం సమాజంకోసం పరితపించే వ్యక్తి. వీరు 'జలపాలం' అనే పత్రికను దాదాపు 15 సం॥ పాటు నడిపారు. ఇందులో సామాజిక, రాజకీయ, ఉద్యమ వార్తలకు ప్రాధాన్యం ఇస్తూ సాగించారు. అనుబంధంగా సాహిత్య సంచికలు కూడా ప్రచురించారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆగకుండా వెలువడింది.

మధుగారు గొప్ప కథకుడు. 1969లో 'హెరిటెజ్ ఆఫ్‌కారో' అనే కథతో ప్రారంభించి వందల కథలు సమాజానికి అందించారు. తదితర పత్రికల్లో మధుగారు రాసిన కథలు ధారావాహికంగా ప్రచురితమైనాయి. ఆంధ్రజ్యోతిలో రాసిన కథలకు బహుమతులు కూడా పొందారు. రైతుల జీవితాలను గురించి ఐదు కథలు అద్భుతంగా రాశారు. వాటిల్లో కర్షకుల కష్టానికి తగిన ఫలితం లేకపోగా వారికి రాబందుల దోపిడితనం, దౌర్జన్యం ఎక్కువైన తీరును చిత్రించారు. వారి జీవితాల్లోని నిరాశ, నిస్పృహ, వెట్టిచాకిరి, బానిసత్వం గురించి కళ్ళకు కట్టినట్లు చూపించారు. మిగతా కథల్లో



కూడా ప్రజల కన్నీళ్ళు తనకు కథ వస్తువులైనాయి. స్వయంగా తాను అనుభవిస్తున్న కటికపేదరికాన్ని కూడా వస్తువుగా తీసుకొని కథలు రాయడంతో పాటు బీడి కార్మికుల జీవితాలను కూడా కథలుగా రాశారు.

నిత్యం తాను చుట్టు చూస్తున్న జనం బాధలను చూసి చలించిపోయే వారు. అందుకే ఆయనకు శ్రీశ్రీ రచనలన్నా, ఆయన ఆచరించిన కథనమన్న మక్కువ ఎక్కువ. **"ప్రజలు ప్రశ్నించడం మానేస్తే ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకోవడం మానేస్తాయి"** అని మధుగారు పదేపదే తన రచనలలో సమాజాన్ని ప్రశ్నిస్తాడు. శ్రీశ్రీ విప్లవ భావజాలానికి ప్రేరేపితుడై తనుకూడా విప్లవ రచయితల సంఘంలో సభ్యుడైనాడు. 1970లో శ్రీశ్రీ అధ్యక్షుడిగా ఏర్పడ్డ 'విరసం' రాష్ట్ర శాఖకు అనుబంధంగా నిజామాబాదు జిల్లా కమిటీ ఏర్పడింది. అది మధుగారి ఆలోచనలకు ఆవేదనకు, ఆశయాలకు, వేదికగా మారింది. విరసం జిల్లా కమిటి పక్షాన ఎక్కడ సాహిత్య ప్రసంగం జరిగిన మధుగారు తనలోని భావావేశాన్ని, అక్షరాస్త్రాలను ఘాటుగా సంధించేవాడు. ఉద్యమ కార్యక్రమాలు జరిగితే అందులో చురుకుగా పాల్గొనేవారు. అయితే ఆరోజుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం అంటే కత్తిమీదసాము లాంటిది. ఆనాటి ప్రభుత్వ ప్రభావంతో విరసం వారు బయటికిరావడానికి భయపడిన రోజుల్లో తన గళాన్ని వినిపించాడు. దీనితో అరెస్ట్ అయి తన దగ్గరున్న విప్లవ సాహిత్యాన్ని పోగొట్టుకున్నాడు. అయిన్నప్పటికి తను నమ్మిన సిద్ధాంతాలను ఏనాడు విడవలేదు. ప్రజా సమస్య ఉన్నచోట్లలో

మధుగారి కలం, గళం వినిపించేవి. మధుగారి రచనల్లో సమాజ శ్రేయస్సు, నిరాశ, నిస్పృహ, నిర్వేదం కన్పిస్తుంటాయి. కాని వాటిలో అంతరార్థాన్ని గమనిస్తే వీటన్నింటిని ఆయుధంగా మలచుకున్న ప్రశ్నావేత్తగా కనిపిస్తాడు, విప్లవ శంఖంగా వినిపిస్తాడు.

మధుగారి కలంనుండి వేలాది కవితలు, వందలాది కథలు మూడు నవలలు, వందకుపైగా రాజకీయ వ్యాసాలు వెలువడ్డాయి. కాని ఎక్కడ తన రచనలను చూపించుకునే, ప్రచారం చేసుకునే పనిచేయలేరు. వీరి రచనలన్నీ పుస్తకరూపంలో రావాలని మధుగారి మిత్రులందరు కోరుకున్నప్పటికీ తను ఒక పుస్తకం కూడా ప్రచురించుకోలేక పోయారు. కొందరు మిత్రులు ఆయనను ఒప్పించి 'రంగవల్లి మెమోరియల్ ట్రస్ట్' తరుపున వారు రాసిన వాటిలో వంద కవితలను ఎంపిక చేసి **'జ్వలిత గీతాసంచలనం'** పేరుతో కవితా సంకలంగా అచ్చువేసారు. వాటిలోనుండి కొన్ని కవితా పాదాలు.

**"నిరంతర సంఘర్షణ జీవితం**
**ఓడిపోతున్న మాట ఎంత నిజమో**
**రేపు గెల్చేది అంతే నిజం**
**ఉదయం ఆగుతుందా..."** అంటూ ఒక ఆశావాద దృక్పథాన్ని వ్యక్తం చేస్తారు. మరో కవితలో

**"పాపం లేదు పుణ్యం లేదు**
**నీకాళ్ళ కింద సంపద వుందా చెప్పు**
**అన్నీ మాఫీ**
**కేసు మాఫీ శిక్ష మాఫీ**
**నేరగ్రస్త పేరు మాఫీ..."** అని ఈరోజుల్లో కనిపిస్తు సమాజ పోకడలను తెలియ పరుస్తాడు.

**"నిన్నటిదాకా జిందాబాద్ అన్న గొంతులు**
**నేడెందుకు నిరసన గళాలు వినిపిస్తున్నాయి**
**నిన్నటిదాకా జైజై తెలంగాణ అన్న పాటలో**
**నేడెందుకు అక్షరాలు వణుకుతున్నాయి...."**
అంటూ సూటిగా ప్రశ్నిస్తాడు.

ఈయనను అయినంపూడి శ్రీలక్ష్మి మాటల్లో చూద్దాం **"అదే జుబ్బా, అదే లాల్చి, అదే పక్కకి వంగిన నడక, నోరు తెరిస్తే ప్రపంచ పీడిత చరిత్రను తిరిగి రాయాలన్న కసితో కూడిన ప్రసంగం. రాతల్లో సూటితనం, నిక్కచ్చిగుణం ఇవే మధుగారు సాధించుకున్న ఆస్తులు..."** అనడంలో మనం మధుగారి అంచన వేయవచ్చు.

## సాధన పంచకమ్

**వేదో నిత్య మధీయతాం తదుదితం కర్మ స్వనుష్ఠీయతాం**
**తేనే శస్య విధీయతా మపచితిః కామ్యే మతిస్త్యజ్యతామ్**
**పాపౌఘః పరిధూయతాం భవసుఖే దోషోఽను సంధీయతాం**
**ఆత్మేచ్ఛా వ్యవసీయతాం నిజగృహాత్తూర్ణం వినిర్గమ్యతామ్**

**6. భవసుఖే దోషోఽను సంధీయతామ్ –**

సంసార సుఖములలో ఉండెడు దోషాలను మరల మరల విచారింపవలెను. దోషాలను గురించి ఎందుకు ఆలోచించాలి? అంటే సంసారంలో సుఖం లేదని కాదు. సుఖము ఉంది. కాని, అది స్వల్పమైనది. అల్పమైనది. దాని వెనకాల దుఃఖం కూడా ఉంది అని తెలుసుకోవాలి. ఏదో ఒక కారణంగా సంసారంలో గల సుఖాలన్నీ దుఃఖమిశ్రితాలే అని అనుభవం నేర్పుతున్న పాఠాలు చాలా ఉన్నాయి. ఐనప్పటికినీ ఎండమావులను చూసి పరువెత్తినట్లుగా మానవుడు సంసారంలో గల సుఖసౌఖ్యాల వెంట పడుతున్నాడు. వాస్తవం ఏమిటో అనుభవం ద్వారా తెలిసేవరకు ఉన్నకాలం కాస్త చెల్లిపోతుంది. అప్పుడు ఎంత ఏడ్చినా ఏమిటి ప్రయోజనం? కావున నాయనా! సంసారంలో నీవు ఉండవచ్చును కాని, నీలో సంసారం ఉండరాదు సుమా! అంటూ ఎప్పటికప్పుడు సంసార సుఖాలలోని దోషాలను స్పష్టంగా దర్శించు. వ్యామోహానికి గురి కాకుండా నిన్ను నీవు కాపాడుకుంటూ సత్య సందర్శనం కోసం, ఆత్మజ్ఞానం కోసం సాధనను కొనసాగించాలి అని తప్పటడుగులు వేయకుండా ఉండడానికి హితవు చెప్తుంది సాధన పంచకమ్.

**7. ఆత్మేచ్ఛా వ్యవసీయతామ్ –**

చక్కని శ్రద్ధతో నిశ్చయముగా ఆత్మవిచారణ జరుపబడాలి. ఆత్మ అనంతమైనది. శాశ్వతమైనది. అనంతమైన ఆత్మలోనే మనిషి సుఖపడగలడు. ఈ ఆత్మ ఏ కాలమునందును పుట్టేది కాదు. గిట్టేది కాదు. పుట్టి ఉండినది కాదు. ఎటువంటి భావ వికారములు లేనిది. ఇది ఎవ్వరినీ చంపేది కాదు. ఎవరిచేతనూ చంపబడేది కాదు. ఇది జన్మలేనిది. నిత్యమైనది. శాశ్వతమైనది. పురాతన మైనది. శరీరము చంపబడినను ఆత్మ చావదు. (గీత.2-19-20) ఇటువంటి అనంతమైన ఆత్మను పొందాలనెడు ఇచ్ఛ – కోరిక మనిషికి కలగాలి. దీనినే ఆత్మేచ్ఛ అని శ్రీశంకరులు అంటున్నారు. ఆత్మేచ్ఛ కలిగితే సరిపోదు. ఆత్మకు సంబంధించిన జ్ఞానం కలగాలి. అంటే ఆత్మజ్ఞానేచ్ఛ ముందుగా కలగాలి అని అర్థం. ఆత్మజ్ఞానం కలిగితే అనంతమైన ఆత్మ ఏమిటో తెలుస్తుంది. ఆత్మే నిత్యవస్తువు అని తెలుసుకొన్నప్పుడు అనంతమైన నిత్య సత్య సుఖ ప్రాప్తి లభిస్తుంది కనుక ఆత్మేచ్ఛా వ్యవసీయతామ్ – నిశ్చయమైన ఆత్మేచ్ఛను కలిగియుండి సాధనను కొనసాగించవలెను అని చెప్పబడింది.

నివాళి

# తెలంగాణ మాగాణపు కవిరైతు – తిరునగరి

**శ్రీరామోజు హరగోపాల్**, ఆలేరు. ఫోన్ : 994 949 8698

నాకు ఆప్తగురువు, ఆత్మీయ ఉపాధ్యాయుడు, మార్గదర్శి తిరునగరి సార్. యాభై సంవత్సరాల అనుబంధం. నన్ను వచనాకవితాకవిగా తయారుచేసిన కవి తిరునగరిసార్. అసాధారణ ప్రతిభకలిగి సాధారణంగా జీవించిన వ్యక్తి తాను. బడిలో తెలుగుపాఠాలు చెప్పిన వేళనైనా, బతుకుపాఠాలు చెప్పే గైడ్ గానైనా...ఆత్మీయంగానే వుండేవాడు. కవిగా వందలాది సన్మాన, సత్కారాలు పొందినా, వందకు పైగా పురస్కారాలందుకొన్నా, ఎంత కీర్తి కలిగినా గర్వంతో తొణకని సాదాసీదా కవి మా తిరునగరిసార్. పోయినేడు తన 75 సం.రాల వజ్రోత్సవ వయస్సులో తెలంగాణా రాష్ట్రప్రభుత్వం చేత 'దాశరథి పురస్కారం' అందుకున్నాడు.

తిరునగరిసార్ యాదాద్రి-భువనగిరి జిల్లా రాజపేట మండలంలోని బేగంపేట అనే గ్రామంలో 1945 సెప్టెంబర్ 24న, జానకీ రామక్క, మనోహర్ దంపతులకు కలిగిన పుత్రుడు. తన ఇంటిపేరునే కలంపేరుగా పెట్టుకున్నాడు. తన పూర్తిపేరు తిరునగరి రామానుజయ్య. 36సంవత్సరాలకు పైగా తెలుగుటీచర్ గా, లెక్చరర్ గా ఉద్యోగ జీవితం గడిపిన తిరునగరి సార్ ఆలేరులో ఇల్లు కట్టుకుని స్థిరపడ్డాడు. గత కొంతకాలంగా హైద్రాబాద్ లోని చింతల్ లో వుండేవాడు.

నిత్య కవితకృషీవలుడు. 'కవిత్వం రాయకుండా రోజు గడవదయ్య నాకు' అనేవాడు. నిరంతరం చదవడమో, రాయడమో చేస్తుండేవాడు. వేలాది కవితలు, వందలాది పద్యాలు, వేయికి పైగా సాహిత్యవ్యాసాలు, ఎందరో నాలాంటివారి కవితాసంకలనాలకు ముందుమాటలు, వేయికి మించిన సాహిత్యసభా ప్రసంగాలు...తన సాహిత్యకృషిని గురించి ఎంతచెప్పినా తక్కువే. గొప్పవక్త. సమయానికి తగుమాటలాడి, కాదు తన ప్రసంగంలో వందలాది సాహితీవేత్తల, విమర్శకుల కొటేషన్లను అనర్గళంగా, సందర్భానుసారంగా చెప్తుండేవాడు. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యసిద్ధాంతాలను ఆకళింపు చేసుకున్న అధ్యయనం తనది. కవిత్వమే తనకు పరమావధిగా చేసుకున్నవాడు. తన కవిత్వానికి మనిషిని జెండాగా, మానవత్వాన్ని ఎజెండాగా పెట్టుకున్న కవి తిరునగరిసార్.

1970లో ఆలేరు పాఠశాలకు తెలుగుటీచరుగా వచ్చినపుడు నేనాతని విద్యార్థిని. ఒక్క ఏడాదిలోనే నాతో కవితలు, పద్యాలు రాయించి పత్రికలకు తానే పంపించి, నన్ను పోత్సహించాడు. తన వెంట కవిసమ్మేళనాలకు తీసుకునిపోయేవాడు. ఆ సమయంలోనే మహాకవి దాశరథి, అనిసెట్టి సుబ్బారావులచేత నేను, నా మిత్రులు రాసిన కవితల సంకలనం 'ఉదయ కిరణాలు'ను ఆవిష్కరింపజేసాడు.



ముప్పయికి పైగా కవితాసంకలనాలు, వందలాది సాహిత్యవ్యాసాలు ప్రచురించబడ్డాయి. ఇంకా అచ్చు కావలసిన తన రచనలెన్నో వున్నాయి. కవితలే కాదు వందలాది పాటలు రాసాడు. దేశభక్తిగీతాలు, లలితగేయాలు రచించారు. ఆ పాటలు రేడియో, దూరదర్శినిలలో ప్రసారమైనాయి. పాటల ప్రైవేటు ఆల్బమ్స్ కూడా వచ్చాయి.

బాలవీర (శతకం), శృంగార నాయికలు (ఖండ కావ్యం) తొలిసారిగా అచ్చయిన తిరునగరి సార్ రచనలు. కొవ్వొత్తి, వసంతం కోసం, అక్షరధార, గుండెలోంచి, మా పల్లె, మనిషికోసం, వానా–వాడూ, ఈ భూమి, నీరాజనం, ప్రవాహిని, ఉషోగీత, జీవధార, ఒకింత మానవతకోసం, యాత్ర, కొత్తలోకం వైపు, కిటికీలోంచి, సముద్ర మథనం, జనహిత, చెమట నా కవిత్వం...ఇవి కొన్ని కవితాసంకలనాలు. ముక్తకాలు, తిరునగరీయం పద్యసంకలనాలు తనవి.

తన కవిత్వం సరళం, సుబోధకం, సూటితనంతో వుంటుంది. చెప్పదలచుకున్నది, చేర్చదలచుకున్నవారికి అందేంత సులభంగా రాయడం తన శైలి. కాఠిన్యం కనిపించదు. ఎంత పెద్ద భావాన్నైనా

అలతి పదాలతో రాయడంలో తానే సాటి.

'దేశంలోని గోడల్ని చదివితే

దేశాన్ని చదివినట్టే' నంటాడు తల్లిపేగు(1996) కవితాసంకలనంలోని 'అధ్యయనం' కవితలో... వ్యాఖ్యానం అవసరంలేని కవితావాక్యాలవి. అందులోనే ' మంచినాయకులకు జిందాబాద్ లుంటాయి, ప్రజావంచకులపై గోడలు కళ్ళెర్రజేస్తాయి' అంటాడు సార్.

"నేనేమీ లేనివాణ్ణే కావొచ్చు

హృదయం వున్నవాణ్ణి

హృదయం నా ఆస్తి

హృదయం నా అంతస్తు..." తన గురించి తాను చెప్పుకున్నఈ కవిత తన వ్యక్తిత్వాన్ని చాటిచెప్పుతుంది.

సామ్యవాదం, సమానత్వబోధ తన కవితల్లో అడుగడుగునా వినిపిస్తుంటాయి.

'అన్నంపెట్టినవాడే ఆకలితో చస్తున్నాడు' ఒక సామాజిక కల్లోల సందర్భాన్ని ఒక్క మాటతో చెప్పి హెచ్చరిక చేస్తున్నాడు.

నిస్సందేహంగా రేపటికాలం

ఇక నీది నాది అంటే

శ్రమజీవిది

సామ్యవాదిది(ఆగామి) గుండెలోంచి(2003) కవితాసంకలనం లోని కొన్ని కవితావాక్యాలివి.

ఈ కవితాసంకలనం గురించి జివి సుబ్రహ్మణ్యం 'పై మాటల్లోంచి పలికేది కవిత కాదు. అది పొంగాలి గుండెలోంచి' కవితనే కోట్ చేస్తాడు.

తిరునగరి సార్ పద్యాలను అలవోకగా రాస్తాడు. ఆశువుగా చెప్పిన సందర్భాలు చాలా వున్నాయి. సార్ రాసిన 'తిరునగరీయం' గురించి రాసిన కసిరెడ్డి వెంకటరెడ్డి 'తిరునగరి కవితారూపం ఆటవెలదిలో వుంది. తిరునగరి కవితావస్తువు సమాజం, సమాజహిత చింతనం' అంటాడు.

'ప్రజల బాగుపరచు పార్టీలు లేవురా

పొలము దున్నువాడు పూజ్యుడు జాతికి'(తిరునగరీయం)

ముక్తకాలు కవితాసంకలనంలోని ఈ కవితావాక్యాలు చదవండి.

'ఇది నా కవితాక్షేత్రం

నేను కవిని, కృషీవలుణ్ణి

ఈ పొలాన్నే దున్నుతాను

ఈ పొలాన్నే పండిస్తాను(26వ ముక్తకం)

ప్రజలకు కావాల్సినవి

ప్రచారం కాసెట్లు కాదు

తినడానికింత కూడు

మనడానికింత గూడు(94వ ముక్తకం)

తిరునగరి సార్ కవిత్వం ప్రజాపక్షం వహించిన గొంతుక.

'అన్నము పెట్టువాడ, జనులందరి ఆకలి తీర్చువాడ, నీ

కున్నను లేకపోయినను ఒక్క విధాన చరించువాడ, అ

ధ్వాన్నపు లోకరీతులకు బాధపడే హృదయమ్మువాడ, నీ

కన్నను గొప్పవాని ధర గానము సత్యము ఓ కృషీవలా' (నీరాజనం-2005)

అని రైతు గురించి చెప్పిన ఈ పద్యం బహుధా హృద్యం.

'దేన్నైనా మానవతాకోణం నుంచే చూడాలి' అంటాడు తిరునగరి సార్.

'తట్టమోసే తల్లి కాళ్ళకే , తలవంచి మొక్కుతాను

వరినాట్లేసే వనితకే, ప్రణమిల్లుతాను''చెమటోడ్చేవారే (కిటికీలోంచి-2009) అనే కవితలో...

మనిషి నా పద్యం(2009) కవితాసంకలనంలోని ఒక కవితలో

'చెమట ఓ దేశచరిత్ర

చెమట బ్రతుకు

చెమట మెతుకు

చెమట విప్లవం

చెమటను గౌరవిస్తేనే సుభిక్షం' అని శ్రమజీవుల స్వేదాన్ని కీర్తిస్తాడు.

తిరునగరి సార్ కు కవిత్వమే జీవితం.

'కవిత నా శ్వాసరా

కవిత నా ధ్యాసరా

కవిత బతుకురా

కవిత మెతుకురా' (కొత్తలోకం వైపు-2010)

కవి అంటే తన దృష్టిలో

తిమిరంలో దీపం వెలిగించేవాడు

నైరాశ్యంలో ఆశాగీతం వినిపించేవాడు

సాటిమనిషికి సాయం చేసేవాడు

విశ్వకళ్యాణ పద్యం విరచించేవాడు' అని నిర్వచిస్తాడు.

'ఏనొక మానవుండ చరియింతును సంఘమునందు ఐక్యమై

ఏనొక సోదరుండ భరియింతును తమ్ముల కష్టనష్టముల్

ఏనొక కర్మయోగినయి నిల్తును బాధ్యత నిర్వహింపగన్

ఏనొక భారతీయుడ రచింతును ఉజ్వల భావికావ్యముల్' అంటూ కవితావాగ్దానం చేసాడు తిరునగరిసార్.

నా కవిత్వమా నిను వీడేదెప్పుడు

ఈ ప్రయాణం ఆగిపోయినప్పుడు'... మాట చెల్లించుకొని పోయాడు తిరునగరి సార్.

మూసీ సాహిత్యధార
స్వీయ పరిశోధన

# తెలుగులో దాసరి బాగోతాలు - సమగ్ర అధ్యయనం

**కర్రెపు నర్సింహులు,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
ఫోన్ : 917 781 0557

తెలంగాణలో యక్షగానాన్ని భాగవతం బాగోతం అని కూడా పిలుస్తారు. ఈ బాగాతాన్ని ఆడేవారిని భగవతులు, బాగోతులు అంటారు. దాసరోళ్ళ బాగోతం సంగీత, సాహిత్య, నృత్య అభినయాలతో కూడిన సమాహార కళారూపం, వీధులల్లో బాగోతం ఆడడం వలన వీధి బాగోతం అనే పేరు వచ్చింది. ఆటవిడుపుకి కాలక్షేపానికి ప్రధానమైన మాధ్యమం ఈ కళారూపం. రాత్రిళ్ళు మాత్రమే కళా ప్రదర్శన చేయడం దాసరి బాగోతం యొక్క ప్రత్యేకత. మగవారు మాత్రమే స్త్రీ, పురుష పాత్రలు ధరిస్తారు. దాసరి స్త్రీలు బాగోతం ఆడరు. వారు సవరాలు అల్లుతారు. బొట్టుబిళ్ళలు అమ్ముతారు. యక్షగాన పితామహుడు చెర్విరాల భాగయ్య కవి వ్రాసిన యక్షగానాలను దాసరి కళాకారులు దర్వులను తమకు అనుకూలంగా మార్చుకొని అద్భుతంగా ప్రదర్శిస్తారు. జానపదులు దాసరిబాగోతాన్ని అర్ధ శతాబ్దికాలం (1930-1980) వరకు అన్ని కులాలవారు ఆదరించేవారు. దాసరి బాగోతం ఆడుతున్నారంటే ఆ గ్రామంలోని ప్రజలు ప్రదర్శన తిలకించడానికి ముందుగానే వెళ్ళి అక్కడ స్థలాన్ని ఆపుకునేవారు. దాసరివాళ్ళు ఆడుతున్నారంటే ఆ ఊరిలో అందరికీ ఆనందమేనట. దాసరోళ్ళు ఆడే బాగోతాలు. అల్లీరాణి, హరిచంద్ర, లవకుశ, కీచకవధ, దేవయాని మొ॥ బాగోతాలు రాత్రంతా ప్రజలు కుటుంబ సమేతంగా చూసేవారట. పాత్ర పాటు ప్రజలు లీనమై చూసేవారట. ప్రహ్లాదలో నరసింహస్వామి వేషం రాగానే అందరు కొబ్బరికాయలు కొట్టేవారట కొందరు. కోళ్ళు మేకలు కోసేవారట, నిజంగానే నరసింహస్వామి వచ్చినట్టుగా దాసరివాళ్ళు అభినయించే వారట. ఇప్పుడు టీవీలు, సినిమాలు వాడుకలోకి వచ్చి మా కళకు ఆదరణ తగ్గింది అని వారు వాపోతున్నారు. ఎవరైనా శుభాలకు, అశుభాలకు పిలిస్తే అక్కడక్కడ ఆడుతున్నాం అని దాసరి కళాకారులు చెబుతున్నారు. కనిపించని దాసరి సగముడి కర్ణాటక ప్రాంతం నుండి వచ్చినటువంటి యక్షగానికి తెలంగాణ యక్షగానం కళాకారులకి విడదీయలేని బంధం ఉన్నది. ఇది ప్రజాకళ. ఈ కళ సంగీత, సాహిత్య, నృత్యాల మేళవింపు "కళ అనేది కళ కోసమే కాసుల కోసం కాదు" అనే నానుడితో ముడిపడి ఉన్న కళారూపం దాసరి బాగోతం. యక్షగానం నుండి పుట్టినదే భాగవతం, భాగోతం, వీధి నాటకం. ఈ భాగోతం ఆడే కళాకారులను బాగోతులు, భాగవతులు అంటారు. తెలంగాణ దాసరుల కళాభిరుచికి చక్కని నిదర్శనం దాసరి బాగోత కళారూపం జానపదులు అనగా పల్లె ప్రజలు. పల్లె ప్రజలు మెచ్చిన నచ్చిన గొప్ప కళారూపం ఈ దాసరి బాగవతం, దాసర్లు అంటే ఎవరు? దాసరులు అనగా వైష్ణవ భక్తులు, ఆర్థివాళ్ళు (భిక్షగాళ్ళు) వెనుకబడిన జాతులలో ఒక్కరుగా ఉన్నా ఈ దాసరులు పొట్టకూటి కోసం బాగోతాలను ఆడడం అలవాటు చేసుకున్నారు. కాలక్రమేణ అది వారి వృత్తిగా మారిపోయింది. వీరు ఎక్కువగా మన తెలంగాణ ప్రాంతంలోని మెదక్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ జిల్లాలో ఎక్కువగా కనిపిస్తారు.

సబ్బండ వర్ణాలు మెచ్చిన దాసరోళ్ళ బాగోతం ఊహాశక్తి సామర్థ్యానికి ప్రతీక. ఒక భౌగోళిక ప్రాంతంలో అనేక కళలు ప్రాచుర్యంలో ఉన్నా, ఆ ప్రాంత సంస్కృతిలో జనించి, అక్కడి సాహిత్యంతో జవజీవాలను సంతరించుకుని, వేషభాషలలో ఆ జాతి లక్షణాలను స్ఫురింపజేస్తూ వారి దైనందిన జీవనంలో భాగమై, నైతిక ధార్మిక, అధ్యాత్మిక చింతన పెంపొందించే కళలే ప్రత్యేకంగా నిలుస్తాయి. తెలంగాణకు సంబంధించి అటువంటి అపురూపమైన ప్రదర్శనాకళలో దాసరి బాగోతం ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. అసలు ఎవరీ దాసరోళ్ళు? సమాజమునకు దూరంగా ఉంచబడిన జాతులలో దాసరి ఒకటి. వీరు భిక్షాటన చేయుచు, దాసరులుగా పిలువబడినారు. దాసరి వాడు ఉంటే వైష్ణవ భక్తుడు, మహావిష్ణువును తమగాత్రంతో అను నిత్యం ధ్యానించేవారు. హరినామాలు నుదుటిపై బొట్టుగా పెట్టుకునేవారు. కాలక్రమేణ పొట్టకూటికై కష్టపడితేగాని కడుపునిండని ఈ దాసరి, తమ కళను బాగోతంగా మార్చుకొని తమ సాహిత్య పిపాసని, కళాతృష్ణని, తీర్చుకోవడానికి ఒక కళాబృందంగా ఏర్పడి బాగోతాలను ప్రదర్శించడం అలవాటు చేసుకున్నారు. వృత్తిరీత్యా వివిధ రకాల దాసరి కులములు ఏర్పడినవి: వాటిలో ముఖ్యమైనవి

**బుక్క దాసరి :** బుక్కదాసరి అనగా చిన్న అద్దాలు, గులాలు, కుంకుమ, దశనపొడి (కాల్చిన పొగాకుతో తయారైన పళ్ళపొడి) అమ్మేవారు.

**దండె దాసరి :** మోటలకు తాళ్ళు నేసేవాళ్ళు (పేనేవారు, అల్లేవారు)

**బుట్టదాసరి :** బుట్టదాసరి అనగా ఈతనారతో, ఈత ఆకులతో తాటి కమ్మలతో చాపలు, బుట్టలు అల్లుచు జీవించేవారు.

**గంటె దాసరి :** దీపంలో ఆముదంపోసి వెలిగించి, ఆ వెలుగులో భాగవతాన్ని ప్రదర్శించేవారు. వీరు ఎక్కువగా మెదక్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ జిల్లాల్లో ఉంటారు,

**మాల దాసరి :** మాల కులస్థుల అయ్యవార్లు (పెళ్ళిళ్ళ పంతుళ్ళు), మాలకులంలో వివాహాది శుభకార్యములు నిర్వహించే కుల పెద్దలు వీరినే ఆజాతివారు పురోహితులుగా గౌరవింతురు.

**బోడ దాసరి :** అయ్యరోళ్ళు (హరికథలు) చెప్పేవారు.

**హరిదాసులు :** సంక్రాంతి రోజు భిక్షాటన చేసేవారు, వీరు ఎక్కువగా ఆంధ్రప్రాంతంలో కనబడుదురు.

**హెరీళియ దాసరి :** హెరీళి పట్టి భిక్షాటన చేసేవారిని హెరీళియదాసరులు అంటారు. రాత్రి మొఖాన రంగేస్తే రాజు, తెల్లవారితే ఊరిలో తిరిగే భిక్షగాడు, రాత్రివేషంలో కిరీటాలు, ఆభరణాలు ధరిచినరాజు వేషగాళ్ళు పగలు ఊరిలో భిక్షాటన చేయుచు జీవన గమనం చేయుదురు.

మాల్యం ఈ దాసరులు ప్రతి సంవత్సరం పది కుటంబాలు కలిసి దళంగా (సమూహంగా) ఏర్పడి తెలంగాణలోని ఏదో ఒక జిల్లాలకు వెళ్ళి అక్కడి పల్లెల్లో టిక్కెట్ పెట్టి బాగోతాన్ని ఆడేవారట. అందులో ఒక్కొక్కరికి వారి కష్టానికి ఫలితంగా ఒక విస (పాలు) ఉండేదట. ఒక విస 3 వేల రూపాయలు అనుకుంటే 30 వేల రూపాయలు తీరేవరకు బాగోతాలు ఆడేవారట. అలా అందరిపాలు అయిపోయిన తర్వాత చివరగా తమ ఇష్టదైవాన్ని కొలిచి (బంతి పెట్టి) వారి యొక్క సొంత గ్రామానికి వచ్చేవారట. అప్పటికీ వేసవికాలం అయ్యేదట. ఊరి మీది ఆట దాసరి కళాకారులు వేసవి కాలంలో తమ సొంత గ్రామాలకు చుట్టు ప్రక్కల ఉన్న గ్రామాలను వంతులుగా చేసుకొని ఆ వేసవి కాలంలో గ్రామాలకు వెళ్ళి బాగోతం ఆడేవారట . దీనినే ఊరి మీది ఆట అంటారు. ఫలితంగా ఆ గ్రామ ప్రజల దగ్గర ధాన్యాన్ని వసూలు చేసుకునేవారట. ఆ ధాన్యం వారి ఒక కుటుంబానికి సంవత్సరం పాటు వచ్చేదట. వీరు ప్రతి సంవత్సరం ఈ విధానాన్ని అనుసరిస్తూ ఉండేవారట. ఈ దాసరి కళాకారులు ఒకరి వంతుకు వచ్చిన ఊరిలో ఇంకొకరు బాగాతాన్ని ఆడేవారు కాదట. అంటే ఒక ఊరు ఒక్క కళాకారునికి మాత్రమే సొంతమన్న మాట. ఊరిమీది ఆట అంటే అందరు కుటుంబ సమేతంగా (ఉచితంగా) తిలకించేది అనివారు చెపుతున్నారు. వీరు ఆడే బాగోతాలు అల్లీరాణి, ప్రహ్లాద, దేవయాన, పుండరీక మొదలగునవి. దాసరి బాగోతం ఈ దాసరి కళాకారులు ఎక్కువగా నిరక్షరాస్యులు, కాని జ్ఞాపకశక్తి మాత్రం ఎక్కువగా ఉంటుంది. వీరి బాగోతం మొదట అంబ కీర్తనతో ప్రారంభం అవుతుంది. **"అంది బ్రోవుమా, జగదాంబ గావుమా"** అనే అంబ కీర్తనతో బాగోతం మొదలవుతుంది. బుడ్డఖాన్ వేషంతో బాగోతం మొదలైన తరువాత రాజు, రాణి అనేక పాత్రలతో బాగోతం రక్తి కట్టిస్తూ మంగళ హారతితో ముగిస్తారు.

**వాద్యాలు :** దాసరి కళాకారులు ఉపయోగించే వాయిద్యాలు తబల, హార్మోనియం, గజ్జెలు, తాళం మొదలగునవి.

**దాసరుల నేటి జీవితం :** గొప్ప కళారూపాలను ప్రదర్శించే ఈ దాసరి కళాకారులు ఆనాడు తమ కళకోసం మగవారు సిగలను పెంచుకునేవారు ఎందుకంటే బాగోతంలోని స్త్రీ, పురుష పాత్రల కోసం మగవారు సిగలను పెంచుకునేవారు. అయితే నేడు ఈ కళారూపానికి ఆదరణ కరువై వారు తమ సిగలను పెంచడం లేదు. ఈ సిగలు వారి కళారూపానికి గొప్ప ఆధారాలు అంటున్నారు. టి.వి., సినిమాలు రావడం వలన మా కళకు ఆదరణ లేకుండా పోయింది అని ఈ దాసరి కళాకారులు వాపోతున్నారు . ప్రస్తుతం ఈ కళాకారులు పాత సమాన్లు అమ్ముతూ జీవనం కొనసాగిస్తున్నారు.

నేను నా పరిశోధనా సౌలభ్యం కొరకు నా పరిశోధనా అంశాన్ని ఎనిమిది అధ్యాయాలుగా విభజించుకున్నాను.

మొదటి అధ్యాయం "భాగవతం– రూపకము" లో యక్షగానం మరియు భాగవతం ఎలా ఉద్భవించాయి ఏ విధంగా రూపాంతరం చెందాయి అనే విషయాలన్నీ అనుశీలన చేశాను. రెండవ అధ్యాయం "జానపద కళారూపంలో– దాసరి కళాకారులు" అనే అంశాన్ని తీసుకుని వారి యొక్క చారిత్రక నేపథ్యం, వృతి వివరాలు,మరియు దాసరుల రకాలు మొదలగు అంశాలను విశ్లేషించాను.

మూడవ అధ్యాయం "దాసరుల సంస్కృతి పరిచయం"ను తీసుకుని దాసరుల యొక్క ఆచారాలు, సంప్రదాయాలతో పాటు వారి యొక్క జీవనరీతులను పరిశోధించాను. నాలుగవ అధ్యాయం "దాసరి భాగవతం – ప్రదర్శన విధానం"లో దాసరి కళాకారుల భాగోత ప్రదర్శన విధానంను, బాగోతాన్ని వారు ప్రదర్శించే తీరును మరియు వారు ఉపయోగించే వాద్యాలను గురించి పరిశీలించాను.

అధ్యాయం అధ్యాయం "భాగవత సంబంధ భాగవతాల"ను తీసుకొని భాగవత కథల ఇతివృత్తంతో వెలువడిన భాగవతాలను గురించి పరిశోధించాను.శ్రీకృష్ణుడు,అర్జునుడికి సంబంధించిన కథను ఆధారంగా చేసుకుని వచ్చిన భాగవతాలను గురించి విశ్లేషించాను.

ఆరవ అధ్యాయం "మహాభారత సంబంధమైన భాగవతాలు"ను తీసుకొని మహాభారతానికి సంబంధించిన ఆయా కాలాలకు చెందిన ఇతివృత్తంతో వచ్చిన భాగవతాలను పరిశీలించాను.

ఏడవ అధ్యాయంలో "పౌరాణిక సంబంధ భాగవతాల"ను పౌరాణిక నేపథ్యంగా ఏర్పడిన భాగవతాలను గురించి పరిశీలించాను.

ఎనిమిదవ అధ్యాయంలో "కల్పిత సంబంధ భాగవతాలు"ను తీసుకొని కల్పిత కథల నేపథ్యంగా ఏర్పడి భాగవతాలను గురించి పరిశీలించాను. "తెలుగులో దాసరి భాగవతాలు – సమగ్ర అధ్యయనం" పై నేను చేసిన ఈ పరిశోధన దాసరి భాగవతాలపై ముందు ముందు పరిశోధించే పరిశోధకులకు కొంతవరకు ఉపయోగ పడుతుందని నేను భావిస్తున్నాను.

# నల్లగొండ జిల్లా - నవలా సాహిత్యం

**ఐ. చిదానందం,** తెలుగు భాషోపాధ్యాయులు, ఫోన్ : 8801 444 335

**పరిచయం**

తెలుగు సాహిత్యంలో "నవల" ప్రక్రియను నిశితంగా పరిశీలించినచో తెలుగులో ఆంధ్ర ప్రాంతం వారు రాసిన నవలలకే ఎక్కువ ప్రచారం జరిగింది. తెలంగాణ నవలాకారులకు తగిన గుర్తింపు లేక మరుగున పడిపోయారు. ఉదాహరణకు.. తెలుగులో తొలి నవలాకారుని విషయంలో విమర్శకులు, పరిశోధకులు తెలంగాణ అవతరణ జరిగేంతవరకు కూడా తడకమళ్ళ వెంకట కృష్ణారావు గారిని కనీసం పరిగణనలోకి తీసుకోక పోవడం శోచనీయం.

సామాన్యుల నుంచి అసామాన్యుల వరకు అందరినీ ఆకర్షించిన ప్రక్రియ నవల. నల్లగొండలో చిన్న కథల నుండీ పెద్ద కథలు (నవలిక) దాకా అక్కడ నుండి బృహత్ నవలల వరకు రాసిన రచయితలు కలరు. తెలుగులో నవలా ప్రక్రియకు బీజం పడింది ఈ నల్లగొండ జిల్లా నేల లోనే. ఈ జిల్లా నవలాకారులను పరిచయం చేయడం.ఈ వ్యాసం ఉద్దేశ్యం.

**నల్లగొండ జిల్లా నవలా రచయితలు**

నల్లగొండ జిల్లా మామిళ్ళగూడెంలో జన్మించి తెలంగాణలో సాహిత్యం కై కృషి చేసిన వారు షబ్నవీసు వెంకట రామనరసింహం (1896–1929). వీరి తల్లిదండ్రులు లక్ష్మీ నారాయణ రావు, రంగనాయకమ్మలు. షబ్నవీసు గారు గ్రంథాలయ స్థాపనలో ఎంతో కృషి చేశారు. వీరు 1917లో ఆంధ్ర సారస్వత నిలయం, 1924 సంస్కారిణి అనే గ్రంథమాలను స్థాపించారు. అంతేకాకుండా తెలంగాణలో పత్రికలు లేని కాలంలో, పత్రికలకు ఆంక్షలు వున్న కాలంలో ఎంతో ధైర్యం చేసి నీలగిరి పత్రికను స్థాపించి దానిని 1925 వరకు నడిపారు. ఈ పత్రిక తర్వాతే ఒద్దిరాజు సోదరులు తెనుగుపత్రికను (1921) ప్రారంభించారు.

షబ్నవీసు గారు సుప్రసిద్ధులైన పులిజాల రంగారావు గారి సహుదరి జానకీబాయిని వివాహం చేసుకున్నారు. కానీ చిన్న వయసులోనే ఆమె మరణించింది. ఆ తర్వాత లక్ష్మీబాయిని పరిణయమాడారు. సంతానం లేనందున రంగారావు గారి కుమారుని దత్తత తీసుకున్నారు. విధి కఠినమైనది, క్రూరమైనది. షబ్నవీసు గారి ద్వితీయ అర్ధాంగి కూడా మరణించి దూరమైంది, అలాగే కుమారుడు కూడా అస్తమించాడు. షబ్నవీసు తన ప్రెస్ ద్వారా 1921లో 'బాలికా విలాపం' అనే రచన వెలువరించారు. (నవలిక అనగా పెద్ద కథ ) అలాగే గతించిన తన అర్ధాంగిని గురించి రాజ్యలక్ష్మి పేరిట ఒక రచనను ప్రారంభించాడు కానీ అది పూర్తి కాక ముందే షబ్నవీసు స్వర్గస్థులైనారు. అనంతరం శేషాద్రి శేషాద్రి రమణ కవులు ఈ రచనను ఉదయలక్ష్మి పేరిట పూర్తిచేసి పునర్ముద్రించారు. వీరిపై షబ్నవీసు జీవితం – సాహిత్యం పేరిట షబ్నవీసు ఇందిరా రావు గారు పుస్తకం వెలువరించారు.

బాల్యంలోనే తల్లిదండ్రులతో పాటు పల్నాడు (మాచర్ల) నుంచి దేవరకొండలో స్థిరపడినవారు అజ్మతుల్లా సయ్యద్ (1902–70). వీరు తన సోదరులు సయ్యద్ అలీతో కలిసి జంటగా తెలుగు సాహిత్య వ్యాసంగాన్ని కొనసాగించారు. వీరే స్వయంగా ప్రమీలా పరిణయం, మార్కండేయ జననం, పిచ్చిలింగ శతకం, సత్యసింధు చరిత్ర వంటి రచనలతో పాటుగా జాహ్నవి, సుశీల, సుజాత, అంప రాకాసి, మణి అనే నవలలు కూడా రాశారు. ఈ నవలన్నీ స్త్రీ చైతన్య ప్రబోధకాలుగా కలవు. చిన్నతనంలోనే కృష్ణా జిల్లా నుంచి మిర్యాలగూడకు వచ్చి వైద్య వృత్తిలో స్థిరపడిన వారు కోలాహలం లక్ష్మణ రావు (1914). వీరు దాదాపుగా ఇరవై ఐదు నవలలు రాశారు. అవి మధురానుబంధం, కన్నీళ్ళలో పన్నీటిజల్లు, పరిష్కారం, ఆదర్శ



సేవకులు, తులసి, పసివాళ్ల ప్రేమాయణం, పసిపాపలు, పెంచిన ప్రేమ, ప్రతీకారం, మళ్లీ పెళ్లిలో మాధుర్యం, బతుకు పండింది, వీరనారి మల్లి , తల్లీ కట్టిన తాళి బొట్టు, పవిత్ర బాంధవ్యం, బతుకు విలువలు, ప్రేమభిక్ష, హెచ్చుతగ్గులు, ప్రేమ లేని పెళ్లి, జీవిత పరిచయం, పసి పాప బలి వంటి నవలలు రాసారు. వీరి రచనలపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పగిడోజు ఏకానందా చారి సమగ్ర పరిశోధన చేస్తున్నారు.

నకరికల్లు మండలం మాధవరం లో జన్మించిన వారు వట్టికోట ఆళ్వారు స్వామి (1915). వీరు దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించి స్వయంగా ఎన్నో పుస్తకాలను ప్రచురించారు. వీరు తెలుగులో తొలి రాజకీయ నవల ప్రజల మనిషి ని రాసారు. ఇదీ 1955 లో గ్రంథ మాల ద్వారా ప్రచురితమయింది. ప్రజలమనిషి నవలలో ఒక విధంగా వీరి స్వీయ అనుభవంతో రాసినది అనీ చెప్పుకోవచ్చు. దీనిలో కంఠీరవం ప్రధాన పాత్ర. ఈ నవల 1938 పూర్వపు




తెలంగాణ పరిస్థితులు కలవు. హైదరాబాదులో కాంగ్రెస్ పుట్టుక, నేపథ్యం కలదు. వట్టికోట జైల్లో ఉన్నప్పుడు ఈ నవల ఆరంభించాడు. నవలలో పాత్రలు గ్రామదోర రామగోపాల్ రావు, హైదర్ ఆలీ, వెంకట్రావు, కొమురయ్య, కోటయ్యలు. ఈ నవలలో అంజుమన్ ఉద్యమంలో భాగంగా హరిజనులను తురక మతంలో చేర్చుకోవడంతో నవల ఆరంభమవుతుంది. దీనికి సూత్రధారి అయిన హైదర్ ఆలీ నాయకులను దివ్మే గూడెంలోకి రహస్యంగా రప్పించి ప్రలోభాలతో మతమార్పిడి చెప్పిస్తాడు. ఊళ్ళో అన్యాయాలు విని కంఠీరవం అక్కడికి వచ్చి ఆ తంతును ఆపి వేయిస్తాడు. దీంతో రాజ్య ద్రోహం కింద కంఠీరవం జైలుపాలు అవుతాడు. నవల చివర్లో రామభూపాల రావు శుద్ధి కార్యక్రమంలో భాగంగా పంచములను తిరిగి హిందువులుగా మార్చడం కథ. వట్టికోట మరో నవల గంగు. ఇదీ అసంపూర్ణ నవల. ఇందులో కమ్యూనిస్టు వ్యక్తి నవనీతం కథానాయకుడు. లంబాడి వ్యతిరేక పోరాటాలు, భూ పోరాటాలు కలవు. దీనిలో కంసాలి పాత్రపేరు నాగభూషణం. ఇతడు దొర కు విధేయుడు. దొర కన్ను నాగభూషణం భార్య అంతమ్మ పై పడింది. విషయం తెలిసిన నాగభూషణం తన భార్య, కూతురులతో పట్టణం చేరుతాడు. అక్కడ కమ్యూనిస్టు పోరాటాలతో చైతన్యం కావడం కథ. దీనిలో 1940-45 తెలంగాణ పోరాట ఉద్యమ చరిత్ర కలదు. వట్టికోట మరో రచన గిర్దావరు. ఇది పెద్ద కథ (నవలిక), తెలంగాణ సాయుధ పోరాటం అనంతరం దొరలు ఎలా మళ్ళీ భూమిని దక్కించుకున్నారో ఈ రచనలో కలదు. వట్టికోట ఆళ్వారు స్వామి రచనలపై ఉస్మానియా యూనివర్సిటీలో కె.వి.ఎస్.సూర్య నారాయణ రాజు 1982లో పరిశోధన చేసారు. అలాగే ఇదే యూనివర్సిటీలో ప్రస్తుతం గాదె చంద్రశేఖర్ సమగ్ర పరిశోధన చేస్తున్నారు.

సంస్కృత, ఆంధ్ర భాషాలతో పాటుగా ఉర్దూ, ఆంగ్లం భాషలో ప్రావీణ్యం గల వ్యక్తి పైడిమర్రి వెంకట సుబ్బారావు, (1916). భారతదేశ ప్రతిజ్ఞ గేయంను రాసిన వీరు నల్గొండ జిల్లా అనపర్తి గ్రామంకు చెందినవారు. వీరు కాలభైరవుడు అనే నవలను రాశారు. రచయితగా, విమర్శకుడిగా పేరుపొందిన వారు పుల్లాభట్ల వెంకటేశ్వర్లు (1924). వీరు నల్లగొండ జిల్లా మెళ్ళచెరువులో జన్మించారు. ఆ తర్వాత వృత్తిరీత్యా ఖమ్మంలో స్థిరపడ్డారు. వీరు తెలుగు నవలా సాహిత్య వికాసం అనే రాశారు ఇది ఇప్పటి కీ పరిశోధకులకు ఉపయుక్త గ్రంథమే. వీరు సముద్ర ఘోషలు, రాధ, మాఘంటం అనే నవలలు రాశారు. 1951లో వీరు రాసిన మా ఘంటం నవల ఇప్పటివరకు 6-సార్లు పునర్ముద్రణ చేయబడింది. ఈ నవలలో నిజాం రాష్ట్ర విమోచన ఉద్యమం గురించి కలదు. అలాగే మూఢనమ్మకాల ఖండన, పరోపకార గుణం గురించి కూడా కలదు. బైస్త కులం కు చెందిన మాఘంటం కు , నీలకంఠ అనే బ్రాహ్మణుడికి గల స్నేహం ఇందులో చిత్రీకరించబడింది. ఇది ఆలిండియా రేడియో లో ధారావాహికంగా ప్రసారం అయ్యింది. పుల్లాభట్ల వెంకటేశ్వర్లు రచనలపై ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో కూరాకుల శ్రీనివాస్ యాదవ్ పరిశోధన చేస్తున్నారు. హైదరాబాద్, ఆదిలాబాద్ రేడియో స్టేషన్ లలో పనిచేసి ఆ జిల్లా సాహిత్య విశేషాలను ప్రజలకు చెప్పినవారు కోట్రా మల్లికార్జున శర్మ (1941). వీరు పెద్దవూర మండలం గర్నెకుంటకు చెందిన వారు. వీరు భావచిత్రాలు కవితా సంపుటిని, నాగరీకం కథా సంపుటితో పాటుగా అనే స్వర్ణలత అనే నవలను కూడా రాశారు.

సామాజిక చైతన్యంతో సమాజం సాగాలని ఆకాంక్షించిన రచయిత బోయ జంగయ్య (1942). వీరు మల్లయ్య, ఎల్లమ్మ దంపతులకు చౌటుప్పల్ మండలం పంతంగిలో జన్మించారు. వీరు ఎన్నో కథలు సంపుటాలను వెలువరించారు. అలాగే పావురాలు అనే కవితాసంపుటితో పాటు జాతర, జగడం, పుట్టుమచ్చ అనే నవలలను రాశారు. ఇవన్నీ దళిత నేపథ్య నవలలే. వీరి జాతర నవల ఆంధ్రజ్యోతి వారపత్రికలో ప్రచురితమయింది. దీని తొలి ముద్రణ 1985 లో వచ్చింది. దీనిలో పటేల్ సీతయ్య భూస్వామి, అతని కొడుకు పాండయ్య. ఇతడు తన భార్యను పట్టించుకోకుండా బయట స్త్రీలతో తిరగడం తండ్రి సీతయ్య భరించలేక పోతాడు. కొడుకు కోడలుకు పిల్లలు కలగాలని జాతరలో ఒక రోజూ నిద్ర చేసి రమ్మని అంటాడు. పాండయ్యకు దేవునిపై నమ్మకం లేదు. తనకు బదులుగా జీతగాన్ని ఇచ్చి రాధతో పంపుతాడు. ఆ తర్వాత రాధా గర్భవతి కావడం, దాంతో పాండయ్య మనసు మారటం జరుగుతుంది. ఈ నవలలో జాతర ఎలా జరుగుతుందో తెలపడంతో పాటు ప్రజలు, నౌకర్లు, పనివాళ్ళు, పోలీసులు పూజారులు ఇలా నవలంతా నిండుగా గ్రామీణ నేపథ్యం కనిపిస్తుంది. వీరి మరో నవల జగడం నవల డిసెంబర్ 2003 లో ప్రచురితమైంది.


సింగారం గ్రామంలో మల్లయ్య, ఎల్లమ్మ దంపతుల కొడుకు రాజయ్య. బోయ జంగయ్య నవలలపై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సి.వెంకటేశ్వర్లు (2000) పరిశోధన చేసారు. జాతర నవలపై ఎం.శ్రీరాములు 1999లో హైద్రాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్ పరిశోధన చేసారు.

ముదిగంటి సుజాత రెడ్డి (1944) పురుషులు, స్త్రీలు సమానమని పురుషాధిపత్యంను వ్యతిరేకించాలి కానీ, పురుషులను కాదనీ, స్త్రీ పురుషుల మధ్య మిత్ర వైరుధ్యమే తప్ప శత్రు భావం ఉండకూడదనీ చెబుతూ వీరు నవల ఆకాశంలో విభజన రేఖలు లేవు అనే నవల ను రాసారు. దీనిలో ప్రధాన పాత్రధారి 'రాగిణి'.

మరో నవల మలుపు తిరిగిన రథచక్రాలు (1994 ). ఈ నవల ఇతివృత్త కాలం 1946–86. ఇది వీరి మొదటి నవల. రచయిత్రి తాను చూసిన సాయుధ పోరాటాలను దీనిలో పొందుపరిచారు. నవలలో సరళ, రమేష్ ప్రధాన పాత్రలు. సరళ దొర కూతురు, రమేష్ విప్లవ ఉద్యమ నాయకుడు.

బతుకమ్మ జరుపుకుంటున్న సమయంలో ఆడవారి ఒంటిపై నగలు దోపిడీ చేయాలని పథకం వేస్తారు. ఇది తెలుసుకున్న రమేష్ తన దళంతో వస్తాడు. అక్కడ జరిగిన ఘర్షణలో రమేశ్ గాయపడగా అతనిని సరళ కాపాడుతుంది. అతని వ్యక్తిత్వం మెచ్చి మనసు ఇస్తుంది. కానీ రమేశ్ ప్రేమ కంటే ఉద్యమమే ఎక్కువ అని ప్రేమను అంగీకరించడు. ఆ తర్వాత జరిగిన ఘటనలో రమేశ్ దళం దొరను చంపి వేస్తుంది. ఇక అక్కడి నుంచి బయటపడిన సరళదాసును వివాహం చేసుకుంటుంది. వీరికి ఆశాలత అనే కూతురు పుడుతుంది. దాసు స్వతహాగా మేకవన్నె పులి. పోలీసు అనంతరం హైదరాబాద్ స్టేట్ ఏర్పడడంతో చాలామంది దాసు అలాగే రాజకీయాల్లోకి వచ్చారు. కానీ రమేష్ మాత్రం ఇంకా విప్లవోద్యమ కార్యక్రమాల్లోనే ఉంటాడు. ప్రజాస్వామ్యంలోకి రావాలని సరళ ఎన్నిసార్లు కోరినా అతడు అంగీకరించడు.

సరళ కూతురు అశాలతకి పెళ్ళయి పాప జన్మిస్తుంది. ఆ తర్వాత సంఘటనలలో ఆశాలత, ఆమె భర్త చనిపోతారు. పాప బాధ్యత సరళ తీసుకుంటుంది. కానీ తాను కూడా అనారోగ్యంతో మరణంకు దగ్గర కావడంతో రమేష్‌ను పిలిచి పాపని అతని చేతిలో పెట్టడం, అప్పుడు రమేష్ విప్లవ కార్యక్రమాలు వదిలి ప్రజాస్వామ్యం లోకి రావడం నవలా ఇతివృత్తం. సంకెళ్లు తెగిపోయాయి నవలలో ఈరయ్య, రంగి దంపతుల కుమారుడు నారాయణ. తన కులవృత్తి మంగలివృత్తిని ఇష్టంలేక కష్టపడి చదివిగా ఉన్నతస్థానం పొందుతాడు. నారాయణ చిన్నతనం నుంచి స్కాలర్‌షిప్‌లతో చదివి నగరంలో కాలేజీలో చదువుతుంటాడు. తనతోపాటు చదువుకునే దొర కొడుకు రామేశ్వరరావు ఎంతగా అవమానిస్తున్న వాటినన్నిటిని భరించి అనల అనే అమ్మాయి ప్రోత్సాహంతో సత్యానంద తీర్థ స్వామి



బిఎన్.శాస్త్రి

బోధనతో కష్టపడి చదువుకుని ఉద్యోగం సంపాదిస్తాడు.

చెరబండ రాజు గారి నవలల విషయం కు వస్తే ఈ రచనలన్నీ కూడా కమ్యూనిజం దృక్పథం తో రాసినవే. 1975–78 ప్రాంతం లో జరిగిన రైతు ఉద్యమాలను అణిచి వేయుటకు పోలీసులు ఎంతోమంది ఉద్యమకారులను నిర్బంధంలోకీ నెట్టింది. అయినా సరే ఉద్యమం వేడి ఏమాత్రం తగ్గలేదు. ఈ విషయంను తెలుపుతూ చెరబండ గారు మా పల్లె (1978) అనే నవలను రాసారు. దీనిని వీరు జైలులో ఉండి రాయడం విశేషం. 1981వ కాలంలో వీరు రాసిన నవల 'ప్రస్థానం'. దీనిలో భూస్వాముల దోపిడీకీ తాళలేక రైతులు వలస కూలీలగా మారి పట్టణాలకు తరలిపోవడం అనే దుస్థితిని చిత్రీకరణ చేసారు.

పేదలు కూలీలు బండ మనుష్యులు కావొచ్చు. కానీ శ్రమను నమ్ముకుని బతికే ఆ రాతి మనుషులు ఒక్కొక్కరు కలిసి చేతులు కలిపితే ఆ తాకిడికీ జ్వాలా జనించి. అదీ భూ అహంకారులను కాల్చివేస్తుంది. ఇదే విషయంతో పేద రైతులు – వ్యవసాయ కూలీలు కలిసి సంఘటితం అయ్యి సమస్యల పరిష్కారం కనుగొనాలి అనీ తెలుపుతూ చెరబండ గారు 'నిప్పురాళ్లు' అనే నవల రాసారు.

కాలం మారుతుంది – కాలం మార్పు కోరుతుంది – మార్క్సిజం పేరుతో ఉన్మాదం పెంచి పోషిస్తున్న మేధావులు ఉన్నారు. సిద్ధాంతం పేరుతో రాద్ధాంతాలను ప్రచారం చేసే రోజులి(అ)వి. మారుతున్న మార్క్సిజం జీవనవిధానం గురించి సిద్ధాంతంకు ఆచరణకు మధ్య ఉండాలిసిన సమన్వయం గురించి తెలుపుతూ చెరబండ రాజు దారి పొడుగునా (1985) అనే నవల రాసారు.

నల్గొండ జిల్లాలో అన్నమాచార్య సంకీర్తన ప్రచార సమితిలో సభ్యులుగా ఉండి అనేక సమ్మేళనాలను నిర్వహించిన వారు



బోయినేపల్లి వెంకటేశ్వర రావు (1955). వీరు తిప్పర్తి మండలం ఇందుగులకు చెందినవారు. వీరు అందని శిఖరాలు, జీవిత బంధాలు అనే నవలలను రాశారు. 10 ఏండ్ల వయసులోనే శివ స్తోత్రం, సీతారామకళ్యాణం వంటి పద్య కవితా రచనలు చేసిన ప్రతిభాశాలి తోట నరసింహ వీర భోగ వసంత రాయ్ (1955). వీరు చండూరు మండలంలో జన్మించారు. వీరు శుభోదయం, రణభేరి కవితా సంపుటాలను, నల్లగొండ జిల్లా చరిత్ర (1989) అలాగే 15 దాకా రచనలు చేసిన వారు. ఇంకా వీరు ఆత్మబలి (1974), భగ్న ప్రేమికులు (1975), ఇది ఈ దేశం కథ (1978), ఢమరు ధ్వని (1983), మన్నే బంగారం, మగువ తిరగబడితే, జడ్జిమేంట్, ప్రేమ పురాణం వంటి నవలలు రాశారు. వీటిలో ఇది ఈ దేశం కథ చారిత్రక నవలగా చెప్పుకోవచ్చు. ఇది ఐదు భాగాలుగా ప్రచురితమైంది. దీనిలో నల్లగొండ జిల్లా సాంఘిక, ఆర్థిక, దేశ కాల పరిస్థితులు కలవు. సాహితీ మేఖల సభ్యుడిగా నల్గొండ జిల్లా సాహిత్యంలో కృషి చేసిన వారు పున్న అంజయ్య (1961). వీరు చండూరు మండలంలో పరమేశం, రంగమ్మ దంపతులకు జన్మించారు. వీరు విశ్వరూప విమల చరిత్ర శతకం (1981), నల్లగొండ సాహిత్య చరిత్రలను రాశారు. అలాగే రౌడీయిజం అనే నవల కూడా రాసారు. కానీ ఇదీ అముద్రితం. ఎందరో రచయితల గ్రంధాలకు ఆర్థికంగా సహాయం చేసిన వారు మందడి కృష్ణారెడ్డి (1956). వీరు కనగల్లు మండలం తిమ్మాజి గూడెంకు చెందిన వారు. వీరి వ్యక్తిత్వాన్నీ మెచ్చి కవిరత్న నీలా జంగయ్య గారు తన చారిత్రక గేయకావ్యమైన చిత్కళ రచనను అంకితం ఇచ్చారు. మందాడి వారు స్వయంగా రచయితగా మందాడి కథలుతో పాటుగా బానిస అనే నవలను కూడా రాశారు. కానీ ఇది అముద్రితంగా ఉంది. మునుగోడు మండలం గూడపూర్ కు చెందిన వారు నన్నూరి సత్తిరెడ్డి (1963). వీరు జానపద గేయాలను ఎన్నో సేకరించి జనపది పదాలు, ఎర్ర చుక్కలు, లాలి పాటలు ప్రచురించారు. అలాగే కొడ గట్టిన పల్లెటూరు అనే నవలను రాశారు.

వేముల ఎల్లయ్య, వరంగల్ జిల్లాలోని జనగామ తాలూకా, 1973 జూలై 06 లో జన్మించారు. కానీ ప్రస్తుతం నల్గొండ జిల్లాలో ఉంటున్నారు. వీరు కక్క, సిద్ధి, అనే నవలలను రాసారు. మరో రచయిత సైబాబా ఆపా అనే నవలను రాశారు. నల్లగొండ జిల్లా నకరికల్లులో జన్మించిన వారు యం.డి.చైతన్య. వీరి అసలు పేరు మహమ్మద్ అబ్దుల్లా. వీరు 500 దాకా కథలు రాసారు. అలాగే శిథిల గుహలు, సత్యభామా శపథం, రేపటి డైరీ, కాల్లగర్ల్ అనే నవలలు రాసారు. దీనిలో కాల్లగర్ల్ నవల కన్నడంలో కూడా అనువదించబడింది. మరో రచయిత నోముల సత్యనారాయణ చైనా దేశపు నవలను కుటుంబం పేరుతో అనువదించారు. ఇది సృజన పత్రికలో ధారావాహికంగా ప్రచురితం అయ్యింది. మరో రచయిత ఎలికట్టె శంకర్ రావు 2010లో దేవుని రాజ్యం పేరిట నవలను రాసారు. దీనిలో రైతు సమస్య చిత్రణ కలదు.

**భువనగిరి ప్రాంత నవలా రచయితలు**

తొలితరం నవల రచయిత్రులలో పేర్కొనదగినవారు శేష భట్టర్ వెంకట రామానుజరావు (1900–44). వీరు మోత్కూరు మండలం దత్తప్పగూడెంకు చెందిన వారు. వీరి తల్లిదండ్రులు కృష్ణమాచార్యులు, రాజమ్మ దంపతులకు జన్మించారు. న్యాయవాది విద్యపై మక్కువతో ప్లీడర్ వృత్తిని చేపట్టి వివిధ ప్రాంతాలలో మంచి లాయర్గా పేరుగాంచారు. అనంతరం అధ్యాపకుడిగా మారారు. శేషాద్రి రమణ కవులు రాసిన ఉదయలక్ష్మి (షబ్నవీసుగారి అర్ధాంగి గూర్చి) పద్య కావ్యంకు పేరడీగా నిశాలక్ష్మీ గ్రంధం రాసారు. ఇవే కాకుండా అనేక గ్రంధాలు రాసిన వారు. ఇంకా నల్లగొండ జిల్లా చరిత్రను రాశారు. అలాగే ప్రకృతిని ఇతివృత్తంగా తీసుకుని ప్రాకృత దాంపత్యం అనే నవలను రాశారు. ప్రకృతిని ఈశ్వరుడుగా, భూమి వసుంధర (నాయిక) ఆకాశం విష్ణు పాదుడు (నాయకుడు) పర్వతాలు (వన వాసులు) గా తీసుకుని నవలా రచన చేసారు. అలాగే బహ్రైనూర్ అనే మరో నవల కూడా రాసారు.

1951లో రచనా రచనా వ్యాసంగముకు శ్రీకారం చుట్టి ఇంతింతై వటుడింతై రీతిలో నాటికలు, నవలలు, చరిత్రలు, పరిశోధనలు, శాసనాలు ఇలా ఎన్నో ప్రక్రియలలో సాహిత్య సేవను చేసినవారు బి.ఎన్.శాస్త్రి (1933). వీరు విష్ణు కుండినుల శాసనాలను వెలికి తీసారు. అన్నింటికీ మించి వీరు నల్లగొండ, ఆదిలాబాద్, మహబూబ్ నగర్ జిల్లా సర్వస్వాలను తయారు చేశారు. అలాగే వీరి సంపాదకత్వంలో 1981లో మూసి సాహిత్య పత్రిక ప్రారంభమై ఇప్పటికీ నాణ్యమైన సాహిత్యాన్ని అందిస్తూనే ఉన్నది. బి.ఎన్ శాస్త్రి గారు సంధ్యారాగం, పరివర్తన, జీవన గమనం, విప్లవ జ్వాల,

వాకాటక మహాదేవి, తుక్కాదేవి అనే నవలలు రాసారు. దీనిలో తుక్కాదేవి నవల కృష్ణదేవరాయల భార్య గురించి రాసింది. అలాగే వాకాటక మహాదేవి విష్ణుకుండినుల కాలపు నవల. ఈ రాజుల చరిత్రను తెలంగాణ సంబంధాలను చర్చించిన నవల. ఈ రాజవంశం పై ఉన్న ఏకైక నవల ఇది. వీరి మూడవ నవల విప్లవ జ్వాల. ఇందులో తెలంగాణ సాయుధ పోరాటం గురించి కలదు. భువనగిరి వీరవల్లిలో జన్మించిన రచయిత కుంభం యాదవరెడ్డి (1938). వీరు హైదరాబాదులోని కేశవ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో హిందీ అధ్యాపకులుగా పనిచేశారు. దిగంబర కవుల లో ఒకరిగా 1965 నుండీ నిఖిలేశ్వర్‌గా పేరుపొందారు. ప్రజాసాహితి పత్రిక సంపాదకులుగా పనిచేసిన నిఖిలేశ్వర్ మండుతున్న తరం (1972), ఈనాటికే (1984) వంటి కవితా సంపుటాలను, భారతీయ కవిత (1991), శతాబ్దాల సాక్షిగా నా మహానగరం (1991)వంటి రచనలు చేశారు. అంతేకాకుండా మరో భారతదేశం అనే నవలను కూడా రాశారు. ఇది హిందీ నుంచి అనువదించబడినది. ముక్తవరం పార్థసారథి (1944) మిణుగురులు అనే 35 కథల సంపుటిని వెలువరించారు. అలాగే నవల రచన కూడా చేసినట్లు తెలుస్తుంది కానీ వివరాలు తెలియగరావు.

కల్లోనికుంట రామన్నపేటలో కృష్ణా రెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు జన్మించిన వారు ఏనుగు నరసింహారెడ్డి (1968) వీరు ఉత్తమ కవిగా, ఉత్తమ విమర్శకులుగా పేరు పొందారు. వీరు పల్లె బతుకు, శతక పద్యాలు, ఎన్ కౌంటరు, కొత్త పలక, తెలంగాణ రూబాయిలు వంటి రచనలు చేసారు. అాగే వీరు విద్యార్థిగా ఉన్నప్పుడే పగిలిన గుండెలు అనే పేరున నవల రాశారు. ఇది నాటి ఒక పత్రికలో ధారావాహికంగా వచ్చింది.మరో రచయిత తిరునగరి అంజనేయులు సంఘం అనే నవలను రాశారు. ఇది 1948 నాటి తెలంగాణా పరిస్థితులను, పోరాటాలను చిత్రీకరించింది. ఇది రచయిత స్వీయ అనుభవాలకు సంబంధించిన నవలగా చెప్పవచ్చు. మరో రచయిత పెండెం వాసుదేవ రావు నవలా రచయితే కాక రాజకీయ వేత్త కూడా. వీరు మాడపాటి హనుమంత రావును అసెంబ్లీ ఎన్నికలలో ఓడించిన వారు. వాసుదేవ రావు గారు రాసిన నవల గుసగుసలు. కానీ ఇది అముద్రితం.

**సూర్యాపేట ప్రాంత నవలా రచయితలు**


తడకమళ్ళ వెంకట కృష్ణారావు (1830) తెలుగులో తొలి నవల రాసిన వారు. వీరు మునగాల మండలం బేతవోలులో కుట్టెన, వెంకమ్మ దంపతులము జన్మించారు. ఆ తర్వాత కనకమ్మ రామచంద్రయ్య దంపతులకు దత్తతగా వెళ్లారు. తర్వాత మద్రాసు కు వెళ్ళిన తడకమళ్ల తన అవసాన దశలో తిరిగి బేతవోలుకి వచ్చారు. తడకమళ్ళ వారు కామందకము, లీలావతి గణితం, కామరూప చరిత్ర, రామావతార కాల నిర్ణయం వివరణం వంటి రచనలు చేసారు.



తెలుగులో మొదటి నవల ఏది అని తీవ్ర చర్చ జరిగినప్పటికీ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి చరిత్ర రచనను ముంగిలిలో ప్రస్తావించడం అలాగే సంగిశెట్టి శ్రీనివాస్ లాంటి పరిశోధకులు ఆధారాలతో తొలి నవలగా వారి రచన పేర్కొనడం. తెలుగులో తొలి నవలగా కంబుకరచరిత్రగా నిర్ధారణ అయింది. 1866 లోనే తడకమళ్ళ వారి రచనలు కామరూప కథ అలాగే తెలుగు-వెలుగు ముగ్ధ కూడా వెలువడాయి.

ఉత్తమ ఉపాధ్యాయ నాయకుడిగా పంచాయతీరాజ్ ఉపాధ్యాయ దినపత్రికను నడిపిన వారు కొల్లు మధుసూదన్రావు (1914). వీరు మునగాల మండలం జగన్నాథపురం లో జన్మించారు. వీరు బాల నాటికలు(1980), స్వప్న జీవులు(నాటిక) లను రాసారు. అలాగే 1988 లో రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా, 1992 లో జాతీయ ఉత్తమ అధ్యాపకులు గా పేరొందారు. అలాగే వీరు శిక్ష అనే నవలను కూడా రాశారు. నడిగూడెం మండలం సిరిపురంలో జన్మించిన రచయిత చివలూరు లక్ష్మీనరసింహాచార్యులు (1916). వీరు తెరువరి నాటకం, విక్రాంతి (గీత కావ్యం), స్వప్నవాసవ దత్త (గేయ కావ్యం) వేణుగోపాల శతకం (1988) తో పాటుగా ఎగిరే పళ్ళాలు అనే అముద్రిత నవలను కూడా రాశారు.

తెలంగాణ వారి సంస్కృతి వికాసమును చాటి చెప్పినవి ఆంధ్ర మహాసభలు ఈ సభల చరిత్ర ను గ్రంథస్తం చేస్తూ హైదరాబాద్ సంస్థానం లో రాజకీయ వికాసం ఆంధ్ర మహాసభ అధ్యక్షులు అనే గ్రంథం ను రాసిన వారు కొండపల్లి వెంకట శేషగిరిరావు (1930). వీరు కోదాడ మండలం అనంతగిరిలో జన్మించారు. వీరు శ్రీకృష్ణ శతకం, శ్రీ వేంకటేశ్వర శతకంతో పాటుగా చీకటి వెలుగు అనే నవలను రాశారు. అవధాని సూర్యనారాయణ, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించినవారు. సంస్కృతాంధ్ర భాషల్లో పండితులుగా భాషా వాచస్పతి బిరుదు పొందిన వారు సోమయాజుల లక్ష్మీ నరసింహ శాస్త్రి (1940). వీరు చిలుకూరు మండలం బేతవోలులో జన్మించారు. వీరు కర్ణ హృదయం (నాటిక), పిల్లలమర్రి చరిత్ర, నృసింహ




కటాక్షం(నాటకం), శారద కటాక్షంతో పాటుగా గిరిజ అనే అముద్రిత చారిత్రక నవలను రాశారు.

దేవులపల్లి క్రిష్ణమూర్తి స్వగ్రామం సూర్యాపేట తాలూకాలోని పెన్‌పహాడ్ మండలం అనంతార గ్రామం. దేవులపల్లి పెద్ద నర్సింహ, రాములమ్మ దంపతులకు 1940 జూన్ 14న జన్మించారు. ఆయనకు ముగ్గురు సంతానం. 1998లో తహశీల్దార్‌గా ఉద్యోగ విరమణ చేశారు. దేవులపల్లి కృష్ణమూర్తి విద్యాభ్యాసం సూర్యాపేటలో జరిగింది. 1958లో హెచ్‌ఎస్ పూర్తి చేశారు. నల్లగొండ సాయంత్రం కాలేజ్‌లో 1968లో బీఏ పూర్తిచేశారు. 1960లో ఎల్‌డిసిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. 1984లో ప్రమోషన్‌పై మోతె మండలంలో తహశీల్దార్‌గా పనిచేశారు. అక్కడి నుండి సంస్థాన్‌నారాయణపురం, హాలియా, మేళ్లచెర్వు, మఠ్రిగూడ, వేములపల్లి మండలాల్లో పనిచేసి 1998లో ఉద్యోగ విరమణ పొందారు. తాను విన్నవి కన్నవి భద్రపరచాలనే ఆలోచనలతో 2009 నుండి రచనలు ప్రారంభించారు. గ్రామీణ వాతావరణం, ప్రజల జీవన స్థితిగతులపై 2009లో ఊరు వాడ బ్రతుకు (నవల) రచించారు. 2013లో సంచార జాతులకు సంబంధించి బయటి గుడిసెలు(నవల), మరో రచయిత జాతశ్రీ (1943). వీరు మంతంపల్లి మండలం గుండ్లపల్లి గ్రామంకు చెందినవారు. వీరు కపోతం, చలివేంద్రం, ప్రభంజనం వంటి కథల సంపుటాలతో పాటుగా నవలా రచన కూడా చేసినట్లు తెలుస్తుంది.

ఆంధ్రప్రభ, సాహితీ మిత్ర, ప్రజాపోరాటం వంటి పత్రికలలో రచనలు చేసిన వ్యక్తి ముదుంబై పురుషోత్తమాచార్యులు (1948). వీరు హుజూర్నగర్ లో జన్మించారు. నీడలేని చెట్టు అనే అముద్రిత నవలను రాశారు. అలాగే మల్లాది వసుంధరా దేవి గారి నరమేధం అనే నవలను నాటకంగా రాశారు. ఇదీ 1985లో రేడియో నాటకంగా ప్రసారం అయ్యింది. సూర్యాపేటకు చెందిన వనం సావిత్రీ నాథ్ గారు హిందీ భాషకు గాను సాహిత్య రత్న అనే అవార్డు పొందినవారు. వీరు సుమహారం (1992) అనే కవితా సంపుటిని రచించారు.దీనితో పాటుగా పెద్ద కథ అయినా ఒక నవలికను రాసినట్లు తెలుస్తోంది.

**ఇంకా మరికొందరు**

బంకించంద్రుని అనువాద నవల అయిన కృష్ణకాంతుని మరణశాసనం (1910) రచనను అదే పేరుతో తెలుగులో అనువదించిన వారు చిల్లరిగె శ్రీనివాసరావు. ఈ నవల ఒరియా, కన్నడ భాషల్లో అనువాదం అయింది. దీనిని వెంకట పార్వతీశ్వర కవులు కూడా తెలుగులో అనువదించారు. బంకించంద్రుని మరో నవల శైవలిని కూడా చిల్లరిగె శ్రీనివాసరావు అనువదించారు. దీనిని శైవలిని చంద్రశేఖరం పేరుతో తల్లాప్రగడ సూర్యనారాయణ గారు కూడా అనువదించారు. ఇవే కాకుండా చిల్లరిగె శ్రీనివాసరావు అభాగిని, ఛద్మవేషి (1924), శ్రీధర విజయం వంటి నవలలను కూడా రాశారు. ఇవ్వన్నీ కూడా అనువాదాలే. మరో రచయిత ఊటకూరు సత్యనారాయణ శశికళ అనే నవలను, జంధ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి జర్మనీ యుద్ధం నవలను, వనం నరసింహ రావు షర్మిలాబాయి అనే నవలలను రచించారు.ఇంకా 1996 లో కందిమళ్ళ ప్రతాప రెడ్డి బందూక్ అనే నవల ను రాసారు. వీరు నల్లగొండ జొన్నల గడ్డ ప్రాంతంకు చెందిన వారు. బందూక్ నవల నల్లగొండ సాయుధ పోరాట విశేషాలకు సంభందించినది. అలాగే కందిమళ్ళ ఇతర నవలలు ఖానూన్, చేగువేరా, భగత్ సింగ్‌లు. వీరి రచనపై తెలంగాణ సాయుధ పోరాటం బందూక్ నవల (2009) ఆనీ డా.వింధ్యవాసిని ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధన పత్రం సమర్పించారు.

**ముగింపు**

తెలంగాణ ఏర్పడిన తరువాత అస్తిత్వవాదంతో తెలుగు సాహిత్యం సాగుతుంది. ఇలాంటి సమయంలో మన సాహిత్యాన్ని మనం మననం చేసుకోవడం ఎంతైనా వుంది. నల్లగొండ జిల్లా అనే కాదు ఏ జిల్లా సాహిత్యం అయిన విమర్శల వల్ల, పరిశోధనల వల్ల మరింత రాటు దేలగలదు. అలాగే మరుగుపడిన ఎంతోమంది సాహితీవేత్తలు బయటకు రాగలరు. నల్లగొండ నవలా విషయంకు వస్తే ప్రస్తుతం నల్లగొండ జిల్లా నవలా సాహిత్యంపై ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.సైదులు పరిశోధన చేస్తున్నారు. చివరగా నల్లగొండ జిల్లాలో రచయితలకు కొదవ లేదు. కావాలిసిందల్లా కాసింత ప్రోత్సాహం, గుర్తింపు. ఈ జిల్లా పై ఇంకా ప్రత్యేకంగా పరిశ్రమ చెస్తే ఎందరో కవులు రచయితలు, అనేక సాహిత్య విశేషాలు బయటకు రాగలవనీ తెలియచేసుకుంటూ...

**సంప్రదించిన గ్రంథాలు :**

తెలంగాణ నవలా సాహిత్యం - సం.టి.శ్రీ రంగ స్వామి
నల్లగొండ జిల్లా కవులు-పండితులు - డా.శ్రీ రంగాచార్య
తెలంగాణ సాహిత్య చరిత్ర - సం.డా.జి.బాల శ్రీనివాసమూర్తి

# దేశానికి భాతి – పీవీ ఖ్యాతి

**డా. వొజ్జల శరత్ బాబు**, ప్రభుత్వ ఉపాధ్యాయులు, హైదరాబాదు. ఫోన్ : 9494183937



**న కశ్చిత్ కస్యచిన్మిత్రం న కశ్చిత్ కస్యచిద్ రిపుః ।**
**వ్యవహారేణ జాయంతే మిత్రాణి రిపవ స్తథా॥** –హితోపదేశం

"ఎవరూ,ఎవరికి కూడా సహజంగా మిత్రుడు కాదూ అలాగని శత్రువు కూడా కాదు. పరస్పరంగా ఏర్పడే సంబంధాలలోనే మిత్ర, శత్రు బంధం ఉంటుంది. లోక వ్యవహారంలోనే శత్రువులు మిత్రులు ఏర్పడుతూ ఉంటారు."

దేశాన్ని పరిపాలించేటువంటి రాజు ఈ విషయంపై సదా అప్రమత్తుడై ఉండాల్సిన అవసరం ఉంటుంది. అలా లేని పక్షంలో దేశభద్రత విషయం ఇబ్బందిలో పడాల్సి వస్తుంది. సందర్భాన్ని బట్టి దేశరక్షణ వ్యవహారాలను, విదేశాల పట్ల అనుసరించాల్సిన వ్యూహాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ దూరదృష్టితో ఆలోచించగలిగే నాయకుడే పదికాలాల పాటు చరిత్రలో నిలువగలుగుతాడు. దేశ సౌభాగ్యాన్ని కాంక్షించిన నాయకుడౌతాడు. మన భారతదేశ ప్రధాన మంత్రులలో అలాంటి వాళ్లను వేళ్లపైన లెక్కపెట్టవచ్చుననుకుంటా. అందులో ఒకరు పీవీ నరసింహారావు గారు.

1980లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాత పి.వి. గారికి విదేశాంగ శాఖ మంత్రిత్వశాఖను అప్పజెప్పింది. ఆనాడే ఆయన యొక్క సమున్నతమైన దూరదృష్టి అందరినీ ఆకర్షించింది. కానీ ప్రభుత్వం ప్రధానమంత్రి ద్వారానే వెళుతుంది కాబట్టి, కావలసిన, చేయాలనుకున్న పనులను ఆయనకు చక్కబెట్టే సంపూర్ణ అవకాశం లభించినట్లయింది.

1991లో ఆయన మన ప్రధానమంత్రి అయిన తర్వాత ఆయనకు పరిపాలన స్వేచ్ఛ లభించింది. అనేకమైన అంతర్జాతీయ కార్యక్రమాలను చక్కబెట్టే పనిలో దాదాపు కృతకృత్యులయ్యారు. నాటివరకు ఉన్న విదేశీ విధానాన్ని కొత్త మలుపు తిప్పారు. దేశానికి ఏది అవసరమో బాగా ఆలోచించారు. దానిని నిర్దిష్టంగా నిర్దుష్టంగా చేయడానికి నడుము కట్టుకున్నారు. వీటివల్ల దేశానికి ఆయనకూ అంతర్జాతీయంగా కీర్తి ఇనుమడించింది.

అలా అంతర్జాతీయంగా దేశానికీ, ఆయనకూ కీర్తి ప్రతిష్టలు సాధించి పెట్టిన కొన్ని సంఘటనలను స్మరించుకుందాం!

### ఇజ్రాయెల్‌తో బంధం

మన దేశం శక్తివంతమైన ఇజ్రాయిల్‌తో చాలా బలహీనమైన బంధంతో ఉండేది. ఒక రకంగా చెప్పాలంటే ఇజ్రాయిల్‌ను పక్కన పెట్టింది అని భావించాలి. కానీ పీ.వీ. ఇజ్రాయిల్‌తో సత్సంబంధాల సాధనకు పునాది వేసినాడు. 1991–92 ప్రాంతంలో ఆదేశంతో సంబంధాలను పునర్నిర్వచించారు. 1992లో ఇజ్రాయిల్ రాయబార కార్యాలయాన్ని ఢిల్లీలో తెరవటానికి అనుమతినిచ్చారు. ఆనాటినుండి ఇజ్రాయిల్ భారత్‌కు నమ్మకమైన దేశాల్లో ఒకటిగా నేటికీ నిలిచి ఉంది. ఇది చూసిన అంతర్జాతీయ సమాజం పి.వి. దూరదృష్టిని బహుధా కొనియాడింది. తద్వారా ఆయనకు కీర్తి ని తీసుకువచ్చి పెట్టింది.

### ప్రాచ్య వీక్షణ విధానం

తూర్పు దేశాల పట్ల భారత్ విధానం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉండేది కాదు. ఎక్కడో దూరంగా ఉన్న ఆఫ్రికా లాంటి దేశాలతో సఖ్యత అవసరమని భావిస్తున్నట్లు తోచేది. కానీ దానివల్ల ప్రయోజనం ఏమీ లేదని బలహీనమైన స్నేహం వల్ల బలహీనతనే సంప్రాప్తిస్తుంది అనేది సత్యం. ఈ విషయాన్ని గమనించిన పి.వి. తూర్పు ఆసియా దేశాలతో స్నేహ సంబంధాలకు తెరదీశారు. అలా ఆయన తెర తీసిన విధానమే లుక్‌ఈస్ట్ పాలసీ. దీన్ని మనం ప్రాచ్య వీక్షణ విధానమని పిలుస్తున్నాం. దీనివల్ల సంపన్న దేశాలతో బలమైన దేశాలతో సంబంధం ఏర్పడింది. దేశ వ్యాపారం క్రమక్రమంగా పుంజుకుంది. ఈ పాలసీ తేవడంలో పీవీ ఆలోచన విధానం ఎంత గొప్పదో నేడు మనకు తెలుస్తున్నది. ఈ విధానం వల్ల కూడా అంతర్జాతీయంగా పి.వి. కీర్తి ప్రతిష్టలు దేశ సౌభాగ్యం మరింత పెరిగింది.

**అలీన దేశ విదేశాంగ విధానం**

ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో నెహ్రూ ప్రోత్సహించిన విధానమే అలీన దేశ విదేశాంగ విధానం. దీంట్లో 80 నుంచి 90 శాతం దేశాలు పేద దేశాలు. ఈ విధానం వల్ల మన దేశం సాధించింది పెద్దగా ఏమీ లేదని చెబుతారు. ఏమీ సాధించని విధానం వల్ల ప్రయోజనం శూన్యం కదా! ప్రచ్ఛన్న యుద్ధం చివరి కాలంలోని విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్నప్పుడే అలీన విధానానికి దూరం జరిగే ప్రక్రియను మెల్లగా ప్రారంభించారు. తాను అలీన దేశాల శిఖరాగ్ర సమావేశాల్లో అనేకమార్లు ప్రసంగించారు. ప్రతి ప్రసంగం వీరి కీర్తి కిరీటంలో కలికితురాయి అయింది. 1983లో నామ్ (అలీన దేశాల) శిఖరాగ్ర సమావేశంలో పీవీ స్పానిష్ లో మాట్లాడు. ఇది విన్న క్యూబా అధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రోతో పాటు యావత్ ప్రపంచమే ఆశ్చర్యపోయింది. తాను ప్రధానమంత్రి. తాను ప్రధానమంత్రి అయిన తర్వాత NAM కు బదులుగా ఇతరత్రా మన దేశ బలాన్ని పెంచే ప్రయత్నం చేశారు. అందులో విజయం సాధించారు. ఇది అంతర్జాతీయంగా దేశానికి బలాన్ని కూర్చింది. ఆయనకు పేరు తెచ్చి పెట్టింది.

**చైనా వ్యవహారాలు**

పి.వి. కంటి ముందు 31 ఏళ్లలో చైనా ప్రధాని భారత్‌కు వచ్చిన దాఖలాలు లేవు. కానీ చైనాతో సత్సంబంధాలను పెంచుకునే విదేశీ విధానం బహుదా కొనియాడబడింది. 1993లో ఆనాటి చైనా ప్రధాని భారత్ సందర్శించారు. అదే సంవత్సరంలో పి.వి. కూడా చైనాలో నాలుగు రోజులు పర్యటించారు. బలమైన విదేశీ విధానాన్ని కొనసాగేలా ప్రయత్నం చేశారు.

**జర్మనీతో సంబంధాలు**

జర్మనీతో భారత్ కు ఉన్న ప్రయోజనాల గురించి ఆలోచించారు. ఆనాటి జర్మనీ ఛాన్స్‌లర్ హెల్మెట్ కోల్ తో విజయవంతంగా చర్చలు జరిపారు. 1991 సెప్టెంబర్ లో బాన్ నగరానికి వెళ్లారు. జర్మనీలో భారతీయ ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. భారత్, జర్మనీల సత్సంబంధాలు నూతన అంకానికి చేరుకున్నాయి. ఇది కూడా డా.పి.వి.కీ, దేశానికి అంతర్జాతీయ విలువను పెంచింది.

**అమెరికాతో సంబంధాలు**

మిఖాయిల్ గోర్బచెవ్ తర్వాత యు ఎస్ ఎస్ ఆర్ కుప్పకూలడంతో ప్రచ్ఛన్న యుద్ధ శకం ముగిసింది. అలీన దేశాలు అంతర్జాతీయంగా పెద్దగా శక్తిని సాధించలేకపోయాయి. ఇలాంటి సమయంలో భారత్ కు కింకర్తవ్యం? అనే ప్రశ్న సహజంగానే ఉంటుంది. తాను విదేశాంగ శాఖ మంత్రిగా ఉన్నప్పుడే పి.వి. అమెరికాతో సత్సంబంధాల పునరుద్ధరణకు కృషి మొదలు పెట్టినాడు. కానీ అది అడుగు వేసీ వేయనట్లే అయింది. అమెరికాతో దౌత్య సంబంధాల ఉద్ధరణకు 1994లో పి.వి.అమెరికా ప్రయాణం అయినారు. ఆనాడు అమెరికాలో ఆయన చేసిన ప్రసంగం వేనోళ్ళ కొనియాడబడింది. 27 మార్లు చప్పట్లు చరచడం, నిలబడి గౌరవాన్ని ప్రదర్శించడం జరిగిందంటే ఎంత ప్రియమైన ప్రసంగమో అర్థమవుతుంది. అమెరికాలోని సీనియర్ దౌత్యవేత్తలు పి.వి.ని ప్రశంసలలో ముంచెత్తారు. అమెరికన్ పత్రికలు పీవీ కీర్తిని ఆకాశానికి అంటించాయి. అంతర్జాతీయంగా పి.వి.కి ఇదొక కీర్తి మైలురాయి. ఆనాడు వేసిన పునాదిరాళ్ళ పుణ్యమా అని భారత ప్రధానమంత్రులు అమెరికా వెళ్లడం, అమెరికా అధ్యక్షులు భారత్‌కు రావడం జరుగుతున్నది. సంబంధాలు పాదుకోవడం జరుగుతున్నది. ఆనాటి విధానాలనే తర్వాత ప్రభుత్వాలు నేటికీ కొనసాగిస్తున్నాయి. అంటే ఎంత ప్రియమైన విధానాలో అర్థం చేసుకోవచ్చు. ఈ అంశం కూడా దేశానికి, పీవీకి ఎనలేని గౌరవాన్ని తీసుకువచ్చి పెట్టాయి.

**వివిధ ప్రసంగాలతో పి.వి. కి ఖ్యాతి**

1982 ఐక్యరాజ్యసమితి సాధారణ సమావేశంలో పివి గారు చేసిన ప్రసంగం ఆయనకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది.

చోగమ్ సదస్సుకు పి.వి. అధ్యక్ష స్థానానికి అలంకరించారు. ఆనాడు పీవీ చేసిన ప్రసంగాన్ని, ఆర్థిక సంబంధాల విషయాలను ఎత్తి చూపించిన విధానాన్ని అనేకమంది దేశాధినేతలు కీర్తించారు. ఆయన ప్రసంగాన్ని సమర్థించారు. ఒక్క మాట – పాకిస్తాన్ ప్రధాని కూడా దాన్ని సమర్థించారు అంటే ఆయన ప్రసంగంలోని విశాల దృక్పథాన్ని అర్థం చేసుకోవచ్చు. ఆనాటి ప్రసంగం అంతర్జాతీయ పత్రికల్లో కీర్తి పొందింది.

ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు జరిగిన G –15 శిఖరాగ్ర సమావేశంలో ప్రధానవక్తగా కీర్తి పొందినాడు.

కామన్వెల్త్ దేశాల సమావేశాలు జింబాబ్వే రాజధాని హరారేలో జరిగాయి. అవి 1991లో. ఆనాటి హరారే ప్రకటనలో పి.వి.చేసిన ప్రతిపాదన ప్రత్యేకంగా ప్రశంసలు పొందింది. అదేంటంటే “దేశాల అభివృద్ధి, సాంకేతిక సహకారం, ప్రజాతంత్ర సంస్కరణలు మరియు మానవ హక్కుల సమతూకం ఉండాలి. అదే ప్రతి దేశానికి శ్రీరామరక్ష. అప్పుడే అంతర్జాతీయంగా బలమైన సమయం ఏర్పడుతుంది అనే భావనలో ఉందట. హరారే ప్రకటన పి.వి.కి ఉన్న కీర్తిని అంతర్జాతీయంగా ఇనుమడించేలా చేసింది.

రియో డి జనీరియో లో అంతర్జాతీయ సమావేశం జరిగింది. అది 1992లో. అందులో ఆయన భారతీయ వారసత్వ ఘన కీర్తి ప్రతిబింబించేలా ప్రసంగం ప్రారంభించారు. “సముద్ర వసనే దేవీ పర్వత స్తన మండలే విష్ణుపత్నీ నమస్తుభ్యం పాదస్పర్శం క్షమస్వమే” అంటే భారతదేశం అనాదిగా ధరిత్రికి ఇస్తున్న విలువను, గౌరవాన్ని

అంతర్జాతీయ సమాజం ముందు పెట్టినాడు. ఈ మాటలు విన్న యావత్ ప్రపంచం భారత్ ధరిత్రిని గౌరవించడంలో ఎంత ముందు ఉందో తెలిసి ఆశ్చర్యపోయారు. ఆ సమావేశంలో మన తెలుగుకవుల ఒకరిద్దరి పద్యాలను కూడా ససందర్భంగా ఉపయోగించినట్లు చెప్తారు. ఆనాటి ధరిత్రి సదస్సులో భారత్ విజయవంతమైన పాత్రను పోషించింది. పి.వి.ని యావత్ అంతర్జాతీయ వేదిక ప్రశంసించింది.

1992లో జరిగిన ప్రపంచ పర్యావరణ సదస్సుకు పర్యావరణ మంత్రిని కాకుండా వాజ్పేయిని పంపించి తద్వారా పి.వి దేశానికి విజయం సాధించి పెట్టారని అంటారు. దీనికంటే మరో ముఖ్యమైన అంశం – 1994లో ఐక్యరాజ్యసమితి జెనీవాలో అంతర్జాతీయ మానవహక్కుల సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి ప్రతిపక్ష నాయకుడైన అటల్ బిహారీ వాజ్‌పేయిని నాయకుడిగా పంపించారు. పాకిస్తాన్ చేస్తున్న నానా యాగీని వాజ్‌పేయి అంతర్జాతీయ సమాజం ముందు కళ్లకు కట్టించారు. పాకిస్తాన్ ఖంగు తిన్నది. తద్వారా వాజ్‌పేయి పి.వి. రాజకీయ చాతుర్యం, దేశ అభిమానం, ఈ నూతన విధానం గూర్చి అంతర్జాతీయ సమాజం ప్రశంసించకుండా ఉండలేకపోయింది.

**పీవీ గూర్చి పత్రికల / గొప్ప వారి మాట:**

న్యూయార్క్ టైమ్స్ పత్రిక –

"పీవీని భారతీయ డెంగ్యూ సియావో పింగ్‌గా పేర్కొంది". Deng Xiaoping 1978లో చైనా ఆర్థిక రంగాన్ని మలుపు తిప్పిన ఘనుడు. అందుకే ఆయన తోటి పీవీని పోల్చి చెప్పింది.

అమెరికా మాజీ అధ్యక్షుడు Bill Clinton – "పి.వి. ని గొప్ప విజ్ఞత అనుభవంగల నాయకుడిగా" ప్రశంసించారు.

ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా మ్యాగజిన్ –1986 ఏప్రిల్లో చేసిన సర్వేను ఏప్రిల్ 20 సంచికలో ప్రకటించింది. ఆ ప్రకటనలోని సారాంశం పీవీ గూర్చి ఇలా ఉంది అని చెబుతారు. "రాజీవ్ గాంధీ తర్వాత ప్రధాని అర్హత ఉన్న పరిపూర్ణ వ్యక్తి పీవీ నే అని."

ప్రపంచంలోని ప్రసిద్ధ వ్యక్తులు ప్రధాని పీవీ గూర్చి –"ప్రపంచ ప్రధానుల్లో చర్చిల్ తో సమానమైన వాడు అంతటి సమర్థత కలిగిన వాడుగా చెప్తారు" ..

దేశంలో సాధించిన విజయాల వల్ల పీవీ పొందిన అంతర్జాతీయ కీర్తి కూడా ఉంది.

పంజాబ్లో అట్టుడికిన ఉగ్రవాదాన్ని సమూలంగా ఏరివేసి ఎన్నికల నిర్వహించగలిగినారు.

ఇక రెండవది ఎల్టీటీఈ ని భారత్ సరిహద్దుల అవతలి వైపు ఉండేట్టుగా కట్టడి చేయగలిగారు.

మూడవ అంశం కాశ్మీర్ సమస్య పట్ల నిబద్ధతతో కృషిచేసి పరిష్కారం దిశగా అడుగులు వేయగలిగినాడు.

ఇలాంటి అనేక విషయాలను అంతర్జాతీయ సమాజం క్షుణ్ణంగా పరిశీలించింది. పి.వి.ని కొనియాడింది. అంటే దేశ ప్రతిష్ట పెరిగింది. భారతదేశం పీవీ హయాంలో సగౌరవంగా తలఎత్తి నిలువ కలిగింది. ఆనాటినుండి భారతీయ కీర్తి పతాక రెపరెపలాడుతూనే ఉంది.

మనం మొదట శ్లోకంలో చెప్పుకున్నట్టు ఎవరికి ఎవరు శత్రువు కారు. ఎవరికి ఎవరు మిత్రులు కాదు. లోక వ్యవహారాన్ని బట్టి మిత్రుత్వాలు, శత్రుత్వాలు బలపడుతూ ఉంటాయి. బలహీన పడుతుంటాయి. ఈ సారాంశం బాగా ఎరిగిన వ్యక్తి కాబట్టి తన దూరదృష్టితో దేశాన్ని ముందుకు నడప గలిగాడు. అంతర్జాతీయంగా విశేషంగా కీర్తిని పొందగలిగాడు.

**"మనీషిణ స్సంతి నా హితైషిణో**
**హితైషిణ స్సంతి నా తే మనీషిణః ।**
**సుహృచ్ఛ విద్యా నపి దుర్లభో నృణాం**
**యథౌషధం స్వాదు హితం చ దుర్లభం ॥"**

దీంట్లో చెప్పినట్లు మనకు తీయనైనది, పథ్యమైనది అయిన దుర్లభమైన ఔషధం దేశానికి లభించింది. ఆయన పండితుడు, హితైషి కాబట్టే దేశం సౌభాగ్యాన్ని పొందగలిగింది. అలా దేశ సౌభాగ్యాన్ని అంతర్జాతీయంగా ఇనుమడింపజేశారు. అదే దేశం పొందిన భాతి . పి.వి. పొందిన ఖ్యాతి.


## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/–**

# చావు నడచిన తొవ్వ

వాళ్ళు ఇల్లిడిసి ఎన్నొద్దులైందో!
ఎవరి ఉసురు పోసుకుంటిరో!
పాదాల కింది నేలని
వెనక్కి తొక్కుతూ,
నిర్దాక్షిణ్యంగా
ఇప్పుడు
ఈ దేశం నిండా
శాపగ్రస్తులై తిరుగుతున్నారు.
ఆకాశపు screen కింద
అగ్ని కీలల వ్యాపిస్తున్న ఎండ
నడక కంటే ముందే,
పరుగు తీస్తున్న పొడుగు నీడ.
పగళ్ళు రాత్రుళ్లు
నడిచి నడిచి,
పర్రెలిడిచిన ఆ మట్టి పాదాలకు,
సరికొత్త అసహ్యపు పుండ్లు
మొలిచాయిప్పుడు.
పోనూ పోనూ
తల, మొండెం వేరైతయేమోనన్నంతగా
సుదీర్ఘ గాయాల ప్రయాణం.
తిండి గింజల కోసం
దేవులాడుతున్న చీలిపోయిన కండ్లు .
నట్టనడిమికి చీల్చినట్టు
లెక్కలేనాన్ని ఆకలి ముఖాలు.
పసరింకిన అడవి పొద ఎద నీడలా మీద
బొక్కల మీద ఇంచు మాంసం లేని మోకాళ్ల
మధ్య
వరుసగా తలదూర్చి
సేద తీరుతున్న, వలస దేహాలు.
కుంటుతున్న చూపులు
సత్తువ లేని కాళ్జేతులు

పుండు బారిన గుండెల్తో
ఎండిన గడ్డి పరకల పైన
నడిచిన పాద ముద్రలింకా
తడి తడిగానే వున్నాయి
నెత్తురు మరకలతో.....
ఒక్కటే ఘాటు
యెవ్వణ్ణి ముట్టుకున్నా
కడుపు కాలుతున్న వాసన.
డొక్కుపోయిన ఇనపెట్టెల్లా కడుపులు
తోలు లేని అస్థిపంజరాల్లా శరీరాలు.
ఆరబోసిన నిర్మానుష్య చీకట్లో
ఖాళీ ప్లాస్టిక్ గ్లాసుల్లా
దొర్లిపోతుంటారు
High way దారుల వెంట.

కంకర రాళ్లు, పల్లెరు ముళ్ల తొవ్వలో
నెత్తిన గంపనెత్తుకుని
తెగిన రబ్బరు చెప్పుని లాగుతూ,
గుండీలు ఊడిన రయికకు చీర అడ్డం వేస్తూ,
కొంగులో తలవాల్చి, ఏడుస్తూ నడుస్తున్న
అమ్మ కళ్ళని చూస్తూ,
సంకలో సంటోడేడుస్తున్నాడు
గుక్కపెట్టి
ఆకలితో పేగులన్ని ఖాళీ steel గిన్నెలైన్నాయి.
కండ్లల్లో నీళ్లు కాలువలై దూకుతున్నాయి.
కాళ్జేతులు నల్లని బొగ్గు కట్టెలైనాయి .
చిట్లిన అరిపాదాలు ఏవో !
అర్థం కాని కొత్త లిపిని లిఖిస్తున్నాయి .

మండే ఎండలో, ఎండిన నాలుకలతో
నెత్తురు గోళ్ళతో రోడ్డు రోడ్లన్ని
విరమమేరుగాక, తిరిగేస్తే !
శవాలు కాక మరేమవుతారు.

రోడ్డు
ప్రతి రోజు
శవాలు మోసే శిలువవుతుంది
ఈ దేశం గుండెల మీద.

కూలి కోసమే కాలి నడక
నడక ఆపడమంటే
ఆగిపోయినట్టే కదా
జీవితం.

నా దేశమా
నీ శిరస్సు కింద,
కుళ్ళిన మా పీనుగుల్ని
ఒకదాని మీద మరొకటి పేర్చి
తలగడ నిర్మించుకో ?
లేదంటే
మా
సామూహిక శవాల మీద,
దోసెడు మట్టేసి పో...





డి. ప్రకాశ్
ఫోన్ : 9666675098

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం - 13

# ఓ సీత కథ

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

ఈ చిత్రం 1975 వ సంవత్సరంలో విడుదలైంది. నిడివి రెండున్నర గంటలు. తర్వాత కాలంలో తమిళం, మళయాళ భాషల్లో కూడా నిర్మించబడింది. 1975 కాలంలో వచ్చిన ఈ చిత్ర కథాంశం నాటి పరిస్థితుల దృష్ట్యా చూసినప్పుడు సంచలనాత్మకమైన కథాంశమే.

కథలోకి వెళ్తే సీత (రోజా రమణి), సావిత్రి లు అక్కాచెల్లెళ్ళు. వీరి తల్లి పార్వతమ్మ (పండరీ బాయి). పార్వతమ్మ భర్త మరణించడం వల్ల కుటుంబం అంతా కష్టాల్లో కూరుకుపోయి వుంటుంది. చిత్ర ప్రారంభం పార్వతమ్మ పెద్ద కూతురు సావిత్రి ఒక గుడిలో హరికథ చెప్తూ వుండే సన్నివేశంతో ప్రారంభం అవుతుంది. కుటుంబం గడవడానికి సావిత్రి పలుచోట్ల హరికథలు చెప్తూ తల్లికి చేదోడువాదోడుగా వుంటుంది. ఇక చిన్న కూతురైన సీత ఒక ఆఫీసులో టైపిస్టుగా పనిచేస్తూ వుంటుంది. ఆఫీసులో సీతకు సహాయంగా వుంటూ ఆమెకు బాసటగా వుండే యువకుడు చంద్రం (చంద్రమోహన్). చంద్రం సీతకు మేన బావ అనగా పార్వతమ్మకు స్వయానా అల్లుడు. చంద్రం తల్లిదండ్రులు లేనివాడైనా తన అత్తగారైన పార్వతమ్మ ఇంటికి ఏ మాత్రం వెళ్ళకుండా దూరంగా వుంటూ సీతతో మాత్రం చనువుగా వుంటాడు. అల్లుడి వరసైన చంద్రం అదే వూరిలో వుంటున్నప్పటికీ పార్వతమ్మ ఏనాడూ అతడిని చేరదీయదు. కారణం ఆమెకు చంద్రం తండ్రితో గతంలో అయిన గొడవలు. చంద్రం మందేశ్వరరావు (అల్లు రామలింగయ్య) వద్ద పనిచేస్తూ అతడి ఆఫీసు కార్యకలాపాలు పర్యవేక్షిస్తూ వుంటాడు. మందేశ్వరరావు కళ్ళు కనిపించకపోయినా ఆ విషయాన్ని తన భార్య మరియు ఆఫీసులోని ఉద్యోగస్తుల ముందు తెలియనీయకుండా వుండేందుకు జాగ్రత్త పడుతూ వుంటాడు. అంతేకాక ఆయన వట్టి పిసినారి. డబ్బులపై విపరీతమైన ఆశ కలవాడు. మందేశ్వర రావు కుమారుడు మాధవరావు. మాధవరావు తన తండ్రి గుణగణాలకు వ్యతిరేకమైన వ్యక్తిత్వం కలవాడు. చంద్రానికి మాధవరావు మంచి స్నేహితుడు.

ఐశ్వర్యవంతుడు, పెద్ద పెద్ద వ్యాపారాలు కల్గిన వ్యక్తి కాంతారావు. కాంతారావు భార్యను కోల్పోయి ఒంటరి జీవితాన్ని గడుపుతూ వుంటాడు. కాంతారావుకు మందేశ్వర రావు మంచి స్నేహితుడు. ఇద్దరూ వేర్వేరు నగరాల్లో వుంటున్నప్పటికీ ఇద్దరి మధ్య చక్కటి స్నేహబంధం వుంటుంది. ఇక కాంతారావు పెద్ద కుమారుడు గోపాలకృష్ణ (దేవదాస్ కనకాల). అతడు తండ్రికి దూరంగా వుంటూ విద్యను అభ్యసిస్తూ వుంటాడు. గోపాలకృష్ణ తండ్రి ముందు మంచి కుర్రాడిగా వ్యవహరిస్తూ తాను చదువుకునే చోట మాత్రం చెడ్డ అలవాట్లతో జీవిస్తూ వుంటాడు. ఒక్కమాటలో చెప్పాలంటే తాగడానికి,



అమ్మాయిలను వాడుకోవడానికి ఎంతటి అఘాయిత్యానికైనా తెగబడే మొండివైఖరి కల్గిన వ్యక్తి. కాంతారావుకు గోపాలకృష్ణతో పాటు మరో ముగ్గురు పిల్లల సంతానం వుంటుంది. ఆ పిల్లలు విపరీతమైన తుంటరి పిల్లలు. కాంతారావు ఇంట్లో లేని సమయంలో ఇల్లు పీకి పందిరి వేసే వైఖరి కల్గిన వాళ్ళు. ఒకానొక దశలో కాంతారావు ఆ పిల్లల వైఖరి పట్ల విసుగు చెందిపోతాడు.

పార్వతమ్మ తన కూతుళ్ళిద్దరితో కలిసి సాక్షి రంగారావు ఇంట్లో అద్దెకు వుంటుంది. సాక్షి రంగారావు కుమార్తె సుందరి (రమాప్రభ). సాక్షి రంగారావు సంగీతం నేర్పే గురువుగా వున్నప్పటికీ ఆయన పాత్ర పూర్తిగా హాస్యం రేకెత్తించేదిగా వుంటుంది. సుందరి వయసు రీత్యా పెద్దదే అయినా మానసికంగా ఎదుగుదల లేని చిన్న పిల్ల స్వభావం కలది. సుందరి సావిత్రి దగ్గర నృత్యం, సంగీతం నేర్చుకుంటూ వుంటుంది. ఒకరోజు సీతను గోపాలకృష్ణ రోడ్డుపై చూసి అందరి అమ్మాయిల విషయంలో ఆలోచించినట్లుగానే ఆమెను కూడా ఎలాగైనా పొందాలని నిర్ణయించుకుంటాడు. ఒకరోజు తన బావ అయిన చంద్రం కోసం సినిమా థియేటర్ వద్ద వేచి వున్న సీతను గోపాలకృష్ణ తన తుంటరి స్వభావంతో మాట్లాడించే ప్రయత్నం చేసినప్పుడు అతడిని ఎదిరిస్తూ బిరుసుగా మాట్లాడ్తుంది. అప్పుడే అక్కడికి చేరుకున్న చంద్రంకు విషయం వివరిస్తుంది. గోపాలకృష్ణ యాదృచ్ఛికంగా సాక్షి రంగారావు ఇంట్లో అద్దెకు దిగుతాడు. అదే సమయంలో అక్కడే అద్దెకు వుంటున్న సీతను చూసి గోపాలకృష్ణ సరైన చోటకే అద్దెకు దిగానని అనుకుంటాడు. అతడికి తోడు అతడి స్నేహితుడు కూడా అదే స్వభావాన్ని కల్గినవాడై అతడు చేసే ప్రతి చెడ్డపనిని సమర్థిస్తూ వుంటాడు. అద్దె విషయంలోనూ యజమాని

కూతురైన సుందరి విషయంలోను సాక్షి రంగారావుకు గోపాలకృష్ణ తలనొప్పిగా మారతాడు. అంతేకాక సీతను తన కామపూరిత మాటలతో, చూపులతో ఇబ్బంది పెడ్తూ వుంటాడు. ఆ విషయం తెలిసి చంద్రం గోపాలకృష్ణతో గొడవ పడతాడు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకొని గోపాలకృష్ణ చంద్రంపై ఎలాగైనా పగ తీర్చుకోవాలని నిర్ణయించుకొంటాడు.

ఒకరోజు కాంతారావు ఇంటికి చిన్నపని నిమిత్తం వస్తాడు మందేశ్వర రావు. ఆ సమయంలో కాంతారావు ఇంట్లో వున్న కాంతారావు పిల్లల ఆకతాయి చేష్టలను చూసి ఆ పిల్లలను సక్రమ మార్గంలో పెట్టాలంటే వారికి తల్లి ప్రేమ, పెంపకమే సరైన మార్గం అని కాంతారావుకు సలహా ఇస్తాడు. కాని కాంతారావు మందేశ్వర రావు సలహాను తోసిపుచ్చుతాడు. మరోవైపు ఎలాగైనా సీతను అనుభవించాలని విఫల యత్నాలు చేస్తూ అసహనానికి గురవుతూ వున్న గోపాలకృష్ణ గదిలోకి సుందరి అమాయకంగా, అనుకోకుండా వెళ్తుంది. ఆమె అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని గోపాలకృష్ణ తీయటి మాటలు చెప్పి ఆమెను శారీరకంగా అనుభవిస్తాడు. మరుసటి రోజు సుందరి ప్రవర్తన, మాటలు ద్వారా సీత, సావిత్రిలు గోపాలకృష్ణ సుందరికి చేసిన అన్యాయాన్ని పసిగడతారు. మరోవైపు మందేశ్వర రావు కుమారుడైన మాధవరావుతో స్నేహపూరిత అనుబంధాన్ని కల్గిన చంద్రం మాటల్లో మాటగా మాధవరావుతో వివాహ ప్రస్తావన తెస్తాడు. ఆ సమయంలో మాధవరావుకు సావిత్రిని గూర్చి తెలియజేస్తాడు చంద్రం. ఆస్తి అంతస్తులు లేకపోయినా సావిత్రిని వివాహం చేసుకోవడానికి అంగీకరిస్తాడు మాధవరావు. కాని అసలు సమస్య తమ వివాహానికి తన తండ్రి మందేశ్వరరావు అంగీకరించేలా చేయడం. తండ్రితో మాధవరావు తన వివాహ ప్రస్తావన తెచ్చినప్పుడు ఆ హరికథలు చెప్పుకునే అమ్మాయితో నీ వివాహానికి నేను ఒప్పుకోను అంటూ తేల్చి చెప్పేస్తాడు.

మరోవైపు గోపాలకృష్ణ కక్ష్య సాధింపులో భాగంగా చంద్రంపై దాడి చేయిస్తాడు. కాని ఆ దాడిలో చంద్రం మరణిస్తాడు. చంద్రం చావు తన పైకి రాకుండా గోపాలకృష్ణ పథకం వేస్తాడు. చంద్రం కొన్ని రోజులుగా కనబడకపోవడంతో సీత అయోమయానికి లోనవుతుంది. ఒకరోజు పోలీసులు వచ్చి సీత వద్ద చంద్రం గూర్చి చెప్తూ చంద్రం రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి వద్ద ఒక చీటీ దొరికింది. ఆ చీటీలో సీత అనే నువ్వు ప్రేమ పేరుతో అతడిని మోసం చేసి మరోవ్యక్తి తో సంబంధం పెట్టుకోవడమే కారణం అంటూ రాసివుందని చెప్తారు. ఆ విషయం తెలిసి చుట్టూ ఉన్న వారు సీత కుటుంబాన్ని పరువు లేని బజారు కుటుంబంగా చీదరింపుతో చూడడం మొదలెడతారు. కాని జరిగిన దురదృష్ట సంఘటనలన్నింటికీ కారణం గోపాలకృష్ణయే సూత్రధారి అని సీత గ్రహిస్తుంది. సీత కుటుంబ పరిస్థితి అంతకంతకూ కష్టాల్లో కూరుకు పోతుంది. ఒకానొక దశలో ఆ కుటుంబానికి ఆత్మహత్యయే శరణ్యం అనే స్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో సీత ఒక పేపర్లో ప్రకటన చూస్తుంది. ఆ ప్రకటన సారాంశం ఒక వయసు మళ్ళిన వ్యక్తి తనతో వివాహానికి అమ్మాయిని వెతుకుతున్న విషయం. ఆ విషయం తెలుసుకుని సీత ఆ పెద్దాయన అడ్రస్‌కు తన ఫోటో పంపిస్తూ తన కుటుంబ పరిస్థితి కూడా తెలియజేస్తూ లేఖ పంపుతుంది. ఆ విషయం తెలిసి పెద్దాయన సీత ఇంటికి వెళ్తాడు. ఆమెను వివాహర్థం కాదు కాని వారి కుటుంబానికి అండగా వుండాలనే ప్రయత్నంలో భాగంగా వచ్చినట్లు చెప్పి వారిని తనతో పాటు ఇంటికి తీసుకెళ్తాడు. సీత ఇంటికి వచ్చిన ఆ పెద్దాయనే కాంతారావు. సీత ఆమె కుటుంబంతో కాంతారావు ఇంటికి వెళ్ళిన తక్కువ సమయంలోనే ఆ ఇంట్లో వున్న తుంటరి పిల్లలను దారిలోకి తెస్తుంది. సీత గుణగణాలను మెచ్చిన కాంతారావు ఆమెతో తన కుమారుడిని వివాహం చేసుకొమ్మంటూ ప్రతిపాదన చేస్తాడు. ఆ ప్రతిపాదన తెచ్చిన కొన్నాళ్ళకే కాంతారావు కుమారుడు గోపాలకృష్ణ చదువు పూర్తి చేసుకుని ఇంటికి వస్తాడు. తన కుమారుడితో వివాహ విషయం చెప్తాడు. గోపాలకృష్ణ తాను చేసుకోబోయే అమ్మాయి సీతనే అని తెలిసి ఆమెను పొందాలనే తన పంతం నెగ్గబోతోందని సంబర పడతాడు. ఒకరోజు ఇంట్లోని సభ్యులందరూ బయటకు వెళ్ళిన సమయంలో సీతను బలాత్కరించబోతాడు గోపాలకృష్ణ. ఆ సన్నివేశం తర్వాత సీత అతడి నుండి తప్పించుకోవాలంటే, తనను తాను రక్షించుకోవాలంటే గోపాలకృష్ణ తండ్రి అయిన కాంతారావును వివాహం చేసుకోవడమే సరైందని నిర్ణయించుకుంటుంది. దానిలో భాగంగా కాంతారావు కాళ్ళపై పడి తనను వివాహం చేసుకొమ్మంటూ ప్రాధేయపడ్తుంది. తప్పని పరిస్థితిలో కాంతారావు సీతను వివాహం చేసుకుంటాడు. ఆ సంఘటనతో ఒక్కసారిగా సీత గోపాలకృష్ణకు ఆమెను అమ్మగా పిలిచే పరిస్థితి కల్గజేస్తుంది. సీత నిర్ణయానికి, సీత చేసిన పనికి నోరెళ్ళబెడతాడు గోపాలకృష్ణ. అయినా కొన్నిసార్లు తప్పుగా మాట్లాడిన గోపాలకృష్ణకు సీత గట్టిగా తన మాటలతో బుద్ధి చెప్తుంది. కాని గోపాలకృష్ణ బుద్ధి మారకపోగా మరింత అసహనంతో కాలం వెళ్ళదీస్తుంటాడు.

సీతకు ఒకరోజు సుందరి తారసపడ్తుంది. సుందరి గోపాలకృష్ణ వల్ల మోసపోయి గర్భం దాల్చిందని తెలిసి ఆమె కుటుంబం సమాజంలో పరువు చంపుకొని జీవించలేక సతమతమవుతున్నారనే విషయం అర్థంచేసుకుంటుంది. సుందరిని తను వివాహం చేసుకున్న కాంతారావు ఇంటికి తీసుకెళ్తుంది. తల్లి స్థానంలో ఉన్న సీత గోపాలకృష్ణ ఇంట్లో వుండగా ఆ ఇంటికి సుందరిని తీసుకురావడం చూసి భయపడిపోతాడు. సుందరిని ఇంటికి తెచ్చి గోపాలకృష్ణకు బుద్ధి చెప్పాలనుకున్న సీత ఆమె సాహసోపేత నిర్ణయాలతో తన యవ్వనాన్ని, సౌఖ్యాన్ని త్యాగం చెయ్యడానికి కూడా సిద్ధపడుతుంది.

ఆమె నిర్ణయాల వల్ల సీత తనను, తన కుటుంబాన్ని కష్టాల్లో నుండి బయటపడేలా చేస్తుంది. కాంతారావు భార్య సీతతో కలిసి సీత అక్క అయిన సావిత్రి వివాహ విషయమై మందేశ్వరరావును కలిసి మాధవరావుతో ఆమె వివాహం గూర్చి చర్చిస్తాడు. మందేశ్వర రావు ఇంటికి కాంతారావు సీతను వివాహం చేసుకుని ఆయన తరపున సీత అక్క సావిత్రి వివాహం గూర్చి మాట్లాడడానికి వచ్చాడని తెలిసి అయోమయానికి, ఆశ్చర్యానికి లోనవుతాడు. నోరెత్తకుండా సావిత్రితో తన కుమారుడి వివాహానికి అంగీకరిస్తాడు మందేశ్వర రావు.

మరోవైపు చంద్రంను చంపినందుకు సుమోటో కింద డబ్బులు పెద్ద మొత్తంలో ఇస్తానని చెప్పి మోసం చేసినందుకు గాను గోపాలకృష్ణను కలిసిన దుండగులు కొంత సమయాన్ని గడువిచ్చి అంతలోగా డబ్బులు ముట్టజెప్పాలని హెచ్చరిస్తారు. కాని వారికి ఇవ్వాల్సిన డబ్బు గోపాలకృష్ణ వద్ద లేకపోవడంతో అతడు నిస్సహాయ స్థితిలో వుండిపోతాడు. ఒకరోజు దుండగులు గోపాలకృష్ణ ను ఎత్తుకెళ్లి చావబాది పట్టాలపై పడుకోబెడతారు. సీత పోలీసులను తీసుకెళ్లి గోపాలకృష్ణను రక్షిస్తుంది. గోపాలకృష్ణ ప్రాణాలను కాపాడిన సీతను ఆ క్షణం నుండి తల్లిగా భావిస్తాడు. తన తప్పును తెలుసుకొని ఆమెతో తనను క్షమించమంటూ ఆమె పాదాలపై పడి తన తప్పులకు పశ్చాత్తాపం కోరతాడు గోపాలకృష్ణ. ఆ సన్నివేశంతో సినిమా సమాప్తమవుతుంది.

**చిత్ర విశేషాలు :**

వ్యాసం మొదట్లో చెప్పినట్టు సంచలనాత్మకమైన కథాంశం అని చెప్పడానికి పలు కారణాలున్నాయి. నిజానికి మన సమాజాల్లో తరతరాలుగా స్త్రీ ని అశక్తురాలిగా చూడడం, మగాడి చెప్పుచేతల్లో బానిస జీవితం గడపాలనే ధోరణి కలిగి వుండడం, సమాజంలో అణువణువునా పురుషాధిక్యతను ప్రదర్శిస్తూ వుండడం, స్త్రీల నిస్సహాయతను ఆసరాగా చేసుకొని స్త్రీ బలహీనత పై దారుణాలకు పాల్పడడం ప్రతి తరంలోనూ, అన్ని సమాజాల్లోనూ చూస్తూ వున్నదే. తరతరాలుగా ఇలాంటి సమాజాల్లో, ఇలాంటి పరిస్థితుల మధ్య స్త్రీ వివక్షతో కష్టాలు, అవమానాలు, అఘాయిత్యాల పాలవుతూ జీవించాల్సి రావడం మనమంతా సిగ్గుపడాల్సిన విషయం. నేడు పరిస్థితులు కొంత మెరుగైనా నాటి బాల్యవివాహాలు, వితంతు వివాహాలను అంగీకరించలేని సమాజం, దేవదాసీ, జోగిని వ్యవస్థలు, సతీసహగమనం, వరకట్నం, వధువిక్రయాలు, బహుభార్యత్వం మొదలైన అంశాలు మననం చేసుకుంటే నాటి స్త్రీ ఎంత దుర్భరమైన గడ్డురోజులు ఎదుర్కొందో అర్థం చేసుకోవచ్చు.

ఎక్కువ వయస్సు కల్గిన వ్యక్తి డబ్బులిచ్చి యుక్తవయస్సులో వున్న స్త్రీ ని వివాహం చేసుకునే దరిద్రమైన పరిస్థితులు వున్నప్పటికీ ఈ చిత్ర కథాంశంలో సీత పాత్రలో యువతి తనను వంచించ తలచిన యువకుడి బారి నుంచి తనను తాను రక్షించుకోవడానికి,




తన కుటుంబాన్ని పేదరికం నుండి తప్పించడానికి వయస్సును, సౌఖ్యాలను బేఖాతరు చేసి వృద్ధాప్యంలోకి జారుకున్న వ్యక్తిని వివాహం చేసుకోవడానికి సిద్ధపడడం అనేది చిత్ర ప్రధాన కథాంశంగా ఎన్నుకోవడం ఒక విశేషాంశమైతే, ఏ వ్యక్తి తనను వంచించడానికి పూనుకున్నాడో అతడికే తల్లిగా మారడం సంచలనాంశం. అంతేకాక వంచించే స్వభావం కల మగాడికి తగిన బుద్ధి చెప్పి అతడిని సక్రమమైన మార్గంలో బతికేలా గుణపాఠం చెప్పి స్త్రీ శక్తి ఏపాటిదో నిరూపించిన చిత్రం "ఓ సీత కథ".

ఏ సమాజం అయితే స్త్రీ ని చులకనగా చూస్తున్నదో? తరతరాల సమాజపు నియమాలు అనే పేరుతో బంధనాలు విధించి కుటుంబ పోషణకు, భర్త ఆదేశాలకు అనుగుణంగా బతకడం తప్పితే సమాజంలో మరేవిషయంలోనూ తనకు విలువ లేదనే విషయాన్ని తొక్కిపడేస్తూ, స్త్రీ నిర్ణయించుకుంటే ఆది శక్తిలా విజృంభించి దుష్ట శిక్షణ చేయగలదని, అమ్మలా లాలించగలదని, ప్రేయసిలా అమృతమయమైన సుధామృతాన్ని కురిపించగలదని, త్యాగమూర్తికి ప్రతీకగానూ, తెగింపుకు ఏమాత్రం తలొగ్గని వ్యక్తిత్వం కలదిగానూ నిలవగలదని "సీత" పాత్ర ద్వారా చూపారు. అంతేకాక తన జీవితంలో రాముడి లాంటి మనిషి లేకపోయినా నాటి అశోకవనంలో సీత రావణుడి చెరలో పడిన కష్టాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో రావణుడి లాంటి గోపాలకృష్ణ పాత్ర వల్ల కలిగే కష్టాలను

ఎదుర్కొంటూ బలమైన వ్యక్తిత్వం కల్గిన సీతాదేవి పాత్ర స్థాయిలో సీత పాత్ర చిత్రణ వుంటుంది.

చిత్ర కథకు ప్రధాన బలం సీత పాత్ర పోషించిన రోజా రమణి. ఆమె అమాయకమైన, ముగ్ధమనోహరమైన వదనం సీత పాత్ర మూర్తిమత్వాన్ని బలంగా వ్యక్తీకరింస్తుంది. ఆమె ఆహార్యంతో చిత్రంలో వచ్చే ప్రధాన సన్నివేశాల్లో అద్భుతమైన నటన కనబర్చారు. చిత్రం మధ్యలోనే కథానాయకుడి పాత్ర మరణించడం మొదటిసారి చిత్రం చూసే ప్రేక్షకుడికి ఆశ్చర్యాన్ని కల్గజేస్తుంది. కాని చిత్ర నామధేయాన్ని బట్టి చూస్తే చిత్రం అంతా సీత పాత్ర చుట్టూనే కొనసాగుతుంది అనే విషయం రూఢి అవుతుంది. చిత్రంలో ప్రతినాయక పాత్రలో నటించిన దేవదాసు కనకాల పాత్ర చిత్రణ మరియు నటన చిత్రానికి మరో బలం. మనిషిలోని బలహీనమైన ఆలోచనలు, విశృంఖలతతో వ్యవహరించే స్వభావాలు మనిషిని ఏ స్థాయికి దిగజారేలా చేస్తాయి అనేదానికి ఋజువుగా గోపాలకృష్ణ పాత్ర ప్రతీకగా వుంటుంది. బలహీనమైనదే కదా అని పిల్లిని గదిలో వేసి మందలిస్తే అది ఎలా తిరగబడ్తుందో అదే రీతిలో ఆడదే కదా అనే ఆలోచనతో అఘాయిత్యాలకు పాల్పడితే, అది భరించలేని స్త్రీ ఒక్కసారిగా ఎదురుతిరిగితే ఆమె ఎంత శక్తువంతురాలో సీత పాత్ర ఋజువు చేస్తుంది.

ఈ చిత్రానికి సంగీతం కె.వి.మహదేవన్ అందించారు. చిత్రంలో పాటలన్నీ ఆయా సన్నివేశాలను వ్యక్తపరిచే రీతిలో వుంటాయి. కె.విశ్వనాథ్ గారి చిత్రాల్లో సాధారణంగా వుండే ఏదో ఒక పాట మన ఆచారాలు, సాంప్రదాయాలను ప్రేక్షకులకు తెలియజేసే విధంగా వుంటుంది. అలాంటి పాట చిత్ర ప్రారంభంలో సావిత్రి పాత్ర ద్వారా 'భారతనారీమణి' అంటూ సాగే పాట తెలియజేస్తుంది. ఈ పాట హరికథ రూపంలో సాగుతుంది. ఈ చిత్రం మొత్తానికి గొప్ప పాట సుందరిని, సీత తన గృహానికి తీసుకు వచ్చిన తర్వాత గోపాలకృష్ణ సుందరికి చేసిన మోసాన్ని గుర్తు చేస్తూ, అదేవిధంగా సీత పాత్రను కష్టాలకు గురిచేసిన విషయాలను గూర్చి తెలియజేస్తూ సాగే పాట. ఆ పాటే **'నిన్ను కన్న కథ– మీ అమ్మ కథ'**. ఇక సుందరి గోపాలకృష్ణ వల్ల మోసపోయి తాను గర్భం దాల్చాననే విషయం తెలీక అమాయకత్వంతో పులుపు పదార్థాలను తినాలనిపించిన సందర్భంలో వచ్చే పాట **'చింతపులుపు చిగురని'** అంటూ సాగే పాట సుందరి పాత్రపై ప్రేక్షకుడికి జాలి కలిగేలా చేస్తుంది. అదే విధంగా కాంతారావు కుటుంబ సభ్యులందరు బయటకు వెళ్ళిన సందర్భంలో గోపాలకృష్ణ సీతపై తెగబడే సందర్భం కీచకుడు, ద్రౌపదిని వంచించే సందర్భాన్ని గుర్తుకు చేస్తుంది. చంద్రం – సీతల మధ్య ప్రేమాయణంలో **'మల్లెకన్న తెల్లన మా సీత సొగసు'** అంటూ సాగే పాట మధురంగా వుంటుంది. కె.విశ్వనాథ్ – కె.వి మహదేవన్ సారథ్యంలో పాటలు ఎప్పటికీ అద్భుతాలే.

చిత్ర కథా రచయిత గొల్లపూడి మారుతీరావు. చిత్రంలో ప్రధాన సన్నివేశాల్లో వచ్చే మాటలు చిత్రానికి మంచి బలాన్నిస్తాయి. **"ఆడది ప్రేమిస్తే అమృతాన్ని కురిపించగలదు, అదే ఆడది ద్వేషిస్తే విషాన్ని కక్కగలదు"** అనే సారాన్ని తెలిపే డైలాగ్స్ సన్నివేశానికి మరింత శక్తినిస్తాయి. చిత్ర కథ ఎంత బలమైన మలుపులతో కొనసాగుతుందో, దర్శకుడు కె.విశ్వనాథ్ గారు చిత్రం యొక్క కథనాన్ని అదే స్థాయిలో నడిపించారు. దానికి ఉదాహరణ రెండు, మూడు సన్నివేశాల్లో సీత పాత్ర తన స్థాయికి మించిన నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు వాడే ప్రతీకలు, దానికి తోడు గోపాలకృష్ణకు తల్లిగా వచ్చిన సందర్భంలో బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ లో నెమ్మదిగా వినిపించే **'అయిగిరి నందిని'** మ్యూజిక్ ప్రేక్షకుడికి మంచి ఎఫెక్ట్ ను కల్గజేస్తుంది. ఈ చిత్రం తర్వాత కాలంలో మళయాళంలో రీమేక్ అవ్వగా కమల్ హాసన్ గారు గోపాలకృష్ణ పాత్రలో ప్రతినాయక పాత్రను పోషించారు. అదేవిధంగా తమిళంలో రీమేక్ అవ్వగా రజనీకాంత్ గారు కథానాయకుడి పాత్ర పోషించారు. 1975 సంవత్సరానికి గాను ఈ చిత్రానికి ఉత్తమ చిత్రం గా ఫిలింఫేర్ అవార్డు వచ్చింది. కె. విశ్వనాథ్ గారికి డైరెక్టర్ గా ఫిలింఫేర్ అవార్డు వచ్చింది మరియు నంది అవార్డు(సిల్వర్) కూడా వచ్చింది. ఈ చిత్రానికి నేటి ప్రముఖ నిర్మాత అయిన సి.అశ్వనీదత్ గారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు.


**చిత్రం : ఓ సీత కథ**

**తారాగణం : రోజా రమణి , చంద్రమోహన్, దేవదాసు కనకాల, కాంతారావు, అల్లు రామలింగయ్య రమాప్రభ తదితరులు**

**నిర్మాత : ఏ. ఆర్. ఎస్. శర్మ**

**కథ : గొల్లపూడి మారుతీరావు**

**దర్శకత్వం : కె. విశ్వనాథ్**



కీ.శే. బి.ఎన్.శాస్త్రి

# శాసనములలో తెలుగు భాషా పరిణామము

అముద్రిత సిద్ధాంత గ్రంథం

**క్రియలు**

గోలకొండ నవాబుల కాలపు శాసనములందు క్రియలు వాడబడినవి. ఈ కాలపు శాసనములందలి భూత కాల సమాపక క్రియా రూపములు క్రింద నొసంగబడుచున్నవి.

శాసన కంభం దేయించ్చనవధరించ్చిరి... S.i.i Vol x, No.745
దండములు సమపించ్చి ప్రతిష్టశేశెను.. S.i.i Vol x, No.746
ధారవోశియస్తిని... S.i.i Vol x, No.747
దేవగుడ్లు గటించి సుంనపని చేయించెను... S.i.i Vol x, No.749
దేవుళాలు గటించెను.. S.i.i Vol x, No.749
గోపినాథుంణి ప్రతిష్ఠించిరి... S.i.i Vol x, No.749
యదాయదలై పారిపోయిరి... S.i.i Vol x, No.751
లకున్ను ఇస్తిమి... S.i.i Vol x, No.752
మామిండి తోపు వేయించినాను... S.i.i Vol x, No.754
సమప్పణ చేసిరి... S.i.i Vol x, No.755
సాగించెను... S.i.i Vol x, No.755
క్షేత్రం సమపించ్చెను.. S.i.i Vol x, No.756
గరకసా చేస్తున్నారని మూల్కుం చేశిరి... S.i.i Vol x, No.759
హుజూరుకు వచ్చి మాల్కూ చేశిరి... S.i.i Vol x, No.759
ప్రతిష్ఠచేశె... S.i.i Vol x, No.760
అరటితోపు వేయింస్తిమి... S.i.i Vol x, No.763
సమపింస్తిమి... S.i.i Vol x, No.763
చెర్వు తూము తేజుఖాను ఖావందు చారుని గారుకట్టించిరి... S.i.i Vol x, No.763
వాని ఆలిచి చలువాది వానికియిచ్చిరి... S.i.i Vol x, No.765
చావళ్లు గట్టించ్చె... S.i.i Vol x, No.780

గోలకొండ నవాబుల కాలపు శాసనములందు ప్రేరణార్థక సమాపక, అసమాపక క్రియా రూపములు భూత కాలుమన వాడబడినవి.

దుగాలు సాధించ్చి... S.i.i Vol x, No.743
లంగర సాగించ్చి... S.i.i Vol x, No.743
సత్రానకు యిచ్చి... S.i.i Vol x, No.743
మానవవధరించ్చి... S.i.i Vol x, No.743
వేయంచ్చనవ ధరించ్చిరి... S.i.i Vol x, No.745
దోషానంబోవువారు... S.i.i Vol x, No.745
దండములు సమపించ్చి ప్రతిష్ఠ శేశెను... S.i.i Vol x, No.745
ధారవోశియిస్తిని... S.i.i Vol x, No.747
నీవ శాన ఫలవెటించి శావసేసిది... S.i.i Vol x, No.747
సుంన పనిచేయించెను.. S.i.i Vol x, No.747
గోపినాధుణి ప్రతిష్ఠించిరి.... S.i.i Vol x, No.749
దేవుళము కటించి.. S.i.i Vol x, No.749
మాలు వేయించను... S.i.i Vol x, No.749
చలివెందిరిలు వెట్టించెను... S.i.i Vol x, No.753
మామిడి తోంపు వేయించినాను... S.i.i Vol x, No.753
రాగ భోగాలు సాగించ్చి... S.i.i Vol x, No.754
ముకుంద దేవు మహారాజు సాగించెను.. S.i.i Vol x, No.754
ప్రిత్తుల క్షేత్రం సమపించ్చెను... S.i.i Vol x, No.756
నుయిగటించి.. S.i.i Vol x, No.756
కావేరి పాక కట్టించ్చిన.. S.i.i Vol x, No.762
భావందుదారుని గారు కట్టించిరి... S.i.i Vol x, No.762
స్తంభాలు వేయించి.. S.i.i Vol x, No.765
స్తంభాలు తెప్పించి... S.i.i Vol x, No.765

ఈ కాలపు శాసనములందు 'ఇ' చేర్చగా వచ్చు క్త్వార్థక రూపములు ఇవ చేర్చవచ్చు. భూత కాల క్రియాజన్య విశేషణములు కనిపించుచున్నవి.

**భవిష్యద్వర్తమాన కాలములు**

ఈ కాలపు శాసనములందు భవిష్యద్వర్త మాన కాలములకు సంబంధించిన క్రియా రూపములు కనిపించుచున్నవి. తద్ధర్మ రూపము భవిష్యదర్థమును సూచించు స్థలములీ కాలపు శాసనములందున్నవి.

1. యిధమ్మ శాసన కంభంలోని మరియాదయే రాజు దప్పిన తరుక రాజు దప్పినాము సాబుకుందప్పిన దోషాన తమ గురువులు పేరులహత్తె సేసిన దోషానం బోవువారు.... S.i.i Vol x, No.745

2. ఇందు ఎవరంగనక తప్పినాను గంగకత్తగోవు బ్రాహ్మల వధ శేశిన పాపానం బోవువారు.... S.i.i Vol x, No.748

3. యాధమాను యవరరువి ఖాతం చేశినా వారు కాశిలో గంగ్గా తీరమందుగ గోహత్య బ్రాహ్మ భత్య చేశిన పాపాన బోదురు... S.i.i Vol x, No.763

4. ఇందుకు తురకలు తప్పితే పంది మాంసానకు ఆసించ్చిన పాపాన బోదురు శూద్రులు తప్పితే కాశిలో బ్రాహ్మల వధించ్చిన పాపాన బోదురు... S.i.i Vol x, No.769

5. బ్రాహ్మలు స్యూద్రులు తప్పితే పంది మాంసానకు ఆసించ్చిన పాపాన బోదురు. తురక వారు తప్పితే పంది మాసానకు ఆశించ్చిన పాపాన బోదరు... S.i.i Vol x, No.771

6. యధ....... కదు తపితే (పంది) తిన్నట్లు కనటక తపిది గోవు గుంపినటు... S.i.i Vol x, No.781

7. యందు కుంగనక యెవ్వరు తప్పినాను గంగకత్తను గోవు బ్రాహ్మనిని వధ చేసిన పాపాన బోవువారు.. S.i.i Vol x, No.711

**సంధి**

గోలకొండ నవాబుల కాలపు శాసనములందు సంధి చేయబడిన చోట్లును, విసంధిగా వ్రాయబడిన చోట్లును, యడాగమము వచ్చిన చోట్లును, కనిపించుచున్నది.

పదాంతమున నున్న హల్లును, పరమ పదము తొలుతనున్న అచ్చుతో కలుపకుండ విడివిడిగా వ్రాసిన వాక్యములు కొన్నిచోట్ల నున్నవి.

నడచ్చుకొనువారు ఇందు్క... S.i.i Vol x, No.748
శలవు ఇచ్చి... S.i.i Vol x, No.751
నామ జాదు అంప్పితేను.. S.i.i Vol x, No.753
దేవేంద్రుదున్న అయిన.. S.i.i Vol x, No.769
కాంలు ఇచ్చిన వివరం... S.i.i Vol x, No.769

ధాన్య ధనవందములు ఆచంద్రాకముగా... S.i.i Vol x, No.769
పాపాన బోదురు ఇటని... S.i.i Vol x, No.770

ఈ కాలపు శాసనములలో కొన్ని పదములు అచ్చును హల్లుతో కలిపి వ్రాబయడకుండుటయే గాక 'య' డాగమము వచ్చిన చోట్లును కనిపించుచున్నది.

నవధరించ్చిరి యధమ్మ శాసనరంభం... S.i.i Vol x, No.745
లెఖను యిందుకు... S.i.i Vol x, No.748
గోపాల భట్లు వారికియిచ్చిన... S.i.i Vol x, No.781
శెలవు యిచ్చెను.. S.i.i Vol x, No.757
శలవు యిచ్చినా... S.i.i Vol x, No.758
ప్రజలకు యిచ్చిన కవులు... S.i.i Vol x, No.759
చలువాది వానికి యిచ్చిరి... S.i.i Vol x, No.770

**సంధి పాటింపబడిన చోట్లు**

కంభం వేయించ్చుమని... S.i.i Vol x, No.45
వేయించ్చన వధరిచ్చిరి... S.i.i Vol x, No.746
పంప్పనవ ధరిస్తేను... S.i.i Vol x, No.753
యజుశాఖాధ్యాయులైన... S.i.i Vol x, No.757
యెకలాస ఖానపురమని... S.i.i Vol x, No.759
గమికాండ్లు మొదలైన... S.i.i Vol x, No.759
చేస్తున్నారని... S.i.i Vol x, No.759
చేసినంద్కు.. S.i.i Vol x, No.767
శాసన స్తంభం క్రమమెట్లున్నను... S.i.i Vol x, No.781

గోలకొండ నవాబుల కాలపు శాసనములందలి వాక్యములలో కొన్నిటి యందు సమాపక క్రియల్లేవు. అట్టివాని యందు భూత తద్ధర్మ క్రియాజన్య విశేషణములతో గూడిన విశేష్యములతోను, తచ్ఛ్బాను ప్రయోగములతోను కూడిన భూత తద్ధర్మ క్రియాజన్య విశేషములతోను అర్థము సూచించపబడుచున్నది.

భూతకాల క్రియాజన్య విశేషముతో గూడిన విశేష్యము.

కావేరి పాక కట్టించ్చిన.. S.i.i Vol x, No.762
చేకొనవనవ ధరించ్చిన... S.i.i Vol x, No.745
బ్రాహ్మణి జంప్పిన.. S.i.i Vol x, No.745
వేయించ్చిన.. S.i.i Vol x, No.753
దున్ని పండించ్చిన నానాధాన్యమున్ను... S.i.i Vol x, No.753

# మూసీ పదవినోదం - 29

## సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 అ | 2 త | 5 ల | కు | 11 త | 14 ల | 15 ము | 17 గా |
| 3 ల | గా | య | తు | X | 16 య | న | ము |
| 4 క | దా | కా | రు | 12 డు | X | 18 గె | ల |
| ల | X | డు | X | ము | 19 సా | కా | వా |
| 7 కొ | 8 న | X | 13 స్వా | X | మే | య | రు |
| 6 లి | కు | 10 చ | ము | X | ను | X | ట |
| 9 క్రి | ల | కి | ల | ప | లు | 20 కు | X |
| X | 10 ము | తం | గి | X | X | 21 శ | ల |

# తెలంగాణ కథ - పరామర్శ

**స్వప్న భువకర్,** తెలుగు ఉపన్యాసకులు, ఫోన్ : **9490 235 017**

కథ మనకు కొత్తదేం కాదు. చిన్నప్పటి నుండీ రాజుల కథలు, కాశీమజిలీ కథలు, కిన్నెర కథలు వంటి ఎన్నో రకాల కథలు వింటూ పెరిగిన వాళ్ళమే మనమంతా. ఇవి మౌఖిక ప్రచారం ప్రధానంగా గల కథలుగా చెప్పవచ్చు. ఆధునిక తెలుగుకథ లిఖిత సంప్రదాయానికి సంబంధించినది. ఈ కథలకు శ్రోతలు కాకుండా పాఠకులుంటారు. జానపద కథల్లోలాగ అవాస్తవిక సంఘటనలు, సన్నివేశాలు వీటిలో కనబడవు. ఇది పూర్తిగా వాస్తవిక జీవితాన్ని చిత్రించే ఆధునిక ప్రక్రియగా చెప్పవచ్చు. ఆధునిక తెలుగుకథా సాహిత్యంలో తెలంగాణ కథకు ఒక విశిష్ట స్థానముంది. పోరాటాల పురిటిగడ్డ అయిన తెలంగాణలో తన అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి ఇక్కడి కథాసాహిత్యం కూడా ఎంతో పోరాటం చేసింది. ఆ పోరాటానికి ప్రతిబింబంగా నిలిచే పుస్తకమే 'తెలంగాణ కథ – పరామర్శ'. రచయిత డా॥ బన్న అయిలయ్య.

'తెలంగాణ కథా వికాసం', 'తెలంగాణ సమకాలీన కథ – వస్తు, శిల్ప విశిష్టత' పేర్లతో చేసిన రెండు ప్రసంగ వ్యాసాలకు శాశ్వతత్వం కల్పించేందుకు వ్యాసకర్త చేసిన ప్రయత్నమే ఈ పుస్తకం. 2017 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో ఈ పుస్తకం ఆవిష్కరించబడింది. ఇందులో 1901 నుండి 2015 వరకు వచ్చిన తెలంగాణ కథా సాహిత్యానికి సంబంధించిన అనేక కథలను గురించి వివరించబడింది. తెలంగాణ కథాసాహిత్యంపై పరిశోధన జరుపుతున్న, జరుపబోయే పరిశోధక విద్యార్థులకు కరదీపిక లాంటి పుస్తకమిది.

ఈ గ్రంథంలోని మొదటి వ్యాసం 'తెలంగాణ కథా వికాసం'. ఇందులో కథానిక పుట్టుపూర్వోత్తరాల్ని విశ్లేషించడం జరిగింది. ప్రపంచ కథాసాహిత్యానికి ఆద్యబ్రహ్మగా కొనియాడబడుతున్న గుణాఢ్యుడు తెలుగువాడని, అందులోను తెలంగాణ ప్రాంతానికి చెందినవాడని వ్యాసకర్త చారిత్రక ఆధారాలతో నిరూపించే ప్రయత్నం చేశారు. ఎన్నో విశిష్టతలున్న తెలంగాణ ప్రాంతం ప్రాచీన కథాసాహిత్యానికి వేదికగా నిలిచిందనే విషయం ఎంతో హర్షణీయం.

ఆధునిక తెలుగుకథపై ఆంగ్లసాహిత్య ప్రభావం ఉందనే విషయం అందరూ సమ్మతించినదే కానీ, తెలంగాణ కథ విషయాని కొస్తే ఇక్కడి కథలపై ఉర్దూ సాహిత్య ప్రభావం ఉందనే విషయం ఉటంకించడంతో ఈ దిశగా పరిశోధనలకు దారివేసే ప్రయత్నం చేశారు వ్యాసకర్త.

తెలుగు సాహిత్యంలో తొలి కథ ఏది? అన్న వాదాన్ని ఈ వ్యాసంలో చర్చిస్తూ భండారు అచ్చమాంబ రాసిన 'ప్రేమా పరీక్షణము' తొలికథగా నిలుస్తుందని వివరించారు. 1901 వ సంవత్సరంలోనే తెలంగాణ ఆడబిడ్డ అచ్చమాంబతోనే తెలుగు కథావికాసం ఆరంభమయ్యిందనే విషయానికి పునర్బలనం చేకూర్చారు.

1910 దశకంలో ఆంధ్రప్రాంతంలోని గురజాడతో సమానంగా తెలంగాణలో కథారచన చేసిన వారిలో ముఖ్యుడైన మాడపాటి హనుమంతరావు కథాసాహిత్యాన్ని ఈ వ్యాసంలో పరిచయం చేసారు. వీరి కథల్లో సంఘ సంస్కరణ దృష్టి తొణికిసలాడడానికి గల కారణాలను కూడ విశ్లేషణాత్మకంగా తెలియజేశారు. తెలంగాణ కథలు ఏదో ఊసుపోక రాసిన కథలు కావు, ప్రతీ కథలో ఒక సంఘర్షణ, ఏదో ఒక సందేశం నింపుకున్నవని నిరూపించే ప్రయత్నం చేశారు.

1920 దశకంలో రాయబడిన కథలు కూడా సంఘసంస్కరణ దృష్టితో రాయబడినవే అని తెలియజేస్తూ ఈ కాలంనాటి తెలంగాణ కథా రచయితలను, వారి కథలను ఉదహరించారు. ఈ కథలు సామాన్య ప్రజలవరకు చేరడానికి ఆనాటి పత్రికలైన తెనుగు, గోలకొండ, నీలగిరి పత్రికల కృషిని కూడ తెలియజేశారు.

1930 దశకంలో తెలంగాణ కథానిక మరింత చైతన్యవంతం అవడానికి కృషిచేసిన కథకుల గురించి చర్చిస్తూ, ముఖ్యంగా సురవరం ప్రతాపరెడ్డి కథల్ని చర్చిస్తూ, సురవరం కథలు ఆనాటి తెలంగాణ ప్రాంత గ్రామీణ జీవితం, ప్రజల అమాయకత్వం, అధికారుల అవినీతి వంటి అంశాలతో వచ్చినవిగా చెప్పుకొచ్చారు. ఈ దశకంలో స్త్రీ సమస్యలపై కథలు రాసిన యల్లాప్రగడ సీతాకుమారి కథలను కూడ పేర్కొన్నారు. తెలంగాణ మాండలికంలో వచ్చిన తొలికథ 'గరీబోణ్ణి' (బి. సీతారామారావు) కథను గుర్తుకు చేశారు.

1940 దశకంలో దేశమంతా స్వాతంత్ర్యోద్యమ జ్వాలలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో, నైజాం ఆధీనంలో ఉన్న తెలంగాణ పరిస్థితిని నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ప్రజోద్యమాల గురించి తెలియజేస్తూ ఆనాటి చరిత్రను కళ్ళకు కట్టారు వ్యాసకర్త. కాళోజీ, నెల్లూరి కేశవస్వామి, వట్టికోట, భాస్కరభట్ల, పొట్లపల్లి రామారావు వంటి తెలంగాణ కథా రచయితల కథల్లో ఆనాటి తెలంగాణ పరిస్థితులు ప్రతిబింబించిన విషయాన్ని తేటపరచారు. భారతదేశానికి ప్రధానమంత్రిగా పనిచేసిన తెలంగాణ ముద్దుబిడ్డ పి.వి. నరసింహారావు గారి 'గొల్లరామవ్వ' కథను గురించి కూడ ప్రస్తావించారు. ఈ కాలంనాటి తెలంగాణ కథల్లో తెలంగాణ రైతాంగ, సాయుధ పోరాటాల స్ఫూర్తి ఏవిధంగా ప్రతిఫలించిందో చర్చించారు. 1950 దశకం తరవాత వచ్చిన కథల్లో సమైక్య ఆంధ్రరాష్ట్రంలో తెలంగాణ సమాజం వివక్షతకు గురైన విధానాన్ని

తెలియజేస్తూ తెలంగాణ కథకులు రాసిన కథలను వ్యాసకర్త ఉదహరించారు.

తెలంగాణ కథపై ఉన్న అనుమానాలు నివృత్తిచేస్తూ ముదిగంటి సుజాతరెడ్డి వెలువరించిన తెలంగాణ తొలితరం కథలు, సంగిశెట్టి శ్రీనివాస్ 'దస్త్రమ్' (తెలంగాణ కథలసూచి)లు తెలుగు కథా సాహిత్యానికి తెలంగాణ కథలు అందించిన పుష్టిపై పాఠకులకు అవగాహన కల్పించారు.

1960 దశకంలో తెలంగాణ కథాసాహిత్యం వికాసం అంతగా లేకపోవడానికి గల కారణాలు విశ్లేషిస్తూ ఆయా కథలు పుస్తక రూపేణ వెలువడకపోవడం, పత్రికల్లో అచ్చయిన కొన్ని కథల అస్తిత్వానికి గుర్తింపు లేకుండా పోయిందని దస్త్రమ్ ముందుమాటలో చెప్పబడిన విషయాన్ని గుర్తుకుచేశారు. ఇక ఈ దశాబ్దంలో మధ్యతరగతి దృష్టికోణంతో రాసిన నందగిరి ఇందిరాదేవి కథలు, ఇల్లిందల సరస్వతీదేవి కథలు, తెలంగాణ పల్లెజీవితాన్ని చిత్రిస్తూ పి. యశోదారెడ్డి రాసిన కథల ప్రస్తావన చేశారు.

1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం, 1970లో నక్సల్బరీ ఉద్యమం, సాయుధ రైతాంగ పోరాటాల వారసత్వానికి కొనసాగింపుగా వచ్చిన నూతన ప్రజాస్వామిక వ్యవసాయ విప్లవాల నేపథ్యంలో వచ్చిన కథల గురించి చర్చిస్తూ, ఈ దశకాన్ని విప్లవోద్యమ నేపథ్యంలో తెలంగాణ బతుకు చిత్రాన్ని నింపుకున్న కథాకాలంగా వ్యాసకర్త అభివర్ణించారు.

1970, 1980 దశాబ్దాలను పోరాటకథలు, విప్లవకథల దశాబ్దాలుగా పేర్కొన్న కాలువ మల్లయ్య అభిప్రాయాన్ని ఏకీభవిస్తూ సోదాహరణలుగా ఎన్నో కథలను ప్రస్తావించారు. 1990–99 దశాబ్ది వందేళ్ళ తెలుగు కథాసాహిత్య చరిత్రలో స్వర్ణయుగమని పేర్కొన్న బి.యస్.రాములు మాటలు నిజమని నిరూపిస్తూ తెలంగాణ కథాసాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ఆణిముత్యాల్లాంటి కథలను పేర్కొన్నారు.

2000 దశకంలో జాతీయ, రాష్ట్రస్థాయిలో జరిగిన రాజకీయ పరిణామాలు, మేథోవలసలు, పట్టణీకరణ, కులవృత్తులు అదృశ్యమవడం వంటి ఇతివృత్తాలతో వచ్చిన కథలు, దళిత మైనారిటీ కథలను పేర్కొన్నారు. ఈ కథలు తెలంగాణ సమకాలీన సామాజిక సమస్యలకు దర్పణాలుగా నిలిచిన విధానాన్ని తెలియజేశారు. 1901–2015 మధ్య కాలంలో వచ్చిన ఎన్నో తెలంగాణ కథలు శతాబ్దం పైచిలుకు తెలంగాణ సామాజిక చరిత్రను తనలో నిక్షిప్తం చేసుకుంటూ, భావితరాలకు ఒక దిక్సూచిగా పనిచేస్తుందని తెలియజేశారు.

ఇక ఈ గ్రంథంలోని రెండవ వ్యాసం 'తెలంగాణ సమకాలీన కథా వస్తు శిల్పాలు'. 2000–2014 మధ్యకాలంలో వచ్చిన కథలు ఏ సామాజిక పరిణామాలను చిత్రించే ప్రయత్నం చేసాయో తెలియజేస్తుంది. ఈ వ్యాసాన్ని వ్యాసకర్త 'సమకాలీన తెలంగాణ కాల్పనిక సాహిత్యం' పేరుతో వరంగల్లులో నిర్వహించిన సదస్సులో సమర్పించారు.

వ్యాస ప్రారంభంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకోసం జరిగిన మలిదశ పోరాటం, ప్రొఫెసర్ జయశంకర్ దిశానిర్దేశం, కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారి నిరాహారదీక్ష, శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటు, సకల జనుల సమ్మె, దాదాపు 1200 మంది వీరుల ప్రాణత్యాగం వంటి ఎన్నో చారిత్రక ఘట్టాల్ని గుర్తుకుచేస్తూనే ప్రపంచీకరణ విధానాలు ప్రజా జీవితాన్ని ఏవిధంగా అతలాకుతలం చేశాయో తెలియజేశారు. సెజ్‌లు, రియల్ ఎస్టేట్ల పేరిట వేలాది ఎకరాల వ్యవసాయ భూములు హారతి కర్పూరంలా మాయమవడం వంటి పరిణామాలను తెలంగాణ కథారచయితలు తమ కథల్లో జొప్పించిన విధానాన్ని వివరించే ప్రయత్నం చేశారు.

పారిశ్రామిక సంక్షోభం, వ్యవసాయరంగ సమస్యలు, వృత్తి కళాకారుల జీవనం, రియల్ ఎస్టేట్ పరిణామాలు, బడుగు కూలీల వెతలు, ఆధిపత్య సంస్కృతి ప్రభావం వంటి అంశాలు కథా వస్తువులుగా వచ్చిన కథల్ని పేర్కొంటూ కొన్నింటిని గురించి చర్చించారు. తెలంగాణ పల్లెల్లో వస్తున్న మార్పును తెలియజేస్తూ గ్రామీణ జీవనం, ప్రకృతి పర్యావరణం, విప్లవోద్యమాల ప్రభావం, గల్ఫ్ వలసలు, మూఢనమ్మకాలు వంటి కథాంశాలు తెలంగాణ కథకుల కథావస్తువులుగా మారిన వైనాన్ని చర్చించారు.

సమకాలీన సమాజంలో స్త్రీ జీవితంలోని వివిధ పార్శ్వాలు కథావస్తువులుగా వచ్చిన కథలు, మైనారిటీలు తమ అస్తిత్వాన్ని నిలుపుకొనేందుకు చేసిన ఉద్యమాల నేపథ్యంలో వచ్చిన కథలు, మానవీయ విలువల గురించి వచ్చిన కథలు, దేశభక్తి మీద, వివిధ సందేశాత్మక అంశాలపై వచ్చిన కథల గురించి ఈ వ్యాసంలో తెలియజేశారు. వ్యక్తిగత అంశాలైన ప్రేమ, దాంపత్య జీవితం, ఉద్యోగ జీవితం వంటి అంశాలు కథావస్తువులుగా వచ్చిన తెలంగాణ కథల ప్రస్తావన జరుపుతూ, కొన్ని కథలపై చక్కని విశ్లేషణ జరిపారు.

కథకు ప్రాణనాడి వంటిదైన కథాశిల్పం గురించి వ్యాసకర్త చర్చిస్తూ సమకాలీన తెలంగాణ కథాశిల్పపు నైపుణ్యాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. కథాశిల్పంలో ముఖ్యాంగాలుగా చెప్పబడే ఎత్తుగడ, కథాకథనం, పాత్రలు, సంభాషణలు, వర్ణనలు, శీర్షికలు, ముగింపు, శైలి వంటి అంశాలపట్ల తెలంగాణ కథారచయితలు చూపిన వైవిధ్యానికి ఉదాహరణలుగా నిలిచే కథలను తీసుకొని చర్చించారు.

వ్యాసకర్త ఈ గ్రంథానికి రాసిన ముందుమాటలో చెప్పుకున్నట్లుగా **'తాను ఏ వ్యాసం రాసినా సాధారణ పాఠకులను, సాహిత్య విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని రాస్తాను'** అన్న వాక్యాలు అక్షర సత్యాలుగా ఈ గ్రంథం చదివాక నిరూపితమయ్యాయి. కథలకు కాణాచి అయిన తెలంగాణ ప్రాంతపు కథాసాహిత్యం నేలవిడిచి సాము ఎప్పుడూ చేయలేదనీ, సమకాలీన అంశాలే కథావస్తువులుగా ముందుకు సాగిందని అవగతమవుతుంది. తెలంగాణ సమాజపు చారిత్రక పరిణామక్రమాన్ని నమోదు చేసిన తెలంగాణ కథలు ఇక్కడి భాషా సంస్కృతులను తనలో కలుపుకొని తెలుగు కథాసాహిత్యాన్ని పరిపుష్టం చేసిందనే విషయం ఈ గ్రంథం ద్వారా మరోమారు ఋజువయ్యింది.

# చిన్న గల్పికలు - గొప్ప ఆలోచనలు

**యడవల్లి శైలజ (ప్రేమ్),** ఫోన్ : **939 417 1299**

మనకు తెలియని విషయాన్ని నాకు తెలియదని నిర్భయంగా ఒప్పుకోవాలి అప్పుడే కదా మన వ్యక్తిత్వం ఏంటో మనం ఎంతవరకు నిజాయితీగా నిలబడగలం అని మన గురించి మనకు తెలిసేది.

“గల్పికలు” అనే పదం నేను వినడం మొదటిసారి సాహిత్య ప్రక్రియల్లో కవితలు, కథలు, వ్యాసాలు, సమీక్ష, విమర్శ, పద్యాలు, నానీలు, తేనీయలు, చిమ్నీలు, చురకలు, మధురిమలు, నవల, పాటలు ఇవన్నీ నేను విని ఉన్నాను. కొన్ని ప్రక్రియలు రాసి ఉన్నాను.

“గల్పికా తరువు” దీనిలో 104 ఒక పేజీ గల్పికలు ఉన్నాయి. దీనిని చదివిన తర్వాత గల్పికల రూపం 'సూక్ష్మంలో మోక్షంలా' చెప్పదలుచుకున్న విషయాన్ని పరోక్షంగా ఒక సంఘటన తీసుకుని వ్యంగ్యరచన చేయడమని, సంక్షిప్తత పాటించడం గల్పికల లక్షణాలు అని తెలుసుకున్నాను.

“గల్పికా కథలు ఒక్కొక్కటి ఒక్కో రకమైన ప్రత్యేకత కలిగివుండడమే కాకుండ సమాజంలోని అసమానతలు, రుగ్మతలను ఎత్తి చూపించాయి”. మనదేశం పారిశ్రామికంగా, రాజకీయంగా ఇంకా వివిధ రంగాల్లో అభివృద్ధి చెందినప్పటికీ, చెందుతున్నప్పటికీ ఇంకా కొన్ని విషయాల్లో వెనకబడే ఉందని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఈ గల్పికలు చదివిన తర్వాత.

'అడ్డుగోడ కథ' చదువుతుంటే దాహంతో మంచినీళ్ళు అడిగి అవమానం ఎదుర్కొన్న మన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ గుర్తుకు రాకపోరు. కులమనే జాడ్యం ఎంత క్రూరమైనదో, దారుణంగా ఈ సమాజాన్ని ఇంకా ఎంత వెనక్కి లాగుతుందో !

ఆడపిల్లని అమ్మగా, సోదరిగా చూసే సమాజం 'చూసే రోజులు కనబడుతున్నాయి ప్రస్తుతం ఇప్పుడు జరుగుతున్న సంఘటనలను చూస్తుంటే ఎన్ని రకాల చట్టాలు వచ్చినా మగవారి ఆలోచనాధోరణి మారడంలేదు. అటువంటి పరిస్థితి ఎదురైనప్పుడు అమ్మగా ఆమె ఎలా ఎదుర్కుందో తెలుస్తుంది 'అమ్మతనం' కథలో. ప్రేమ మత్తులో మోసపోయిన యువతి కథ 'ఆమె కథ'.

'ఉష' నిజంగా ఉషోదయంను నింపింది ఓపికగా ఆ కుటుంబం లోను, ఆ ఊరిలో కూడా కథలో లాగా మద్యం అమ్మకాల వల్ల ప్రభుత్వంకు ఆదాయం వస్తుందేమో కాని మద్యం వల్ల నష్టపోయిన కుటుంబాలు ఎన్నో, విచ్చిన్నమైన ఊరులు ఎన్నో ఒకప్పుడు మద్యపాన నిషేదంపై పోరాటాలు విప్లవంలా పోటెత్తినయి కూడా ఇప్పుడు ఏమయ్యింది ఆ చైతన్యం, ఆ చట్టాలు? మనం ఆలోచించాల్సిన విషయమిది.

ఈ సృష్టిలో పుట్టిన పశుపక్ష్యాదులతో, మొక్కలతో కలిసి మెలిసి జీవిస్తున్నాం మనం వాటికివేటికి లేని స్వార్థం, కోపం, అసూయ, క్రూరత్వం, ద్వేషం మనిషికి మాత్రమే ఉంది. ఆ స్వార్థంతోనే మన చుట్టుపక్కల ఉన్న ఎంతో అమూల్యమైన వృక్ష సంపద, పశు సంపద, సహజ వనరులను అధికంగా వాడుకుని ప్రకృతిని నాశనంచేసి మన వినాశానాన్ని కొని తెచ్చుకున్నామని అర్థం అయ్యేలా “అంతరార్థం” కథ ఉంది.

ఈ ప్రపంచీకరణ మత్తులో మాయమైన మానవ సంబంధాలు, కనుమరుగైన పాత పద్దతులు, సంప్రదాయాలు, సంస్కృతి సంపద, పాత వస్తువులు, మానవత్వం, ప్రేమ, స్నేహం అన్ని కథా వస్తువులుగా ఉన్నాయి. ఈ ప్రతి కథాంశాలు కదిలించేవిగా ఉన్నాయి. సమాజానికి, చదివే వారికి ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రపంచం మారినట్టు మనల్ని భ్రమింప చేస్తున్నది ఎప్పటికీ మారని మనుషుల ప్రవర్తన ఇటువంటి పుస్తకాలు చదివిన తర్వాత నైనా కొంచెం మార్పు తెచ్చుకుంటారేమో చూద్దాం.

“ఈ గల్పికా తరువు సంపాదకురాలు 'జ్వలిత'. జ్వలిత గారు చేసిన ఈ మంచి పనికి అభినందించకుండా ఉండలేం. కనుమరుగైన ఈ ప్రక్రియ వెలుగులోకి తేవడం ఒకటి, ఇంకా ఈ ప్రక్రియ కోసం ముందు కృషిచేసిన రచయితలు ఎవరెవరు ఉన్నారో వారిని అందరికి పరిచయం చేయడం ప్రశంసనీయం.

ఈ పుస్తకంలో రాసిన రచయితలు పాతవారున్నారు, కొత్తవారున్నారు, ఇప్పుడిప్పుడే కలం పట్టిన వారూ ఉన్నారు. పట్టు వదలని అకుంఠిత దీక్షతో ప్రపంచం మొత్తం భయంకర విపత్తు ఎదుర్కొంటున్న ఈ తరుణం లో అందరిని చైతన్యపరుస్తూ ఈ గల్పికలు రాయించి అచ్చు వేయడం అభినందనీయం.

ఈ కరోనా వల్ల ప్రజలు కొంత దగ్గర అయ్యారు, కొంత దూరం అయ్యారు. కొందరు పాఠాలు నేర్చుకున్నారు, కొందరు ఎప్పటికి మారకుండా అలాగే ఉన్నారు అటువంటి వారు ఎన్నడు మారతారో, ఎప్పటికి మారతారో ఆ కాలమే చెప్పాలి మరి.

ఈ గల్పికలు పాఠకులు చదవడానికి అనుకూలంగా, సరళమైన భాషలో, సులువుగా అద్భుతంగా ఉన్నాయి. అందరు తప్పక చదవాల్సిన పుస్తకం. ఇంత మంచి పుస్తకం మనముందుకు తీసుకుని వచ్చిన ' జ్వలిత ' గారికి మరోమారు హృదయపూర్వక అభినందనలు తెలుపుతూ సాహిత్య రంగంలో ఇంకా మరిన్ని రచనలు చేయాలని కోరుకుంటూ....

ప్రతులకు : **జ్వలిత, సాహితీవనం,15-21-130/2,**
**బాలాజీ నగర్, కుకట్ పల్లి, హైదరాబాదు-500072.**
**చరవాణి: 9989198943**

# పద్మవ్యూహం

ఒక్క క్షణం ఆగాలి
ఎంత పెద్ద విషయాన్నయినా
ఓ తాడుతో చుట్టలుగా చుట్టినట్టు
కట్టిపడేసయినా సరే
సమయం కొరకు వేచిచూడాలి

ఎక్కడి నుంచి ఎక్కడకు వేలం వేసినా
నువ్వు శూన్యం నుండి
శూన్యంలోకేనని తెలిసినా
నిన్ను నువ్వు పాదాల నుండి తలదాకా
వరుసలు వరుసలుగా సర్దుకోవాలి

తిందామనుకున్న పండు
రేపటికి దొరకొచ్చు
ఇవ్వాల్టి దొంగనూ
రేపు దొరకబట్టుకోవచ్చు
పెచ్చులు పెచ్చులుగా ఊడిపోయిన నిన్ను
అతుకుబెట్టుకోవడానికి నువ్వుండాలి కదా
అందరిలో ఓ వెలుగు నింపడానికి
నీ పెదాల మీద కాసే నవ్వుల వెన్నెల
తొంగి తొంగి చూడాలి కదా

కష్టాలను సుతిమెత్తని పూలల్లా
పెరట్లో నాటుకున్నవాడవు
నరనరాన రక్తపు మరకల
తోరణాలను చుట్టుకొని
దేహమంతా గాయమై పూసినవాడవు

రాయాల్సిన వాక్యాలెన్నో
మిగిలే ఉన్న నీ జీవితాన
ఎన్ని పూలు ముళ్ళలా
గుచ్చుకున్నాయో
ఎన్ని చూపుడు వేళ్ళు నీ మీదకు
రాళ్ళయి విసరబడ్డాయో
ఏ రోజైనా ప్రశాంతంగా
నిద్రదుప్పటిని కప్పుకొని ఎరుగవు

చిన్నదానికే చిందేస్తావు
నిన్న, మొన్నల్లోనే జీవిస్తావు
ఈ ప్రపంచమంతా
నిన్నో పావును చేసి వాడుకుంటుంది
కాదు కాదు
కావలసిన స్థానాల్లో నిల్పోబెట్టి
ఓ ఆట ఆడుకుంటుంది

నువ్వు "కావ్ కావ్" మనక ముందే
కాకి అంటారు
'అమ్మ, ఆవు' అనే రెండుపదాలంటే
చాలు
'వావ్' అంటారు

నిన్ను అక్కడక్కడే ఆపేస్తారు
అంతుచిక్కని నిర్జన ప్రదేశంలోకి
నెట్టేసి
నీ అమాయకత్వానికి
ఆనందపడుతారు

నిన్నో అభిమన్యుడిని చేసి
సగం కథ చెప్పి
పద్మవ్యూహంలోనే పాడెకడతారు

ఎక్కడ, ఎప్పుడూ,ఎవ్వరిలో
నీదంటూ ఓ ముద్ర లేకుండా
నీళ్ళారబోసిన మాంసపుముద్దను
చేసి
ముక్కున కరుచుకొని వెళ్ళిపోతారు

**తండ హరీష్ గౌడ్**
ఫోన్ : 897 843 9551

# ప్రాణ నేస్తాలు

కరోనా కాలంలో
బతుకు పోరాటం
ఎటుచూసినా ఏడ విన్నా
గాలి లేక ప్రాణాలు
గాల్లో కలువ వట్టే
లోకమంతా గాలి భయం
అయినా
గాలి లేక చచ్చుడేంది

ప్రకృతి బతకనిస్తే
మనిషి చేసే పాడు పనులతో
ఉర్వికే ఉచ్చు బిగుస్తోంది
అందుకేనేమో
ప్రకృతి పగతో
గాలినే పాశంగా మార్చి
కరోనాకాలుడై కబళిస్తుంది
మనిషి ప్రాణాలు

అందాల అవనిలో
కనీస అవసరాల కల్పన
ప్రకృతి సహజ ప్రసాదం
పైసలే అసహజ ప్రాపకం
ప్రాపకంతో ప్రసాదం మెక్కి


నిత్య అసంతృప్తితో
జీవిత ఆస్వాదన కోల్పోయి
"అర్థ" ఆకలితో
అనుక్షణం హోరతయ్యే
మనిషితత్వ హీనుడిపై
మనీతత్వ మోహుడిపై
అవని ఆగ్రహించింది
ఈ ఆగ్రహంతో
మనిషి ఏ గ్రహానికో
పలాయనం చెందాలి
అందుకే
పాడురోగం చంపుతుంది
చావు భీతితోనైనా చలించిపోయి

చెదిరిన జీవితాన్ని
చక్కదిద్దుకోవాలి
చిక్కనైన దారిలో
నడవాలి


పంచభూతాలు
మనిషి ప్రాణ నేస్తాలు
స్వచ్ఛమైన స్నేహహస్తాలు
అందుకో మానవుడా
అందుకొని స్వేచ్ఛగా
జీవించు
కరోనామహమ్మారిని
జయించు

**జినుకుల వెంకటేశ్**
కరీంనగర్,
ఫోన్ : 965 209 2120


## స్వీ'కృతి'




**నేను ముంబైకర్ ని (దీర్ఘ కవిత)**
సంగెవేని రవీంద్ర
**వెల :** 100/-
**ప్రతులకు :** సి.వి. కాంపౌండ్ 7/4, హనుమాన్ లేన్, లోయర్ పారెల్, ముంబై - 400 013
ఫోన్: 09987145310 / 08356962974



**చెదరని జ్ఞాపకం**
**(ప్రేమ మొగ్గలు)**
ఓర్సు రాజ్ మానస
**ప్రతులకు :** రచయిత, 6-28, గ్రా. జైన, ధర్మపురి మండలం. జగిత్యాల జిల్లా.
ఫోన్ : 9849446027



**నిర్వచన శిల్పకళా విజయము**
మన్నె రాములు.. పరిష్కర్త : డా. కపిలవాయి లింగమూర్తి. **వెల :** 50/-
**ప్రతులకు :** యం.డి. జహంగీర్, 11-45, రాంనగర్ కాలనీ, నాగర్ కర్నూల్ జిల్లా.
పిన్ : 509 209. ఫోన్ : 949 307 9850



**విభక్తి ప్రపత్తి - ఉదాహరణ కావ్యము**
మరుమాముల దత్తాత్రేయ శర్మ
**వెల :** 50/-
**ప్రతులకు :** రచయిత, 29-1499/6/1, శ్రీరామ సదనం, రోడ్ నెం. 1, వెస్ట్ కాకతీయ నగర్, సికిందరాబాద్ - 500 056.
ఫోన్ : 9441039146



**ఇన్ బాక్స్,** తండ హరీష్ గౌడ్
**వెల :** 100/-
**ప్రతులకు :** రచయిత,
గూడూరు గ్రామం/మండలం. మహబూబాబాద్ జిల్లా. - 506 134. అన్ని పుస్తక కేంద్రాలు.
ఫోన్ : 89784 39551



**పుస్తకపాణీ! శతకము**
మరుమాముల దత్తాత్రేయ శర్మ
**వెల :** 50/-
**ప్రతులకు :** మరుమాముల వేంకటరమణ శర్మ, దర్శనమ్ - ఆధ్యాత్మిక వార్త మాస పత్రిక, న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికిందరాబాద్ - 500056.
ఫోన్ : 9441015469

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**

**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

# బ్యాచిలర్ రూం...

తగుళ్ళ గోపాల్
ఫోన్ : 95050 56316

1
పట్నమొచ్చిన కొత్తలో
ఎంతో అందంగా ఉండేదీ రూము
నక్షత్రశాల నాంపల్లిలో కాదు
మా కళ్ళలోనే ఉండేది
అమ్మ పెట్టిన పచ్చళ్ళు
అక్కలు పంపిన కూరగాయలతో
అచ్చం నారుమడిలాగ ఉండేది

ఆపదొచ్చి మా ఊరొాళ్ళు సిటీవస్తే
ఒకపూట బువ్వబెట్టి అర్సుకునేది
ఎగ్జామ్ సెంటర్ పట్నంలో బడితే
ముందు రోజు రాత్రే
తమ్ముడిని పిల్చుకున్న ఆరివారం దీనిది

2
చాటింగ్ బాక్స్ నుంచి
బయటకురాని ఎస్.ఎం.ఎస్ సంతుగాడు
నచ్చిన అంగిని మాయం చేసే
ఛూమంత్రకాళి విట్టుగాడు
నెత్తి దువ్వుకుంటూ
అద్దంముందు తపస్సు జాన్సన్ గాడిది

ఆదివారాన్ని బిర్యానీ పొట్లంగా మార్చి
నోటికి ఉప్పుకారం రుచి చూపించే కిషన్
అరే మామ ...సినిమా మస్తుందిరా అని
దిగులును తరిమే అద్భుతదీపం రూప్ సింగ్ జీ

ఆరు ఋతువులు ఒకే సారి
మా రూములో వాలినట్టు
అలుగడాలు, ఆట పట్టించడాలు
రంగులు లేవన్న మాటే గానీ
మాటలహోళి పండుగ లేనిదెన్నడు?
సంతోషాన్ని, దుఃఖాన్ని
ఎలా చెరిసగం చేసుకొని తినాలో
నేర్పుకుంటూ వచ్చింది మాకు

3
కిరాయి కట్టమని జెప్పె ఇంటిఓనర్ లాగ
ఒకటో తారీఖులు
వస్తుంటాయి, పోతుంటాయి

నిన్న రాత్రి పరిచిన సాప
రోజంతా నిద్రలేవకుంటనే పడుంటది
గదిలో బూజును జూసి
చీపురు కూడా ముక్కున వేలేసుకుంటది

చిక్కులు పడ్డ దారపుకండెలాగ మనసు
ఏం చేయాలో తెలువదు
టీస్టాలు దగ్గర నిలబడి
"వన్ బై టూ" అల్లంటీ ని ఆర్డర్ చేస్తాం
జీవితం చప్పగా ఎందుకుందో అర్థంగాదు
లైటర్ వెలుగులో
మసకమసకగా బూడిదరంగు జీవితం

4
ఇష్టంగా అతికించుకున్న హీరోయిన్ల బొమ్మలు
ఒక్కొక్కటిగా చినిగిపోతుంటాయి
గోడల మీద పెన్సిల్ తో రాసిన రెండు పేర్లను
చెరిపేయడానికి మనసు రాదు
"త్వరలో నోటిఫికేషన్" కటింగ్ పేజీ
హాస్టల్ వార్డెన్ లాగ నిద్ర లేపుతుంటుంది

ఏ ఉద్యోగం గింజ మీద
మా పేరు రాసుండదు
ఒకటో, అర మార్కో
బేతాలుడిలాగ బతుకుకొమ్మకు
వేలాడదీస్తుంది

క్యాటరింగ్ బాయ్, కర్రీస్ పాయింట్
క్లినిక్ లో పార్ట్ టైం జాబ్, హోంట్యూషన్లు
ఎన్ని అవతారాలెత్తినా
సగం కడుపు ఖాళీగానే

5
బాగా అలిసిపోయి రూముకి వచ్చినప్పుడు
ఎర్రమన్ను అంటిన చేతులు
నాగలి వెంట నడిచిన బురద కాళ్ళు
గుర్తుకొస్తుంటాయి
కంటివాకిట్లో
మేకపిల్ల ఎగురుతుంటది
బొల్లెద్దు
గుండెగుంజకు కట్టేసి వుంటది.

ఊపిరాడక ఇంటికి ఫోన్ చేస్తే
సరిపడ బ్యాలెన్స్ లేవనీ
ఓ ఆడగొంతు
జీవితాన్ని వెక్కిరిస్తుంటది

6
నల్లని ఒత్తైన జుట్టుకు
కాలం తెల్లరంగు వేసిపోతుంది
రూములో ఎవ్వరూ లేనప్పుడు
అద్దం ముందు నిలబడితే
రాలిపోతున్న వెంట్రుకలలాగే కలలు

**కీ.శే. డా. పోరంకి దక్షిణామూర్తి గారిపై మూసీ ప్రత్యేక సంచిక**
ఇటీవల పరమపదించిన ప్రముఖ సాహితీవేత్త, కథావిమర్శకులు, పరిశోధకులు, ఆధ్యాత్మిక గ్రంథాల అనువాదకులు అయిన డా. పోరంకి దక్షిణామూర్తి గ్రంథాలను పరిచయం చేస్తూ వెలువడుతున్న ప్రత్యేక మూసీ సంచిక జూన్ 2021 లో మీ చేతిలోకి... సంపాదకులు